

తెలంగాణకు నిత్యస్ఫూర్తి జయశంకర్ సార్ జయంతి నేడు

నమస్తే తెలంగాణ

మన రాష్ట్రం మన పత్రిక

NAMASTE TELANGANA

పోటీ పరీక్షలు, అకడమిక్‌కు సంబంధించిన మెటీరియల్ నేటి 'నిపుణ' ఈ పేపర్‌లో..

మంగళవారం TUESDAY 6.8.2024 | హైదరాబాద్ HYDERABAD | పేజీలు: 12+4 Pages: 12+4 | సంపుటి (Volume): 14 ‖ సంచిక (Issue): 62 ‖ వెల (Price) రూ.6.50

మంగళగౌరీ వ్రతం

మంగళవారం, సూర్యోదయం: 5-57, సూర్యాస్తమయం: 6-47. శ్రీ క్రోధి నామ సంవత్సరం దక్షిణాయనం వర్ష రుతువు శ్రావణ మాసం శుక్ల పక్షం తిథి: విదియ రాత్రి 7-59 వరకు. నక్షత్రం: మఖ సాయంత్రం 5-44 వరకు. వర్జ్యం: రాత్రి 2-40 నుంచి తెల్లవారుజామున 4-27 వరకు. రాహుకాలం: పగలు 3-33 నుంచి సాయంత్రం 5-09 వరకు. దుర్ముహూర్తం: ఉదయం 8-31 నుంచి ఉదయం 9-22 వరకు, పునర్ దుర్ముహూర్తం: రాత్రి 11-14 నుంచి రాత్రి 11-59 వరకు. అమృతకాలం: పగలు 3-05 నుంచి పగలు 4-51 వరకు.

PUBLISHED FROM HYDERABAD • KARIMNAGAR • WARANGAL • KHAMMAM • NALGONDA • MAHABUBNAGAR • NIZAMABAD

www.ntnews.com /ntdailyonline

నీకు రుణమాఫీ కాదయ్యా!

• రుణ విలాపం



ఫొటోలో కంటతడి పెడుతూ కనిపిస్తున్న వ్యక్తి వడ్డె చంద్రయ్య. మహబూబ్‌నగర్ జిల్లా కోయిలకొండ మండలం చంద్రాస్‌పల్లి గ్రామానికి చెందిన రైతు. రెక్కాడితే కాని డొక్కాడని పేద కుటుంబం. సాగు కోసం బ్యాంకులో తీసుకున్న 70వేల లోన్.. కాంగ్రెస్ రుణమాఫీతో తీరుతుందని ఆశపడ్డాడు. అన్ని అర్హతలున్నా ఆయన రుణం మాఫీ కాలేదు. దిక్కుతోచక సోమవారం కలెక్టరేట్‌కు వచ్చి ప్రజావాణిలో విన్నవించుకుంటూ ఇలా విలపించారు.

సర్కారు మాఫీ వర్తించదంటున్న బ్యాంకర్లు

ప్రజావాణిలో బోరున విలపించిన పేదరైతు

రుణమాఫీ కాని రైతులు లక్షల్లో

- గతంకంటే లబ్ధిదారులు ఎందుకు తగ్గారు?
- కాంగ్రెస్‌పై రైతులకు భ్రమలు తొలిగాయి
- పాస్‌బుక్ ఉన్నా వర్తించని రుణమాఫీ
- చర్చకు సిద్ధమా?.. నిరంజన్‌రెడ్డి సవాల్

హైదరాబాద్, ఆగస్టు 5 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో రుణమాఫీ కాని రైతులు లక్షల సంఖ్యలో ఉన్నారని, వారికి అండగా నిలిచేందుకు తెలంగాణభవన్‌లో ప్రత్యేక సెల్‌ను ఏర్పాటు చేశామని వ్యవసాయ శాఖ మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి వెల్లడించారు. ఈ ప్రత్యేక సెల్‌లో ఇద్దరు నిపుణులు అందుబాటులో › 2వ పేజీలో



83748 52619

మాఫీ బాధితుల కోసం బీఆర్‌ఎస్ వాట్సాప్ నంబర్

- తెలంగాణభవన్‌లో ప్రత్యేక సెల్ ఏర్పాటు
- రైతుల, రుణాల వివరాలు పంపాలంటూ సూచన
- ఐదు గంటల్లోనే 15 వేలకు పైగా ఫిర్యాదులు › 2

అప్పు కట్టించుకోని బ్యాంకులు!

- 2 లక్షలకుపైగా రుణం ఉన్న రైతులకు కొత్త చిక్కు
- ఆపై మొత్తం చెల్లిస్తేనే మాఫీ చేస్తామని సర్కార్ మెలిక
- అప్పో సప్పో చేసి చెల్లింపులకు సిద్ధమవుతున్న రైతులు
- ఇప్పుడు అక్కరలేదంటున్న బ్యాంకు అధికారులు
- దిక్కుతోచని స్థితిలో రైతులు › 2



బంగ్లా షేక్.. హసీనా ఔట్

- బంగ్లాదేశ్‌లో తీవ్ర రాజకీయ సంక్షోభం
- ఆర్మీ అల్టిమేటంతో ప్రధాని రాజీనామా
- సోదరితో కలిసి విమానంలో భారత్‌కు
- ఆర్మీ ఆధ్వర్యంలో తాత్కాలిక ప్రభుత్వం
- ప్రధాని నివాసంలో ఆందోళనకారుల లూటీ
- సర్కారును కూల్చిన ఉద్యోగ రిజర్వేషన్ల అంశం

బంగ్లాదేశ్‌లో సోమవారం తీవ్ర రాజకీయ సంక్షోభం తలెత్తింది. ఉద్యోగ రిజర్వేషన్ల చిచ్చు కారణంగా అదుపు తప్పిన అల్లర్ల నేపథ్యంలో ప్రభుత్వం కుప్పకూలింది. ప్రధాని పదవికి షేక్ హసీనా రాజీనామా చేసి సోదరితో కలిసి భారత్‌కు వచ్చారు. త్వరలో తాత్కాలిక ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయనున్నట్టు ఆర్మీ చీఫ్ ప్రకటించారు. ప్రజలంతా శాంతియుతంగా ఉండాలని కోరారు. పొరుగు దేశంలో పరిస్థితిని గమనించిన భారత ప్రభుత్వం.. సరిహద్దుల్లో అప్రమత్తంగా వ్యవహరించాలంటూ బీఎస్‌ఎఫ్‌ను ఆదేశించింది. › 7

మెడికల్ సీట్లలో లోకల్‌కు కోత

అడ్మిషన్లలో స్థానికతకు అన్యాయం.. రాష్ట్ర ప్రభుత్వ తాజా ఉత్తర్వులతో తీవ్ర నష్టం



ఇలాంటి విద్యార్థులు ఎందరో!

ఈ ఫొటోలోని అమ్మాయి పేరు కొంగర స్ఫూర్తి. హనుమకొండలో ఒకటో తరగతి నుంచి పదో తరగతి వరకు చదివింది. ఇంటర్మీడియట్‌ను ఏపీలోని విజయవాడలో పూర్తిచేసింది. నీట్‌లో ఎస్సీ క్యాటగిరీలో ఆలిండియా ర్యాంకు 35,655 సాధించింది. గత ప్రభుత్వ విధానాల ప్రకారం ఆమెకు స్థానిక రిజర్వేషన్ వర్తిస్తుంది. 6-12(ఇంటర్) వరకు గరిష్ఠంగా ఎక్కడ నాలుగేండ్లు చదివితే అక్కడ స్థానికులుగా గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం పరిగణించింది. కానీ, కాంగ్రెస్ ప్రభుత్వం గత నెల 19న జారీచేసిన జీవో 33 ప్రకారం ఆమె నాన్‌లోకల్. ఈ జీవో ప్రకారం 9-12(ఇంటర్) వరకు తెలంగాణలో చదివిన వాళ్లే స్థానికులు. హైదరాబాద్‌లో ఉన్నతస్థాయి కార్పొరేట్ విద్యాసంస్థలు ఉన్నందున, ఇక్కడ మెరుగైన బోధన లభిస్తుందనే ఉద్దేశంతో ఇతర రాష్ట్రాల నుంచి వచ్చి 9వ తరగతి నుంచి ఇంటర్ చదివిన వాళ్లు ఇప్పుడు స్థానికులు అయిపోయారు. అస్తిత్వం కోసం పోరాడిన తెలంగాణలో, ఇక్కడి బిడ్డలే ఇప్పుడు నాన్‌లోకల్‌గా మారిపోతున్నారు.

- నిరుటి వరకు 6 నుంచి ఇంటర్ దాక ఏవైనా నాలుగేండ్లు ప్రామాణికం
- ఇప్పుడు 9 నుంచి ఇంటర్ వరకే!
- హైదరాబాద్‌లో చదువుకున్న ఇతర రాష్ట్రాల వారికీ లభించనున్న స్థానికత
- తెలంగాణలో పుట్టి ఇతర రాష్ట్రాల్లో చదివిన వారు స్థానికులు కానట్టే!
- ఏపీ విద్యార్థుల ప్రయోజనం కోసమా? ప్రైవేటు కాలేజీల లబ్ధి కోసమా?



రాష్ట్రంలో మొత్తం ఎంబీబీఎస్ సీట్లు : 8,715
ప్రభుత్వ కాలేజీల్లో సీట్లు: 4,115
కన్వీనర్ కోటా: 3,498
నేషనల్ పూల్ సీట్లు : 617
ప్రైవేట్ కాలేజీల్లో ఎంబీబీఎస్ సీట్లు: 4,600
కన్వీనర్ కోటా సీట్లు : 2,300

వరంగల్, ఆగస్టు 5 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): ఎంబీబీఎస్, బీడీఎస్ అడ్మిషన్లలో రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా తెచ్చిన నిబంధనలు తెలంగాణ విద్యార్థులకు అన్యాయం చేసేలా ఉన్నాయి. స్థానికతపై రాష్ట్ర ప్రభుత్వం తాజాగా ఇచ్చిన ఉత్తర్వులతో తెలంగాణ పిల్లలకు నష్టం జరుగుతున్నది. ఎంబీబీఎస్, బీడీఎస్ కోర్సుల్లో అడ్మిషన్ల కోసం కాళోజీ నారాయణరావు యూనివర్సిటీ ఆఫ్ హెల్త్ సైన్సెస్ ఈ నెల 3న నోటిఫికేషన్ జారీ చేసింది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టం ప్రకారం విద్యాసంస్థల అడ్మిషన్లలో 2014 నుంచి 2024 వరకు ఆంధ్రప్రదేశ్ విద్యార్థులకు కోటా ఉన్నది. ఈ చట్టంలో పేర్కొన్న గడువు ముగిసిన నేపథ్యంలో తాజా అడ్మిషన్ల ప్రక్రియ కోసం కాళోజీ హెల్త్ యూనివర్సిటీ మార్గదర్శకాలు విడుదల చేసింది. స్థానికత నిర్ధారణపై గతంలో ఉన్న నిబంధనల్లో మార్పులు చేసింది. రాష్ట్ర ప్రభుత్వం జూలై 19న జారీ చేసిన 33జీవో ప్రకారం స్థానికత నిబంధనలను పేర్కొన్నట్టు తెలిపింది. ఈ నిబంధనలతో అన్యాయం జరిగేలా ఉన్నదని స్థానిక విద్యార్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. 9వ తరగతి › 6వ పేజీలో



నిండా ముంచిన బ్లాక్ మండే

- భీకర నష్టాల్లో దేశీయ స్టాక్ మార్కెట్లు
- సెన్సెక్స్ 2,222, నిఫ్టీ 662 పాయింట్లు పతనం
- ఒక్కరోజే రూ.15.32 లక్షల కోట్ల సంపద ఆవిరి
- చుట్టుముట్టిన అమెరికా మాంద్యం భయాలు

అగ్రరాజ్యం అమెరికా ఆర్థిక వ్యవస్థపై ఆవరించిన భయాలు.. ప్రపంచ మార్కెట్లను వణికించాయి. సోమవారం భారత్‌సహా ప్రధాన ఆసియా, ఐరోపా మార్కెట్లు కుప్పకూలాయి. మదుపరులు ఒక్కసారిగా లాభాల స్వీకరణకు తెగబడ్డారు. దీంతో అన్ని రంగాల షేర్లు అమ్మకాల ఒత్తిడికి లోనయ్యాయి. ఫలితంగా బీఎస్‌ఈ సెన్సెక్స్ 2,222.55 పాయింట్లు పతనమై 80వేల మార్కుకు దిగువన 78,759.40 వద్దకు పడిపోయింది. ఎన్‌ఎస్‌ఈ నిఫ్టీ 662.10 పాయింట్లు క్షీణించి 24,055.60 వద్దకు దిగజారింది. దీంతో జూన్ 4న లోక్‌సభ ఎన్నికల ఫలితాల దెబ్బకు మార్కెట్ కుదేలైన తర్వాత మళ్లీ ఇప్పుడే భారీ నష్టాలను చవిచూసింది. ఒక్కరోజే రూ.15.32 లక్షల కోట్ల మదుపరుల సంపద హరించుకుపోయింది. › 12



కో అంటే కోటి!

రవాణా శాఖలో ఘరానా వసూళ్లు!

- ప్రభుత్వ పెద్దల సన్నిహితుడి కనుసన్నల్లో వ్యవహారం
- విచ్చలవిడిగా మామూళ్ల దందా
- 13 ఆర్టీఏ చెక్‌పోస్టుల ద్వారా రోజుకు కోటికి పైగా వసూల్?
- కేంద్ర ప్రభుత్వానికి, కాంగ్రెస్ అధిష్ఠానానికి ఫిర్యాదు?
- రవాణాశాఖ ఉద్యోగుల పేర్లతో లేఖలు వైరల్ › 2

ఉప ఎన్నికలు తప్పవు

ఫిరాయింపుదారులకు ప్రజాక్షేత్రంలోనే బుద్ధి చెప్తాం: కేటీఆర్



సోమవారం ఢిల్లీలో ప్రముఖ న్యాయవాదులతో భేటీ అయిన కేటీఆర్, హరీశ్, జగదీశ్, గంగుల, కొత్త ప్రభాకర్‌రెడ్డి, వద్దిరాజు తదితరులు

- ఫిరాయింపులపై సుప్రీంకు వెళ్లే యోచనలో బీఆర్‌ఎస్
- ఢిల్లీలో రాజ్యాంగ నిపుణులు, న్యాయకోవిదులతో కేటీఆర్ నేతృత్వంలోని ప్రతినిధి బృందం భేటీ

హైదరాబాద్, ఆగస్టు 5 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో ఉపఎన్నికలు తప్పవని, పార్టీ మారిన ఎమ్మెల్యేలకు ప్రజాక్షేత్రంలోనే బుద్ధి చెప్తామని బీఆర్‌ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కే తారకరామారావు హెచ్చరించారు. ఒకవైపు జాతీయ స్థాయిలో పార్టీ ఫిరాయింపులపై సుద్దులు చెప్తూ తెలంగాణలో మాత్రం రాజ్యాంగ స్ఫూర్తిని దెబ్బతీసేలా కాంగ్రెస్ పార్టీ ఫిరాయింపులను ప్రోత్సహిస్తున్నదని మండిపడ్డారు. త్వరలోనే కోర్టుల సహాయంతో కాంగ్రెస్‌కు సరైన గుణపాఠం చెబుతామని పేర్కొన్నారు. సోమవారం ఢిల్లీలోని పలువురు ప్రముఖ న్యాయకోవిదులతో, రాజ్యాంగ నిపుణులతో పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కే తారకరామారావు ఆధ్వర్యంలో నాయకుల బృందం చర్చలు జరిపింది. ఈ సందర్భంగా పార్టీ ఫిరాయింపుల విషయంలో ఇప్పటికే › 2వ పేజీలో

స్పీకర్ చర్యలు తీసుకోరా?

- నెల గడిచింది.. మరో 3 నెలలైనా ఇంతేనా?
- కేసు కొలిక్కి వచ్చే వరకూ నిర్ణయం తీసుకోరా?
- ఫిరాయింపులపై ఏజీని ప్రశ్నించిన హైకోర్టు



హైదరాబాద్, ఆగస్టు 5 (నమస్తే తెలంగాణ): పార్టీ ఫిరాయింపులకు పాల్పడిన ఎమ్మెల్యేల విషయంలో చర్యలు లేకపోవడంపై రాష్ట్ర హైకోర్టు తీవ్రంగా స్పందించింది. పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలపై చర్యలకు తాము ఆదేశాలు జారీచేసే వరకు స్పీకర్ నిర్ణయం తీసుకోరా? అని అడ్వకేట్ జనరల్‌ను ప్రశ్నించింది. నెలల కాలం గడిచిపోయిందని, అయినా స్పీకర్ ఎందుకు నిర్ణయం తీసుకోలేదని ఏజీని నిలదీసింది. కోర్టు ఆదేశాలు ఇవ్వాలన్న పిటిషన్లపై › 2వ పేజీలో



విస్తరణ దిశగా కాగ్నిజెంట్

- 10 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో క్యాంపస్
- దాదాపు 15 వేల మంది యువతకు ఉద్యోగాలు › 6
- అమెరికాలో సీఎంతో కంపెనీ ప్రతినిధుల చర్చలు




స్కిల్ వర్సిటీ చైర్మన్‌గా ఆనంద్ మహీంద్ర

అమెరికా పర్యటనలో సీఎం రేవంత్ ప్రకటన › 6

50:50 ఆశతోనే అరాచకం!

- షాద్‌నగర్ ఘటనలో ఫిర్యాదుదారుతో పోలీస్ కుమ్మక్కు
- రికవరీ సొమ్ములో సగం వాటా తీసుకునేలా ఒప్పందం
- అందులో భాగంగానే దళిత మహిళపై థర్డ్‌డిగ్రీ
- టెక్నాలజీని వదిలి మూసపద్ధతిలో లాకప్ విచారణ
- అసెంబ్లీ నేపథ్యంలో బయటకు రాకుండా జాగ్రత్త

హైదరాబాద్ సిటీబ్యూరో, ఆగస్టు 5 (నమస్తే తెలంగాణ): 'విధి నిర్వహణలో వచ్చే జీతం, పేరు ప్రఖ్యాతల కంటే అప్పనంగా వచ్చే సొమ్ముకు ఆశపడే షాద్‌నగర్ ఘటనలో పోలీసులు అరాచకానికి పాల్పడ్డారా?' అంటే 'అవును' అనే సమాధానమే వస్తున్నది. ఒకటీ అరా కాదు.. పోయిన 22 తులాల బంగారం రికవరీ చేస్తే ఏకంగా › 3వ పేజీలో



పోలీస్ వేధింపుల బాధితురాలిని పరామర్శిస్తున్న బీఆర్‌ఎస్ నేతలు సబిత, వాణీదేవి తదితరులు

ఈ నగరానికి ఏమైంది?



బాలికను నిర్బంధించి లైంగికదాడి › 3

- ఇంట్లో ఒంటరిగా ఉన్నప్పుడు అఘాయిత్యం
- బేగంపేటలో ఘటన.. పరారీలో నిందితుడు
- వరుస ఘటనలతో నగరవాసుల్లో ఆందోళన

హైదరాబాద్‌లో బాలుడి కిడ్నాప్?

- 24 గంటలు గడిచినా దొరకని ఆచూకీ › 3
- 4 బృందాలతో గాలింపు: సీఐ నాగరాజు
- అదృశ్యమా? కిడ్నాపా? అని అనుమానం



ఇబ్రహీంపట్నం ఆర్డీవో కార్యాలయంలో రికార్డులు పరిశీలిస్తున్న కలెక్టర్

'రాచకొండలో అరాచకకాండ'పై 2 రోజుల్లో నివేదికివ్వండి

- ఇబ్రహీంపట్నం ఆర్డీవోకు జిల్లా కలెక్టర్ ఆదేశం
- ఆర్డీవో కార్యాలయంలో కలెక్టర్ శశాంక్ తనిఖీ › 8
- 'నమస్తే తెలంగాణ' కథనానికి స్పందన

నమస్తే తెలంగాణ

ప్రొఫెసర్ జయశంకర్ అడుగుజాడల్లోనే రాష్ట్రసాధన

- స్వరాష్ట్ర ప్రగతిలో సార్ స్ఫూర్తిని కొనసాగించాం
- ఆ ప్రగతిని కొనసాగించడమే ఆయనకు ఘననివాళి
- స్మరించుకున్న బీఆర్ఎస్ అధినేత కేసీఆర్



హైదరాబాద్, ఆగస్టు 5 (నమస్తే తెలంగాణ): ప్రొఫెసర్ జయశంకర్ జయంతి(నేడు) సందర్భంగా ఆయన తెలంగాణ కోసం చేసిన కృషి, త్యాగాన్ని రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ స్మరించుకున్నారు. తొలిదశ నుంచి మలి దశ ఉద్యమం దాకా తెలంగాణ సాధన దిశగా ప్రొఫెసర్ జయశంకర్ చేసిన భావజాల వ్యాప్తి, దశాబ్దాలపాటు సాగిన ఉద్యమంలో వారు అందించిన పోరాటస్ఫూర్తిని కేసీఆర్ కొనియాడారు. వారి అడుగుజాడల్లో తాను మలిదశ ఉద్యమానికి సారథ్యం వహించి, చివరి దాకా శాంతియుత పద్ధతిలో, పార్లమెంటరీ పంథాలో ప్రజా ఉద్యమాన్ని కొనసాగించినట్టు చెప్పారు. చివరకు అరవై ఏండ్ల స్వయంపాలన ఆకాంక్షను నిజం చేసుకున్నామని కేసీఆర్ గుర్తుచేశారు. రాష్ట్ర సాధన అనంతరం ప్రజల మద్దతుతో మొట్టమొదటి ప్రభుత్వాన్ని ప్రొఫెసర్ జయశంకర్ స్ఫూర్తితోనే కొనసాగించామని కేసీఆర్ తెలిపారు. ఉద్యమాన్ని నడిపి గమ్యాన్ని చేరుకోవడంలోనూ, తదనంతరం పదేండ్ల అనతి కాలంలోనే దేశానికే ఆదర్శవంతమైన పాలన అందించడంలోనూ వారి స్ఫూర్తి ఇమిడివున్నదని కేసీఆర్ పేర్కొన్నారు. స్వరాష్ట్రంలో సబ్బండ వర్గాలను, సకలజనులను అన్ని రంగాల్లో ముందంజలో నిలిపిన బీఆర్ఎస్ పాలన స్ఫూర్తిని కొనసాగిస్తూ, తెలంగాణను మరింతగా ప్రగతి పథంలో నడిపేలా కృషి చేయడమే వారికందించే ఘననివాళి అని కేసీఆర్ తెలిపారు.

స్పీకర్ చర్యలు తీసుకోరా?

> మొదటిపేజీ తరువాయి...

విచారణ పూర్తయ్యే వరకు స్పీకర్ నిర్ణయం తీసుకోరా? అని సందేహం వ్యక్తంచేసింది. ఇప్పటికే నెల గడిచిందని గుర్తు చేసింది. మరో మూడు నెలల వరకు కోర్టు తేల్చకపోతే అప్పటివరకు స్పీకర్ చర్యలు తీసుకోరా? అని ఏజీని నిలదీసింది. బీఆర్ఎస్ తరఫున ఎన్నికై కాంగ్రెస్ పార్టీలో చేరిన కడియం శ్రీహరి (స్టేషన్ ఘన్‌పూర్), దానం నాగేందర్ (ఖైరతాబాద్), తెల్లం వెంకట్రావు (భద్రాచలం)పై అనర్హత వేటు వేయాలంటూ బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు పాడి కౌశిక్‌రెడ్డి, కేపీ వివేకానంద, బీజేపీ శాసనసభాపక్ష నేత మహేశ్వర్‌రెడ్డి వేర్వేరుగా దాఖలు చేసిన వ్యాజ్యాలపై హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బీ విజయసేన్‌రెడ్డి సోమవారం మరోసారి విచారణ జరిపారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి మాట్లాడుతూ.. కోర్టులో పిటిషన్లు పెండింగ్‌లో ఉన్నంత కాలం స్పీకర్ నిర్ణయం తీసుకోరా అని అడ్వకేట్ జనరల్ ఏ సుదర్శన్‌రెడ్డిని ప్రశ్నించారు. ఇవి రాజ్యాంగపరమైన విషయాలని, వాటిని కోర్టులు దాటవేయలేవని ఏజీ జవాబు చెప్పారు. స్పీకర్ వద్ద పిటిషన్ దాఖలు చేసిన పది రోజులకే పిటిషనర్లు హైకోర్టును ఆశ్రయించారని చెప్పారు. స్పీకర్ నిర్ణయం తీసుకునే వరకు కూడా ఆగలేదని, కనీస గడువు కూడా ఇవ్వలేదని తెలిపారు. రాజ్యాంగం ప్రకారం స్పీకర్ అత్యున్నత పదవని, స్పీకర్ నిర్ణయం తీసుకునే వరకు కోర్టులు జోక్యం చేసుకోరాదని, ఈ మేరకు సుప్రీంకోర్టు తీర్పులు ఉన్నాయని గుర్తుచేశారు. స్పీకర్ నిర్ణయం తీసుకున్నాక వాటిపై న్యాయ సమీక్షకు వీలుంటుందని తెలిపారు. హైకోర్టులో పిటిషన్ల కారణంగా స్పీకర్ నిర్ణయం తీసుకోవడం లేదంటూ గతంలో కడియం శ్రీహరి తరఫు సీనియర్ న్యాయవాది మయూర్‌రెడ్డి చెప్పారు. పిటిషనర్ల తరఫు సీనియర్ న్యాయవాదులు గండ్ర మోహన్‌రావు కల్పించుకుంటూ పిటిషన్ తీసుకోవడానికే స్పీకర్ కార్యాలయం నిరాకరించిందని చెప్పారు. హైకోర్టును ఆశ్రయించాకే స్పీకర్ కార్యాలయం పార్టీ ఫిరాయింపు ఎమ్మెల్యేలపై పిటిషన్లను తీసుకుందని గుర్తు చేశారు. నెల రోజుల తర్వాత కోర్టుకు వచ్చినట్లు చెప్పారు. స్పీకర్కు కోర్టులు ఆదేశాలు జారీ చేయవని, పదో షెడ్యూల్ ప్రకారం స్పీకర్ ట్రిబ్యునల్ చైర్మన్ హోదాలో పిటిషన్లను విచారణ చేస్తారని, ట్రిబ్యునల్ చైర్మన్కి కోర్టులు ఆదేశాలు జారీ చేయవచ్చునని చెప్పారు. స్పీకర్ తన ముందున్న పార్టీ ఫిరాయింపుల పిటిషన్లపై చర్యలు తీసుకోకుండా కాలయాపన చేయడం సరికాదన్నారు. ట్రిబ్యునల్ చైర్మన్గా స్పీకర్ నిర్దిష్ట గడువులోగా పిటిషన్లను విచారణ పూర్తి చేసి తుది నిర్ణయం చెప్పాలన్నారు. స్పీకర్కు ఉత్తర్వుల జారీ చేయరాదన్న పాత తీర్పులను ఉదహరిస్తున్నారని, తాజా సుప్రీంకోర్టు ఉత్తర్వుల ప్రకారం స్పీకర్ మూడు నెలల్లోగా తుది నిర్ణయం తీసుకోవాలని, లేనిపక్షంలో హైకోర్టులు/సుప్రీంకోర్టు జోక్యం చేసుకోవచ్చునని చెప్పారు. వాదనలు మంగళవారం కొనసాగనున్నాయి.

లోకం పోకడ



కేసీఆర్‌కు కోర్టు నోటీసులు

- మేడిగడ్డ బరాజ్ కుంగిన ఘటనపై పిటిషన్
- సెప్టెంబర్ 5న హాజరు కావాలన్న భూపాలపల్లి కోర్టు

జయశంకర్ భూపాలపల్లి, ఆగస్టు 5 (నమస్తే తెలంగాణ): కాళేశ్వరం ప్రాజెక్టులో భాగమైన మేడిగడ్డ బరాజ్ కుంగిన ఘటనపై భూపాలపల్లికి చెందిన నాగవెల్లి రాజలింగమూర్తి జిల్లా కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ప్రాజెక్టులో అవినీతి అక్రమాలు జరిగాయని, ఈ ప్రాజెక్టు అంచనా వ్యయాన్ని పెంచి ప్రజాధనం దుర్వినియోగం చేశారని, నాణ్యతాప్రమాణాలు పాటించలేదని పిటిషనర్ ఆరోపించారు. బొగ్గు పొరలున్న విషయాన్ని గుర్తించకుండా ఆ స్థలంలో ప్రాజెక్టు నిర్మించడంతో 7వ బ్లాక్‌లో ఒక పిల్లర్ కుంగిందని ఈ ఘటనపై విచారణ జరపాలని భూపాలపల్లి ప్రిన్సిపల్ జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టుకు విజ్ఞప్తిచేశారు. భూపాలపల్లి పోలీస్‌స్టేషన్‌లో మేడిగడ్డ బరాజ్ కుంగిన ఘటనపై ఫిర్యాదు చేసినప్పటికీ పట్టించుకోలేదని రాజలింగమూర్తి పేర్కొన్నారు. కేసీఆర్‌తోపాటు మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు, అప్పటి ఇరిగేషన్ కార్యదర్శి రజత్‌కుమార్, అప్పటి సీఎంవో స్మితాసభర్వాల్, చీఫ్ ఇంజినీర్లు శ్రీధర్, హరిరాం, మెఘా సంస్థ యజమాని కృష్ణారెడ్డి, ఎల్‌అండ్‌టీ జనరల్ మేనేజర్ సురేశ్‌కుమార్‌పై అభియోగాలు మోపి విచారణ చేపట్టాలని పిటిషనర్ కోరారు. ఈ పిటిషన్‌ను విచారణకు స్వీకరించిన కోర్టు కేసీఆర్‌తోపాటు ఎనిమిది మంది సెప్టెంబర్ 5న విచారణకు హాజరు కావాలని నోటీసులు పంపించింది.

ఉప ఎన్నికలు తప్పవు!

> మొదటిపేజీ తరువాయి...

మణిపూర్ ఎమ్మెల్యేకు సంబంధించిన కేసుతో సహా పలు కేసుల్లో సుప్రీంకోర్టు తీర్పులు ఇచ్చిందని రాజ్యాంగ నిపుణుడు చెట్పెట్ ఆర్యమాసుందరం పార్టీ బృందానికి వివరించారు. గతంలో మాదిరిగా అనర్హత వేటు విషయంలో సుదీర్ఘకాలం నిర్ణయం తీసుకోకుండా స్పీకర్ నాన్చలేరని స్పష్టంచేశారు. ఈ సందర్భంగా ముగ్గురు ఎమ్మెల్యేల అనర్హత వేటుకు సంబంధించి హైకోర్టులో వేసిన పిటిషన్‌తోపాటు పార్టీ మారిన ఎమ్మెల్యేలపై స్పీకర్‌కు ఫిర్యాదు చేసిన విషయాన్ని, వాటికి సంబంధించిన పత్రాలను న్యాయ నిపుణులకు బీఆర్ఎస్ నేతలు అందజేశారు. ప్రస్తుతం సుప్రీంకోర్టు మార్గదర్శకాలు స్పష్టంగా ఉన్నందున హైకోర్టు సైతం ఎక్కువ కాలం వాయిదా వేసే అవకాశం లేదని న్యాయ నిపుణులు అభిప్రాయపడ్డారు. హైకోర్టు నిర్ణయం త్వరగా ప్రకటించకుంటే సుప్రీంకోర్టుకు వెళ్లే అవకాశం ఉన్నదని చెప్పారు.

ప్రజాక్షేత్రంలో బుద్ధిచెప్తాం

సుప్రీంకోర్టు తీర్పులతోపాటు న్యాయ కోవిదులు, రాజ్యాంగ నిపుణులు చెప్తున్న సలహాలు, సూచనల మేరకు న్యాయపోరాటం కొనసాగిస్తామని కేటీఆర్ తెలిపారు. నెలలో పార్టీ మారిన ఎమ్మెల్యేలపై అనర్హత వేటు అంశం తేలిపోతుందని విశ్వాసం వ్యక్తంచేశారు. రాజ్యాంగ నిపుణులు, న్యాయ కోవిదులతో జరిగిన సమావేశంలో పార్టీ సీనియర్ నాయకులు, మాజీ మంత్రులు హరీశ్‌రావు, జగదీశ్‌రెడ్డి, గంగుల కమలాకర్, రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర, ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

రవాణాశాఖలో కో.. అంటే కోటి!

- ఆర్టీఏలో విచ్చలవిడిగా మామూళ్ల దందా?
- 13 చెక్‌పోస్టుల్లో కోటికిపైగా వసూలు?
- లంచాలతో అనర్హులకు పదోన్నతులు?
- ప్రభుత్వ పెద్ద సన్నిహితుడి కనుసన్నల్లో వ్యవహారం?
- కేంద్రానికి, కాంగ్రెస్ పెద్దలకు ఫిర్యాదు?
- ఆ శాఖ ఉద్యోగుల పేర్లతో లేఖలు వైరల్



హైదరాబాద్, ఆగస్టు 5 (నమస్తే తెలంగాణ): చెక్‌పోస్టుల నుంచి రోజుకో రూ.కోటి.. నిబంధనలకు విరుద్ధంగా ఒక్కో ప్రమోషన్‌కు రూ.కోటి.. ఇలా రవాణాశాఖలో 'కో.. అంటే కోటి' అన్నట్టుగా మామూళ్ల దందా సాగుతున్నదని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. రాష్ట్ర రవాణాశాఖ మొత్తం ప్రభుత్వానికి చెందిన ఓ పెద్ద మనిషి సన్నిహితుడి చెరలో చిక్కిందని జోరుగా ప్రచారం సాగుతున్నది. స్వయంగా ఆ శాఖ ఉద్యోగులే ఈ ఆరోపణలు చేస్తున్నారని.. ఈ పంచాయితీ ఏకంగా ఢిల్లీకి చేరిందని గుసగుసలు వినిపిస్తున్నాయి. ఆ శాఖ ఉన్నతోద్యోగిపై కేంద్ర ప్రభుత్వానికి, ప్రభుత్వ పెద్ద సన్నిహితుడిపై కాంగ్రెస్ అధిష్ఠానానికి ఫిర్యాదు చేశారంటూ రెండు లేఖలు సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్నాయి. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేకు, కాంగ్రెస్ పెద్దలు సోనియాగాంధీ, రాహుల్‌గాంధీ, ప్రియాంకగాంధీ, కేసీ వేణుగోపాల్, ఏఐసీసీ కమిటీ సభ్యులకు ఆ లేఖలను పంపుతున్నట్టు పేర్కొన్నారు. కొత్త ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత.. గతంలో రవాణాశాఖలో పని చేసిన ఓ వ్యక్తి ప్రభుత్వ పెద్ద దగ్గర చేరారని ఆ లేఖల్లో పేర్కొన్నా రు. ఆయన రవాణాశాఖను తన గుప్పిట్లోకి తీసుకున్నారని, ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. రాష్ట్రంలోని 13 చెక్‌పోస్టుల నుంచి రోజూ 1.20 కోట్లు వసూలు చేస్తున్నారని సోషల్ మీడియా పోస్టుల్లో వెల్లడించారు. ఆ సొమ్ము ప్రభుత్వ పెద్ద సన్నిహితుడితోపాటు రవాణాశాఖలోని ఓ ఉన్నతాధికారికి వెళ్తున్నాయని ఆరోపించారు.

మీటింగ్.. రైడింగ్..

సదరు ప్రభుత్వ పెద్ద సన్నిహితుడు.. రవాణాశాఖలో ఇద్దరికి అక్రమంగా పదోన్నతులు ఇచ్చేందుకు రూ.కోటి చొప్పున వసూలు చేశారనే ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి. సీనియార్టీ జాబితాలో వారు చాలా వెనుకబడి ఉండటంతో భారీ స్కెచ్ వేశాడని చెప్పుకుంటున్నారు. ఆ జాబితాలో ముందున్న వాళ్లతో ఓ మీటింగ్ పెట్టాడని, తనకు ఏం కావాలో స్పష్టంగా చెప్పి, బెదిరించి, 'మాకు ఇప్పుడు ప్రమోషన్ వద్దు' అని బలవంతంగా లేఖలు రాయించుకున్నాడని ప్రచారం జరుగుతున్నది. ఈ క్రమంలో ఒకరిద్దరు వ్యతిరేకించగా.. ఆ వెంటనే వారి వారి కార్యాలయాలపై దర్యాప్తు సంస్థల దాడులు జరిగాయని చెప్పుకుంటున్నారు. ఇది తెలిసి ఆ సంస్థ ఉన్నతాధికారి సైతం విస్తుపోయారని.. ఫిర్యాదు లేకున్నా ఎలా దాడులు జరిగాయని ప్రశ్నించినట్టు ప్రచారం జరుగుతున్నది. తనను ఎదిరిస్తే ఏం జరుగుతుందో చెప్పడానికి ఒక నమూనాగా ఈ దాడులు జరిపించారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఆ ఇద్దరి ప్రమోషన్ ఫైల్ ఇప్పుడు తుదిదశకు చేరినట్టు ప్రచారం జరుగుతున్నది. ఈ విషయం తెలిసి ప్రభుత్వంలోని ఓ ప్రజాప్రతినిధి అసహనం వ్యక్తం చేసినట్టు చెప్పుకుంటున్నారు.

ఢిల్లీకి చేరిన పంచాయితీ

ఈ వ్యవహారం ఢిల్లీకి చేరినట్టు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నది. ఈ మేరకు తెలంగాణ స్టేట్ ఆర్టీఏ ఆఫీసర్స్ అండ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ పేరుతో రెండు లేఖలు చక్కర్లు కొడుతున్నాయి. ఒకదానిలో రవాణాశాఖకు చెందిన ఓ ఉన్నతాధికారిపై డిపార్ట్‌మెంట్ ఆఫ్ పర్సనల్ అండ్ ట్రైనింగ్ (డీవోపీటీ)కి ఫిర్యాదు చేసినట్టు పేర్కొన్నారు. ప్రభుత్వ పెద్ద సన్నిహితుడి దయతో తాను ఆ ఉద్యోగంలో చేరినట్టు ఉన్నతాధికారి పదే పదే జపం చేస్తున్నారని, పూర్తిగా ఆయనకు అనుకూలంగా వ్యవహరిస్తున్నారని అందులో ఆరోపించారు. ఈ లేఖను సెంట్రల్ విజిలెన్స్ కమిషనర్‌కూ పంపినట్టు తెలిపారు. మరో లేఖను కాంగ్రెస్ మాజీ అధ్యక్షురాలు సోనియాగాంధీకి రాసినట్టు వెల్లడించారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఓ వ్యక్తి ప్రభుత్వంలోని అత్యంత కీలక వ్యక్తి దగ్గర పీఏగా చేరారని పేర్కొన్నారు. ఆయన ఓ చిరుద్యోగి అని, ప్రస్తుతం తాను ఉన్న స్థానాన్ని అడ్డుపెట్టుకొని మొత్తం రవాణాశాఖనే గుప్పిట్లోకి తీసుకున్నారని ఆరోపించారు. ఆర్టీఏ చెక్‌పోస్టులు, అధికారులకు టార్గెట్లు పెట్టి మరీ వసూళ్ల దందా చేస్తున్నారని, దీనిపై విచారించి, చర్యలు తీసుకోవాలని ఆ లేఖలో కోరారు.

వానకాలం

	గరిష్ఠం	కనిష్ఠం
ఆదిలాబాద్	34.0°c	23.9°c
రంగారెడ్డి	33.9°c	21.7°c
నల్లగొండ	33.0°c	23.4°c
హైదరాబాద్	32.9°c	24.0°c
వరంగల్	32.0°c	25.0°c
మెదక్	31.8°c	22.2°c
మహబూబ్‌నగర్	31.0°c	23.0°c
ఖమ్మం	31.0°c	25.0°c
నిజామాబాద్	30.7°c	23.7°c
కరీంనగర్	30.0°c	26.0°c

అప్పు కట్టించుకోని బ్యాంకులు!


- 2 లక్షలకుపైగా రుణం ఉన్న రైతులకు కొత్త చిక్కు
- ఆపై మొత్తం చెల్లిస్తేనే మాఫీ చేస్తామని సర్కార్ మెలిక
- అప్పు చేసి చెల్లింపులకు సిద్ధమవుతున్న రైతులు
- ఇప్పుడు అక్కరలేదంటున్న బ్యాంకు అధికారులు
- ఇటు ప్రభుత్వ షరతులు.. అటు బ్యాంకుల వైఖరితో దిక్కుతోచని స్థితిలో అన్నదాతలు

హైదరాబాద్, ఆగస్టు 3(నమస్తే తెలంగాణ): ఒకవైపు ప్రభుత్వ నిబంధన, మరోవైపు బ్యాంకు అధికారుల వ్యవహార శైలితో రూ.2 లక్షలకుపైగా పంట రుణాలు ఉన్న రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. రూ.2 లక్షలకుపైగా రుణాలు ఉన్న రైతులు ఆ పై మొత్తాన్ని బ్యాంకులకు చెల్లిస్తేనే రూ.2 లక్షలు మాఫీ చేస్తామని, లేదంటే మాఫీ వర్తించదని ప్రభుత్వం ఇప్పటికే మెలిక పెట్టింది. దీంతో ఆయా రైతులు అప్పో సప్పో చేసి, రెండు లక్షలకు మించి ఉన్న బ్యాలెన్స్‌ను చెల్లించేందుకు బ్యాంకులకు వెళ్తున్నారు. అయితే, బ్యాంకు అధికారులు మాత్రం నిరాకరిస్తున్నారనే ఫిర్యాదులొస్తున్నాయి. 'రూ.2 లక్షల కన్నా ఎక్కువ ఉన్న మొత్తాన్ని ఇప్పుడు చెల్లించాల్సిన అవసరం లేదు' అని బ్యాంకు అధికారులు చెప్తున్నట్టు తెలిసింది. సిద్దిపేట జిల్లాలో పలు బ్యాంకులు రైతులను వెనక్కి పంపించినట్టు సమాచారం. దీంతో తాము రుణం చెల్లిస్తామంటే ఎందుకు తీసుకోరంటూ రైతులు బ్యాంకర్లతో ఘర్షణలకు దిగుతున్నారు. మీరు కట్టించుకోకపోతే తమకు రుణమాఫీ ఎలా అవుతుందని నిలదీస్తున్నారు. బ్యాంకు అధికారులు మాత్రం తమకేమీ తెలియదని, తమ వద్ద ఎలాంటి సమాచారం లేదని చేతులెత్తేస్తున్నట్టు తెలిసింది. ఈ నేపథ్యంలో ప్రస్తుతం రూ.2 లక్షల వరకు, ఆ తర్వాత రూ.2 లక్షలకుపైగా రుణాలు గల రైతులకు రుణమాఫీ కావడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

బ్యాంకు అధికారులకు ఇబ్బందేమిటి?

రైతులు రుణాలు చెల్లిస్తామంటే బ్యాంకు అధికారులు ఎందుకు తీసుకోవడం లేదనేది ఆసక్తికరంగా మారింది. దీనిపై ఆరా తీస్తే.. 'రుణ లక్ష్యం' నిబంధనల కారణంగానే బ్యాంకు అధికారులు రుణాలు కట్టించుకోవడం లేదని తెలిసింది. ఒకవైపు రుణమాఫీతో భారీగా డబ్బు బ్యాంకుల్లో జమవుతున్నది. తిరిగి రుణాలు తీసుకునేవారి సంఖ్య తక్కువగా ఉంటున్నది. దీంతో ఆయా బ్యాంకుల్లో రుణాలు తగ్గిపోతున్నాయి. ప్రతి బ్యాంకుకు రుణ లక్ష్యం ఉంటుంది. ఒకవేళ ఆ లక్ష్యం నెరవేరకపోతే బ్యాంకు అధికారుల కెరీర్‌లో ఇబ్బందులు ఏర్పడుతాయని, అందుకే బ్యాంకు అధికారులు రైతుల నుంచి డబ్బులు కట్టించుకోవడం లేదని తెలిసింది. ఇప్పటికే అరకొరగా రుణమాఫీ చేస్తున్న ప్రభుత్వం.. ఇప్పుడు ఈ నిబంధనతో ఆ కొద్ది మందికి కూడా రుణమాఫీ అయ్యే పరిస్థితి లేకపోవడం గమనార్హం. ప్రభుత్వం రుణమాఫీలో కోతలపై కోతలు పెడుతున్నదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటి వరకు రూ.1.5 లక్షల వరకు రుణం ఉన్నవారిలో 17.75 లక్షల మందికి మాత్రమే రూ.12 వేల కోట్లు మాఫీ చేసింది. సుమారు 70 లక్షల మందికి రుణమాఫీ కావాల్సి ఉండగా అర్హతల పేరుతో 32 లక్షల మందికే పరిమితం చేసినట్టు తెలిసింది.

- మాఫీ కాలేదని బ్యాంక్ ఎదుట రైతుల ధర్నా



రుణమాఫీ వర్తించలేదని నిజామాబాద్ జిల్లా పోతంగల్ మండలం కల్లూర్ గ్రామానికి చెందిన రైతులు సోమవారం స్థానిక కెనరా బ్యాంక్ ఎదుట ధర్నా నిర్వహించారు.

రుణమాఫీ కాని రైతులు లక్షల్లో

> మొదటిపేజీ తరువాయి...

ఉంటారని చెప్పారు. 83748 52619 నంబర్‌కు రైతులు తమ సమగ్ర వివరాలను పంపించాలని సూచించారు. రుణం తీసుకున్న తేదీ, రుణం తీసుకున్న మొత్తం, పట్టదారు పాసు పుస్తకం, బ్యాంకు, జిల్లా, మండలం, గ్రామం తదితర వివరాలను పంపించాలని సూచించారు. వీటన్నింటిని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి రుణమాఫీ అయ్యేవిధంగా ఒత్తిడి తెస్తామని చెప్పారు. సోమవారం ఆయన తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడుతూ.. రాష్ట్రంలోని రైతాంగానికి కాంగ్రెస్‌పై భ్రమలు తొలిగిపోయాయని పేర్కొన్నారు. రాష్ట్రంలో రైతుల సంఖ్యను ప్రభుత్వం తగ్గించి చూపుతున్నదని మండిపడ్డారు. పంట రుణాలు తీసుకున్న రైతుల వివరాలను మొత్తం బయటపెట్టాలని డిమాండ్ చేశారు. అరకొరగా రుణమాఫీ చేసి అంతా అయిపోయిందని భ్రమింపచేసే ప్రయత్నాలు చేస్తున్నారని విమర్శించారు. రాష్ట్రంలో 60 లక్షల మంది పంట రుణాలు తీసుకుంటే కేవలం 16 లక్షల మందికి రూ.12 వేల కోట్లు మాత్రమే మాఫీ చేశారని ఆగ్రహం వ్యక్తంచేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో తొలి విడతలో 39 లక్షల మంది రైతులకు రూ.లక్ష వరకు రుణాలను మాఫీ చేశామని, రెండో విడతలో రూ.19 వేల కోట్లకుగాను రూ.13 వేల కోట్ల రుణం మాఫీ చేశామని గుర్తుచేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం రెండు విడతల రుణమాఫీలో చూపిస్తున్న రైతుల సంఖ్య 17 లక్షల మాత్రమేనని, రైతుల సంఖ్య తగ్గిపోవడంలో అంతర్యం ఏమిటని ప్రశ్నించారు.

రైతుల వివరాలపై గోప్యత ఎందుకు?

ప్రభుత్వం రైతుల వివరాలను వెల్లడించకుండా గోప్యంగా ఉంచడంలో మతలబు ఏమిటని నిరంజన్‌రెడ్డి నిలదీశారు. కేసీఆర్ హయాంలో రైతుబంధు కింద ఒక్క విడతలో ఇచ్చిన మొత్తమే రూ.7,500 కోట్లు ఉన్నదని గుర్తుచేశారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీల ప్రకారం రైతుభరోసా కింద రైతులు, రైతు కూలీలు, వ్యవసాయ కూలీలకు రూ.30 వేల కోట్లు ఇవ్వాల్సి ఉంటుందని చెప్పారు. రైతుబంధు, రైతుభరోసా ఎగ్గొట్టి రుణమాఫీ అంటూ మోసం చేస్తున్నారని మండిపడ్డారు. ఒక్కొక్క విడత రుణమాఫీకి రూ.100 కోట్లు, రూ.200 కోట్లతో పత్రికా ప్రకటనలు విడుదల చేశారని చెప్పారు. బీఆర్ఎస్ హయాంలో ప్రకటనలు ఇస్తామంటే ప్రభుత్వం తరపున వద్దు అనవసర వ్యయం అంటూ కేసీఆర్ వారించేవారని చెప్పారు. రైతుభరోసాపై క్యాబినెట్‌లో ఎందుకు చర్చించలేదు? శాసనసభలో ఎందుకు ప్రకటించలేదు? అని నిలదీశారు.

రుణమాఫీపై చర్చకు సిద్ధమా?

గ్రామాల్లో రైతులు బ్యాంకుల చుట్టూ తిరుగుతూ పడిగాపులు గాస్తున్నారని, చిన్న,చిన్న కారణాలతో రుణమాఫీ చేయడం లేదని నిరంజన్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తంచేశారు. పట్టాదారు పాస్‌పుస్తకం ఉంటే రుణమాఫీ అని సీఎం చెప్తున్నారని, పట్టాదారు పాస్‌పుస్తకం ఉండి రుణమాఫీ కానీ వాళ్లపై చర్చకు ప్రభుత్వం సిద్ధమా? అని సవాలు చేశారు. ఉమ్మడి రాష్ట్రంలో రైతులు పడ్డ కష్టాల నుంచి బయటపడేసేందుకు బీఆర్ఎస్ హయాంలో కేసీఆర్ రుణమాఫీ చేశారని, కానీ కాంగ్రెస్ అత్యంత తక్కువ సమయంలో తనను నమ్మిన రైతాంగాన్ని మోసం చేసిందని చెప్పారు.



తెలంగాణ భవన్‌లో సోమవారం మీడియాతో మాట్లాడుతున్న మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి. చిత్రంలో ఎమ్మెల్యే వివేకానంద, బీఆర్ఎస్ నేత ఇబ్రహీం

5 గంటల్లోనే 15 వేల ఫిర్యాదులు

రైతు రుణమాఫీపై బీఆర్ఎస్ ఏర్పాటుచేసిన ప్రత్యేక సెల్‌కు అనూహ్య స్పందన లభించింది. వాట్సాప్ నంబర్‌ను అందుబాటులోకి తెచ్చిన ఐదు గంటల్లోనే 15 వేల ఫిర్యాదులు రావడం గమనార్హం. రూ.లక్షన్నరలోపు రుణాలు మాఫీ కాని రైతులు 83748 52619 వాట్సాప్ నంబర్‌కు పంపించాలని మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి సోమవారం మధ్యాహ్నం సూచించగా, సాయంత్రం కల్లా రైతుల నుంచి ఫిర్యాదులు పోటెత్తాయి. తమకు న్యాయం జరిగేలా చూడాలని కోరారు. తమకు ఎందుకు రుణమాఫీ కాలేదో వ్యవసాయ, బ్యాంకు అధికారులు సమాధానాలు చెప్పడంలేదని మెసేజ్‌లో తెలిపారు. పేర్లలో చిన్న చిన్న పొరపాట్లు ఉన్నాయంటూ రుణమాఫీ చేయడం లేదని పలువురు రైతులు ఆవేదన వ్యక్తంచేశారు. రుణమాఫీ కటాఫ్ తేదీని 2024 మార్చి 31కి మార్చాలని కొందరు రైతులు కోరారు. మరికొందరు బంగారం కుదవ పెట్టి పంట రుణం తీసుకున్న రుణాల సంగతిపై కూడా ప్రభుత్వాన్ని ప్రశ్నించాలని విజ్ఞప్తి చేశారు. ఒకే ఆధార్ నంబర్‌ను ఇద్దరికి లింక్ చేయడంతో ఆ రైతు రుణమాఫీ పొందలేకపోయాడనే ఫిర్యాదులు కూడా వచ్చాయి. తనకు రూ.75 వేలు మాఫీ చేశారని, కానీ, మరో రూ.10 వేలు కడితేనే రుణమాఫీ చేస్తామంటున్నారని ఒక రైతు ఆవేదన వ్యక్తం చేశారు.

బీఆర్ఎస్ వాట్సాప్‌కు వచ్చిన కొన్ని మెసేజ్‌లు

- వనపర్తి జిల్లా పానగల్ మండలం చిక్కెపల్లి గ్రామానికి చెందిన గంగస్వామి డీసీసీబీ బ్యాంకు ద్వారా రూ. 1.20 లక్షల రుణం రుణం తీసుకున్నాడు. ఇప్పటివరకు రుణమాఫీ కాలేదు. ఆ ఇంట్లోని కుటుంబసభ్యులు ఎవ్వరికీ మాఫీ కాలేదు.
- నల్లగొండ జిల్లా నిడమనూరు మండలానికి చెందిన రైతు సెంట్రల్ బ్యాంకులో రూ.1,07,856 రుణం తీసుకున్నాడు. ఆయనకు రేషన్‌కార్డు లేదని మాఫీ చేయలేదు. ఈ విషయాన్ని అధికారులు ఆ రైతుకు చెప్పారు.
- నిజామాబాద్ జిల్లా బిక్నూర్ మండలం పెద్ద మల్లారెడ్డి గ్రామానికి చెందిన రైతు గుడిసె బాలవ్‌కు జూలై 18న రూ.44,785 తెలంగాణ గ్రామీణ బ్యాంకులో జమ అయినట్టుగా సీఎం పేరుతో మెసేజ్ వచ్చింది. ఆ రైతు బ్యాంకుకు వెళ్తే ఆ డబ్బులు రిటర్న్ వెళ్లి పోయాయని బ్యాంకు అధికారులు చెప్పారు. ఏం చెయ్యాలో రైతుకు అర్థం కాలేదు. అధికారులు సరియైన సమాచారం ఇవ్వడంలేదని ఆవేదన వ్యక్తంచేస్తున్నారు.
- మహబూబాబాద్ జిల్లా కొత్తగూడెం మండలం రైనతండఓటాయికి చెందిన రైతు, ఇండియన్ బ్యాంకులో రూ.90 వేల రుణం తీసుకున్నాడు. కానీ ఆయనకు మాఫీ కాలేదు.
- ఖమ్మం జిల్లా పెనుబల్లి మండలం టేకుపల్లి గ్రామానికి చెందిన మిట్టపల్లి పద్మావతి, పెనుబల్లి గ్రామీణ వికాస్ బ్యాంకులో రూ.1.50 లక్షల రుణం తీసుకున్నారు. కానీ మాఫీ కాలేదు.

632 మందిలో 14మందికి మాఫీ: వివేకానంద

రైతు రుణమాఫీ, రైతు భరోసాపై శాసనసభలో చర్చ జరపకుండా కాంగ్రెస్ పార్టీ పారిపోయిందని ఎమ్మెల్యే కేపీ వివేకానంద ఎద్దేవా చేశారు. ఈ విషయంలో సీఎం, డిప్యూటీ సీఎం, వ్యవసాయ మంత్రి ఎలాంటి స్పష్టత ఇవ్వలేదని చెప్పారు. తన నియోజకవర్గంలోని భౌరంపేట పీఏసీఎస్‌లో 632 మంది రైతులు రుణాలు తీసుకుంటే మొదట విడతలో 11 మందికి, రెండో విడతలో ముగ్గురికి మాత్రమే రుణమాఫీ జరిగిందని తెలిపారు. రైతుభరోసా, రుణమాఫీపై ప్రభుత్వాన్ని నిద్రపోనివ్వబోమని హెచ్చరించారు.

అందరికీ రుణమాఫీ చేయాలి

ఆంధ్రప్రదేశ్‌లోని కర్నూల్ నగరంలో ఉన్న వివిధ బ్యాంకుల్లో తెలంగాణ రైతులు తీసుకున్న రుణాలను సైతం మాఫీ చేయాలని పలువురు రైతులు డిమాండ్ చేశారు. సోమవారం జోగుళాంబ గద్వాల జిల్లా కేంద్రంలో రైతులతోపాటు బీఆర్ఎస్ నాయకులు ర్యాలీ చేపట్టి కలెక్టర్ సంతోష్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ జిల్లా నేత హన్మంత్‌నాయుడు మాట్లాడుతూ.. కేసీఆర్ ప్రభుత్వంలో ఆయా బ్యాంకుల్లో రుణాలు తీసుకున్న అందరికీ రుణమాఫీ జరిగిందని, ప్రస్తుతం కూడా అందరికీ రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు.

రుణమాఫీ.. మీకు కాదయ్యా!

- వర్తించలేదంటున్న బ్యాంకర్లు
- ప్రజావాణిలో కన్నీరు పెట్టిన రైతు దంపతులు
- ఒక్క కొడుకు ఉరేసుకొని కాలమైండు
- పూటగడవడమే కష్టమైందని ఆవేదన



నడవలేని స్థితిలో ఉన్న తన భర్త చంద్రయ్యకు సాయం చేస్తూ పాసుపుస్తకంతో కలెక్టరేట్‌కు వస్తున్న వడ్డె మల్కమ్మ

మహబూబ్‌నగర్ కలెక్టరేట్, ఆగస్టు 5: 'నిరుపేదలం బిడ్డా..! పంటలు పండక దిగుబడి రాక.. బ్యాంకుల్లో అప్పులు తీసుకున్నాం.. నా కొడుకు అప్పులు చెల్లించే పరిస్థితులు లేక ఉరేసుకొని కాలమయ్యాడు. కాంగ్రెసోళ్లు రుణమాఫీ చేస్తున్నామంటే ఎంతో ఆశగా బ్యాంకు కాడికి పోతే రుణమాఫీ ఇయ్యట్లేదయ్యా..' అంటూ మహబూబ్‌నగర్ జిల్లా కోయిలకొండ మండలం చంద్రాస్‌పల్లి గ్రామానికి చెందిన వడ్డె మల్కమ్మ, వడ్డె చంద్రయ్య దంపతులు కన్నీరు పెట్టుకున్నారు. సోమవారం కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణికి తన చిన్నకుమార్తె భారతమ్మతో కలిసి ఆటోలో ప్రజావాణికి వచ్చిన ఆ వృద్ధ దంపతులు గోడు వెల్లబోసుకున్నారు.

రూ.70 వేల అప్పు ఉంటే మాఫీ కాలె

హన్వాడ మండలం గుండ్యాల శివారులో తన భార్య మల్కమ్మ పేరుపై ఎకరన్నర పొలం, తన పేరుపై నాలుగె ఎకరాల భూమి ఉన్నదని చంద్రయ్య తెలిపారు. ఈ భూమిపై బ్యాంక్‌లో ఒకసారి రూ.30 వేలు, మరోసారి రూ.40 వేలు పంట రుణం తీసుకోగా.. మొత్తం రూ.70 వేల అప్పు ఉన్నదని చెప్పారు. రుణమాఫీ కోసం బ్యాంకు అధికారుల చుట్టూ తిరుగుతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదని, రుణమాఫీ కాలేదని చెప్తున్నారని కన్నీరు పెట్టుకున్నారు. తినడానికి సైతం పూటగడవని పరిస్థితులు ఉన్నాయని, కలెక్టర్, అధికారులు స్పందించి న్యాయం చేయాలని మొరపెట్టుకున్నారు.



రుణాలు తీసుకోకున్నా తీసుకున్నట్టు మెసేజ్‌లు రావడంపై మహబూబ్‌నగర్ జిల్లా గండీడ్‌లోని పీఏసీఎస్ కార్యాలయ సిబ్బందిని లోపలే ఉంచి తాళం వేసి నిరసన తెలుపుతున్న రైతులు

పీఏసీఎస్‌లో ఘరానా మోసం!

- రైతుల పేరిట రుణాలు కాజేసిన సిబ్బంది
- గండీడ్‌లో వెలుగుచూసిన బాగోతం
- మాఫీ మెసేజ్‌లతో విస్తుపోయిన రైతులు
- పీఏసీఎస్ ఆఫీస్‌కు తాళం వేసిన రైతులు

గండీడ్, ఆగస్టు 5: రైతులకు తెలియకుండా, ఫోర్జరీ సంతకాలతో వారి పేరిట సహకార సంఘం సిబ్బందే రుణాలు తీసుకున్న వైనం మహబూబ్‌నగర్ జిల్లాలో వెలుగు చూసింది. రైతు రుణమాఫీ నేపథ్యంలో జిల్లాలోని గండీడ్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో ఈ బాగోతం బయటపడింది. ఈ విషయం తెలుసుకున్న వెంకట్‌రెడ్డిపల్లి, కొంరెడ్డిపల్లి, సాలార్‌నగర్, పెద్దవార్వల్ తదితర గ్రామాల రైతులు సోమవారం పీఏసీఎస్‌కు తరలివచ్చారు. తాము రుణాలు తీసుకోకున్నా మాఫీ అయినట్టు మెసేజ్‌లు రావడమేమిటని సిబ్బందిని నిలదీశారు. దీనికి సహకార సంఘం సిబ్బంది నిర్లక్ష్యంగా జవాబు చెప్పడంతో ఆగ్రహించిన రైతులు వారిని కార్యాలయం లోపలే ఉంచి తాళం వేశారు. అనంతరం రోడ్డుపై బైఠాయించి ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడుతూ.. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో తమకు రుణమాఫీ జరిగినట్టు సంఘం నుంచి నోడ్యూస్ సర్టిఫికెట్ ఇచ్చారని తెలిపారు. తర్వాత తాము ఎలాంటి రుణం తీసుకోలేదని చెప్పారు. కానీ, ఇప్పుడు కూడా రుణం మాఫీ అయినట్టు తమ ఫోన్లకు మెసేజ్‌లు రావడంతో ఆరా తీస్తే అసలు నిజం వెలుగులోకి వచ్చిందని తెలిపారు.

దళిత మహిళపై థర్డ్ డిగ్రీ.. సిగ్గు సిగ్గు

బాధ్యులైన పోలీసులపై అట్రాసిటీ కేసు పెట్టాలి: కేటీఆర్



హైదరాబాద్, ఆగస్టు 5 (నమస్తే తెలంగాణ): షాద్‌నగర్ దళిత మహిళ ఘటనపై బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రంగా ఖండించారు. దొంగతనం ఒప్పుకోవాలంటూ మహిళ అని కూడా చూడకుండా అమానవీయంగా దాడికి తెగబడతారా? ఇంత కర్కశత్వమా? సిగ్గు.. సిగ్గు.. అని మండిపడ్డారు. కన్న కొడుకు ముందే నిక్కరు తొడిగి, బూట్లతో తంతూ చిత్రహింసలకు గురి చేయటమంటే ఇంతకన్నా సిగ్గుపడాల్సిన అంశం వేరే ఏముంది? అని ధ్వజమెత్తారు. ఈ ఘటన తనను తీవ్రంగా కలిచి వేసిందని, రక్షించాల్సిన పోలీసుల నుంచి ఇలా రక్షణ లేని పరిస్థితి ఏమిటి? అని వాపోయారు. అసలు రాష్ట్రంలో ఏం జరుగుతున్నది? అని ప్రభుత్వాన్ని నిలదీశారు. ఓ వైపు మహిళలపై అత్యాచారాలు, అవమానాలు మరోవైపు దాడులు, దాష్టీకాలు జరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. యథా రాజా తథా ప్రజా అన్నట్టు.. ముఖ్యమంత్రే స్వయంగా ఆడబిడ్డలను అవమానిస్తుంటే.. పోలీసులు తామేమైనా తక్కువా? అన్నట్టు వ్యవహరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మహిళలంటే ఈ ప్రభుత్వానికి ఎందుకింత చిన్న చూపు? అని ప్రశ్నించారు. ఆడబిడ్డల ఉసురు ఈ ప్రభుత్వానికి మంచిది కాదని, దాడికి పాల్పడిన పోలీసులపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. బాధిత కుటుంబానికి బీఆర్‌ఎస్ అండగా ఉంటుందన్నారు.

విద్యార్థులకు నాసిరకం భోజనమా?

ప్రభుత్వ బడుల్లో పిల్లలకు పౌష్ఠికాహారం అందించటంలో కాంగ్రెస్ సర్కారు విఫలమైందని కేటీఆర్ విమర్శించారు. నిజామాబాద్ జిల్లా కొత్తపల్లి పాఠశాలలో మధ్యాహ్న భోజనంలో కారం లేని పప్పు వడ్డించారని, పిల్లలు తినేందుకు ఇష్టపడకపోవటంతో వాళ్లకు గొడ్డు కారం, నూనె పోసి భోజనం పెట్టారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

షాద్‌నగర్ ఘటనపై సైబరాబాద్ సీపీ ఆగ్రహం

డీఐ సహా ఐదుగురు కానిస్టేబుళ్లపై సస్పెన్షన్ వేటు

హైదరాబాద్ సిటీబ్యూరో, ఆగస్టు 5 (నమస్తే తెలంగాణ): షాద్‌నగర్‌లో దళిత మహిళను కొట్టిన ఘటనపై సైబరాబాద్ పోలీస్ కమిషనర్ అవినాష్ మహంతి సీరియస్ అయ్యారు. ఘటనపై షాద్‌నగర్ ఏసీపీ రంగస్వామిని విచారణాధికారిగా నియమించి ఒక్కరోజులోనే విచారణ జరిపించారు. మహిళను విచక్షణారహితంగా కొట్టినట్టు నివేదిక సమర్పించడంతో వెంటనే స్పందించిన సీపీ మహంతి చర్యలు చేపట్టారు. డీఐ రామిరెడ్డి, కానిస్టేబుళ్లు జాకీర్, మోహన్‌లాల్, రాజు, అఖిల్, కరుణాకర్‌ను సస్పెండ్ చేస్తూ ఆదేశాలు జారీచేశారు.ఘటనపై బాధితులు ఫిర్యాదు చేస్తే పోలీసులపై అట్రాసిటీ కేసు నమోదు చేస్తామన్నారు.

సూర్యాపేటలో ముగ్గురు కానిస్టేబుళ్ల సస్పెన్షన్

సూర్యాపేట టౌన్, ఆగస్టు 5: ఇసుక అక్రమ రవాణాకు సహకరిస్తూ డబ్బులు వసూలు చేస్తున్నారనే ఆరోపణలపై సూర్యాపేటలోని ముగ్గురు కానిస్టేబుళ్లను ఎస్పీ సన్‌ప్రీత్‌సింగ్ సస్పెండ్ చేస్తూ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. అక్రమాలకు పాల్పడిన సూర్యాపేట ఒకటో పట్టణ పోలీస్ స్టేషన్‌లో పనిచేస్తున్న కానిస్టేబుళ్లు ఎం రాంబాబు, ఎం బాలకృష్ణ, ఎల్ పూర్ణచందర్‌పై చర్యలు తీసుకున్నారు.

రాష్ట్రంలో లాఠీ పోలీసింగ్

సమాజం తలదించుకునేలా పోలీసుల వ్యవహారం.. దళిత మహిళ పై థర్డ్ డిగ్రీ ప్రయోగం దారుణం

- హత్యలు, లైంగికదాడులు తప్ప భద్రత లేదు: సబితా ఇంద్రారెడ్డి
- షాద్‌నగర్ దవాఖానలో దళిత మహిళకు పరామర్శ
- పోలీసులను విధుల నుంచి తొలగించాలని డిమాండ్
- బాధిత మహిళకు లక్ష సాయం
- రొమ్ములపై తంతరా? ఆర్‌ఎస్పీ ప్రవీణ్ ఆగ్రహం



షాద్‌నగర్ సర్కారు దవాఖాన ఆవరణలో విలేకరులతో మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్. చిత్రంలో సబిత, ఎమ్మెల్సీ వాణీదేవి తదితరులు

షాద్‌నగర్, ఆగస్టు 5: ఓ దళిత మహిళలపై పోలీసులు వ్యవహరించిన తీరు సభ్య సమాజం తలదించుకునే విధంగా ఉన్నదని, రాష్ట్రంలో ఫ్రెండ్లీ పోలీసింగ్ లేకుండా పోయిందని, అంతా లాఠీ పోలీసింగే రాజ్యమేలుతున్నదని, శాంతిభద్రతలపై ప్రభుత్వానికి ఏమాత్రం శ్రద్ధలేదని, ఏ నేరం జరిగినా చర్యలు లేవని మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. షాద్‌నగర్ పట్టణంలోని సర్కారు దవాఖానలో చికిత్స పొందుతున్న దళిత మహిళ సునీతను బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్, ఎమ్మెల్సీలు నవీన్‌కుమార్‌రెడ్డి, సురభి వాణిదేవి, మాజీ ఎమ్మెల్యే వై అంజయ్యయాదవ్, మాజీ ఎంపీ మంద జగన్నాథం, జడ్పీ మాజీ వైస్‌చైర్మన్ ఈటె గణేశ్‌తో కలిసి సోమవారం పరామర్శించారు. పోలీసులు ప్రవర్తించిన తీరుపై బాధిత మహిళను అడిగి తెలుసుకుని దిగ్భ్రాంతి చెందారు. అనంతరం సబిత దవాఖాన ఆవరణలో మాట్లాడుతూ రాష్ట్రంలో ఎక్కడ చూసినా హత్యలు, లైంగికదాడులు, దోపిడీలు తప్ప ప్రజలకు రక్షణ కరువైందని మండిపడ్డారు. గత ప్రభుత్వం పోలీసులు, ప్రజలను సమన్వయం చేసుకుంటూ సేవలందించిందని, ఇప్పుడవి కనుమరుగయ్యాయని తెలిపారు. మహిళ అని చూడకుండా ఇష్టంవచ్చినట్టు కొట్టడం బాధాకరమని, పోలీసుల థర్డ్ డిగ్రీని తీవ్రంగా ఖండిస్తున్నామని చెప్పారు. దళిత మహిళను కొట్టిన పోలీస్ అధికారులను, సిబ్బందిని వెంటనే విధులనుంచి తొలగించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బాధిత మహిళకు లక్ష రూపాయల ఆర్థిక సాయం అందించారు.

సీఎం అండతో పోలీసుల ఇష్టారాజ్యం: ఆర్‌ఎస్పీ

దొంగతనం నెపంతో షాద్‌నగర్‌కు చెందిన దళిత మహిళ సునీతను పోలీసులు ఇష్టంవచ్చినట్టు కొట్టడం బాధాకరమని బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ ఆవేదన వ్యక్తంచేశారు. మహిళా అని చూడకుండా ఆమె రొమ్ములపై పోలీసులు కాళ్లతో తన్నడం తీవ్రంగా కలిచివేసిందని, పోలీసులకు ఈ అధికారం ఎవ్వరిచ్చారని మండిపడ్డారు. నాలుగు రోజుల పాటు మహిళను ఇష్టానుసారం విచారణ పేరుతో కొడుతుంటే డీసీపీ, ఏసీపీ ఏం చేశారని ప్రశ్నించారు. మహిళలను రాత్రివేళ విచారించడం సరికాదనే విషయం పోలీసులకు తెలియదా? అని, విచారణ పేరుతో మహిళను, ఆమె భర్తను, కొడుకును దారుణంగా కొట్టడం నేరంకాదా? అని నిలదీశారు. సీఎం రేవంత్‌రెడ్డి తమ్ముళ్ల కాన్వాయ్‌లకు రక్షణ కల్పిస్తున్న పోలీసులు, సామాన్యులకు మాత్రం రక్షణ కల్పించడం లేదని, రేవంత్‌రెడ్డి అండతోనే పోలీసులు రెచ్చిపోతున్నారని, రాష్ట్రవ్యాప్తంగా మహిళలు అవమానాలకు గురవుతున్నా సీఎం స్పందించడం లేదని విమర్శించారు. అసెంబ్లీలో మహిళా ప్రజాప్రతినిధులను స్వయంగా ముఖ్యమంత్రే అవమానించేలా వ్యవహరిస్తే ఇక రాష్ట్రంలో మహిళల పరిస్థితి ఎలా ఉంటుందో చెప్పాల్సిన పనిలేదన్నారు. దళిత మహిళ సునీతకు మెరుగైన వైద్యం అందించాలని డిమాండ్ చేశారు. కేసీఆర్ పాలనలో 40 వేల మంది పోలీసులను నియమించడంతో పాటు 11 లక్షల సీసీ కెమెరాలు ఏర్పాటుచేసి శాంతిభద్రతలను బలోపేతం చేస్తే, నేటి సీఎం లా అండ్ ఆర్డర్‌ను నీరుగారుస్తున్నారని దుయ్యబట్టారు. అశ్వరావుపేట ఎస్‌ఐ పురుగుల మందు తాగి చనిపోయినా, భూపాలపల్లి ఎస్‌ఐ తోటి మహిళా కానిస్టేబుల్‌పై లైంగికదాడి చేసినా ప్రభుత్వం నుంచి కనీస స్పందన లేదని విమర్శించారు. షాద్‌నగర్ ఘటనపై జాతీయ మానవ హక్కుల కమిషన్, జాతీయ మహిళా కమిషన్, రాష్ట్ర మానవ హక్కుల కమిషన్‌కు ఫిర్యాదు చేస్తామని తెలిపారు.

పోలీస్‌స్టేషన్లలో సెటిల్‌మెంట్లు: ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి

పోలీస్ స్టేషన్లలో రౌడీషీటర్లకు ఉన్న ప్రాధాన్యత సామాన్యులకు లేదని, నందిగామ పోలీస్ స్టేషన్‌లో రౌడీషీటర్లు విచ్చలవిడిగా సెటిల్మెంట్లు చేసుకుంటున్నారని ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి తీవ్రస్థాయిలో విమర్శించారు. రాజకీయ ఒత్తిళ్లతో ప్రజలపై నాన్ బెయిలబుల్ సెక్షన్లు నమోదుచేస్తున్నారని ఆరోపించారు. పోలీస్‌స్టేషన్లపై ఉన్నతాధికారుల పర్యవేక్షణ ఉండాలని, పేదలకు న్యాయం జరిగేలా పోలీసుల పనితీరు ఉండాలని సూచించారు. దళిత మహిళపై పోలీసుల థర్డ్‌డిగ్రీ దారుణమని ఆవేదన వ్యక్తంచేశారు.

జడ్జిలే ఆశ్చర్యపోయేలా పోలీసుల తీరు: మాజీ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్

పోలీసుల తీరుతో న్యాయమూర్తులు కూడా ఆశ్చర్యానికి గురవుతున్నారని మాజీ ఎమ్మెల్యే వై అంజయ్యయాదవ్ చెప్పారు. షాద్‌నగర్ ప్రాంతానికి చెందిన పోలీసులు నమోదు చేసిన కేసులను చూసి జడ్జి ఆశ్చర్యపోయారని గుర్తుచేశారు. పోలీసులు అక్రమ కేసులు పెడుతున్నారని వాపోయారు. సునీతకు అండగా ఉంటామని చెప్పారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ నరేందర్, వైస్ చైర్మన్ ఎంఎస్ నటరాజన్, నాయకులు లక్ష్మణ్‌నాయక్, బీష్వ రామకృష్ణ, ప్రతాప్‌రెడ్డి, ఒగ్గు కిశోర్, అడ్డు, చెట్ల నర్సింహ, శివ, దినేశ్‌సాగర్ పాల్గొన్నారు.

50:50 ఆశతోనే అరాచకం!

మొదటిపేజీ తరువాయి...

సగం వాటా.. అంటే పదకొండు తులాల బంగారం దక్కుతుందనే అత్యాశ వారిని రెచ్చిపోయేలా చేసిందని స్పష్టమవుతున్నది. చివరికి విచక్షణ కోల్పోయి సభ్య సమాజం సిగ్గుపడేలా దళిత మహిళపై థర్డ్‌డిగ్రీ ప్రయోగించే దాకా వెళ్లింది. ఇక్కడ పోలీసుల వ్యవహారం, సాంకేతికత వినియోగంలో దేశానికే ఆదర్శంగా నిలిచిన 'తెలంగాణ పోలీస్'కు మచ్చ తెచ్చింది. రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ ఘటనలో ఫిర్యాదుదారుడితో పోలీసులు కుమ్మక్కయి, రికవరీ సొమ్ములో 'ఫిఫ్టీ ఫిఫ్టీ' ఒప్పందం చేసుకొని దళిత మహిళను చిత్రహింసలు పెట్టారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఘటన జరిగిన సమయంలో అసెంబ్లీ సమావేశాలు జరుగుతున్న కారణంగా పోలీసులు పక్కా ప్రణాళికతో విషయం బయటికి పొక్కకుండా జాగ్రత్త పడినట్టు తెలుస్తున్నది.



ఓవైపు పోలీస్ ఉన్నతాధికారులు ఫ్రెండ్లీ పోలీసింగ్ కోసం వినూత్న కార్యక్రమాలు చేపడుతుంటే, మరోవైపు కిందిస్థాయి పోలీస్ అధికారులు, సిబ్బంది నోటికి, లాఠీకి మాత్రమే పని చెబుతుండటం చర్చనీయాంశమైంది.

అంగీకరించాలని కర్కశత్వం

ఫిర్యాదుదారుడితో డీఐతో పాటు క్రైం సిబ్బంది కుదుర్చుకున్న ఒప్పందం వల్లే దొంగతనం చేసినట్టు ఒప్పుకోవాలని దళిత మహిళను, ఆమె కొడుకును, భర్తను ఇష్టం వచ్చినట్టు కొట్టారన్న విషయం బయటకు వచ్చింది. పోలీసుల దెబ్బలకు తాళలేక మహిళ స్పృహ తప్పి పడిపోతే ఆమెను రాత్రికి రాత్రే ఇంటికి పంపిన పోలీసులు తదుపరి ఫాలో అప్‌లో కూడా ఉన్నారు. మరుసటి రోజు ఆమె ఆరోగ్య పరిస్థితిని తెలుసుకొని వారం పాటు మరో గ్రామంలో ఆమెను దాచిపెట్టారనే ఆరోపణలు సైతం వినిపిస్తున్నాయి. ఆ సమయంలో అసెంబ్లీ సమావేశాలు జరుతున్నందున విషయం బయటపడకుండా పోలీసులు జాగ్రత్తలు తీసుకున్నట్టు తెలుస్తున్నది. అంతా సద్దుమణిగిందని పోలీసులు భావించిన సమయంలో బాధిత మహిళ నోరు విప్పడంతో వారి కర్కశత్వం లోకానికి తెలిసింది.

శివారులో అంతే!

సైబరాబాద్, రాచకొండ కమిషనరేట్ పరిధిలోని ఆయా పోలీస్‌స్టేషన్లలో పోలీసు జులుం నడుస్తున్నదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇన్‌స్పెక్టర్, ఎస్సై, కానిస్టేబుళ్లకు ప్రజలు భయపడాలనే ధోరణితో వ్యవహరిస్తున్నట్టు ఆరోపణలు వస్తున్నాయి. ఠాణాకు వచ్చే వారితో మర్యాదగా మాట్లాడే పద్ధతులకు తిలోదకాలిచ్చినట్టు ఇటీవలి ఉదంతాల ద్వారా స్పష్టమవుతున్నది. ఇటీవల శంకర్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో డ్రంక్ అండ్ డ్రైవ్ నిర్వహిస్తున్న సందర్భంగా యువకులను అక్కడి ఇన్‌స్పెక్టర్ బూటు కాళ్లతో తన్నుతూ కొట్టుకుంటూ తీసికెళ్లిన ఘటన సామాజిక మాధ్యమాల్లో వైరల్ కావడంతో నెటిజన్లు తీవ్రస్థాయిలో స్పందించారు. ఔటర్ రింగు రోడ్డుపై ఓ డ్రైవర్‌ను జీడిమెట్లకు చెందిన ట్రాఫిక్ ఎస్సై బూతులు తిడుతూ జులుం ప్రదర్శించిన వీడియో కూడా సోషల్‌మీడియాలో వైరలై ఆ శాఖపై ప్రజల ఆగ్రహానికి కారణమైంది.

శాస్త్రీయ విచారణ మరిచిన పోలీసులు

దొంగతనం కేసులో షాద్‌నగర్ పోలీసులు శాస్త్రీయ విచారణను పక్కనబెట్టారు. ఫిర్యాదుదారుడు అనుమానం వ్యక్తం చేయగానే మహిళ అని కూడా చూడకుండా మూస పద్ధతుల్లో విచారణ పేరిట ఆమెను చిత్రహింసలు పెట్టారు. బీఆర్‌ఎస్ హయాంలో అనేక కీలకమైన కేసుల్లో తెలంగాణ పోలీసులు చేపట్టిన శాస్త్రీయ విచారణ, ఇతర రాష్ట్రాల పోలీసుల మన్ననలు పొందింది. కానీ షాద్‌నగర్ ఘటనలో అందుకు భిన్నమైన విచారణ శైలి కనిపించింది. అన్నిటికీ మించి కొడుకు ముందే ఓ తల్లిని బట్టలు విప్పించి కొట్టడం వంటి జుగుప్సాకరమైన ఘటన చోటుచేసుకోవడం మొత్తం పోలీసులనే తలదించుకునేలా చేసింది.

ఈ నగరానికి ఏమైంది?



న్యాయం చేయాలని చంపాపేట రహదారిపై రాస్తారోకో చేస్తున్న కుటుంబసభ్యులు

పోలీసులను చూసి పారిపోతూ మృతి

- క్వార్టర్స్‌పై నుంచి జారిపడి యువకుడి దుర్మరణం
- పోలీసులు వెంబడించడం వల్లే చనిపోయాడని ఆందోళన

సైదాబాద్, ఆగస్టు 5 : గంజాయికి అలవాటుపడ్డ యువకుడు ఎక్సైజ్ పోలీసులను చూసి భయంతో పారిపోతుండగా ప్రమాదవశాత్తు మృతిచెందాడు. పోలీసులు వెంబడించడం వల్లే చనిపోయాడని ఆరోపిస్తూ కుటుంబసభ్యులు చంపాపేటలో సోమవారం రాస్తారోకో చేశారు. సైదాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధి ఐఎస్ సదన్ డివిజన్ సింగరేణికాలనీలో జరిగిన ఘటనపై ఎక్సైజ్ పోలీసులు, బాధిత కుటుంబసభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. మత్తు పదార్థాల ద్వారా కలిగే నష్టాలపై అవగాహన కలిగించేందుకు సింగరేణికాలనీలోని వాంబే గృహాల్లో మలక్‌పేట ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ జె గోపాల్‌నాయక్ ఆధ్వర్యంలో శనివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అప్పటికే గంజాయి మత్తులో ఉన్న ఇదే కాలనీకి చెందిన ఆటోడ్రైవర్ ఖలీం పాషా(28), పోలీసులను చూసి తనను పట్టుకునేందుకే వచ్చారని భావించి వాంబే క్వార్టర్‌పైకి ఎక్కాడు. మూడంతస్థుల భవనంపై నుంచి డ్రైనేజీ పైప్‌లైన్ సాయంతో దిగే ప్రయత్నంలో జారిపడి గాయపడ్డాడు. కుటుంబసభ్యులు చంపాపేటలోని ప్రైవేట్ హాస్పిటల్‌కు తీసుకెళ్లారు. ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ గోపాల్ నాయక్ సైదాబాద్ పోలీస్‌స్టేషన్‌లో ఘటన విషయాన్ని తెలిపారు. ఖలీం పాషా పరిస్థితి విషమించటంతో ఉస్మానియాకు తరలించగా చికిత్స పొందుతూ సోమవారం ఉదయం చనిపోయాడు.

కుటుంబసభ్యుల రాస్తారోకో

పోలీసులు వెంబడించడం వల్లే పాషా పారిపోయే ప్రయత్నంలో ప్రమాదవశాత్తు చనిపోయాడని కుటుంబసభ్యులు ఆందోళనకు దిగారు. మృతికి కారకులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ చంపాపేటలో రాస్తారోకో చేశారు. న్యాయం జరిగేలా చూస్తామని సైదాబాద్ ఇన్‌స్పెక్టర్ రాఘవేందర్ హామీ ఇవ్వటంతో ఆందోళన విరమించారు. పాషాపై ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఎలాంటి కేసులు లేవని ఎక్సైజ్, ప్రోహిబిషన్ హైదరాబాద్ జిల్లా అసిస్టెంట్ సూపరింటెండెంట్ శ్రీనివాస్‌రావు తెలిపారు. సిబ్బంది వెంబడించలేదని, పోలీసులను చూసి భయంతో పారిపోతుండగానే ప్రమాదవశాత్తు చనిపోయాడని చెప్పారు.

హైదరాబాద్‌లో బాలుడి కిడ్నాప్?

- 24 గంటలైనా దొరకని ఆచూకీ
- 4 బృందాలతో గాలింపు: సీఐ



బడంగ్‌పేట, ఆగస్టు5: ఎనిమిదో తరగతి విద్యార్థి అదృశ్యమైన ఘటన మీర్‌పేట కార్పొరేషన్ పరిధిలో ఆదివారం కలకలం రేపింది. దాసరి నారాయణరావు కాలనీకి చెందిన మధుసూదన్‌రెడ్డి, కవిత దంపతుల రెండో కుమారుడు మహేందర్‌రెడ్డి ఆదివారం సాయంత్రం ట్యూషన్‌కు వెళ్లాడు. ఇంటికి రాకపోవడంతో తల్లిదండ్రులు ఆందోళన చెందారు. ఎంత వెతికినా ఆచూకీ దొరకక రాత్రి 8 గంటలకు మీర్‌పేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. నాలుగు బృందాలను రంగంలోకి దింపి గాలిస్తున్నట్టు సీఐ నాగరాజు తెలిపారు. సీసీ ఫుటేజీలను పరిశీలించగా ఓ బైక్‌పై ఎక్కి వెళ్తున్నట్టు పోలీసులు గుర్తించారు. ఆ వాహనం నంబర్ ప్లేట్ ట్రేస్ ఔట్ కాకపోవడంతో పోలీసులు గాలింపు చర్యలు చేపడుతున్నారు. రైల్వేస్టేషన్లు, బస్టాండ్లలో బాలుడి కోసం గాలిస్తున్నారు. విద్యార్థి ఇంట్లో వెళ్లేటప్పుడు రూ.2,000 నగదు తీసుకెళ్లినట్టు తల్లిదండ్రులు చెప్తున్నారని, ట్యూషన్‌కు బాలుడు వెళ్లగా, రాలేదని టీచర్లు తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చారు. అనేక కోణాల్లో దర్యాప్తును ముమ్మరం చేసిన్నట్టు సీఐ నాగరాజు తెలిపారు. విద్యార్థి అదృశ్యమయ్యాడా? కిడ్నాప్ అయ్యాడా అన్నది తేలాల్సి ఉన్నది.

బాలికను నిర్బంధించి లైంగికదాడి

- పరారీలో నిందితుడు.. పోక్సో చట్టం కింద కేసు

బేగంపేట్ ఆగస్టు 5: ఇంట్లో ఒంటరిగా ఉన్న బాలికను బెదిరింపులతో నిర్బంధించి లైంగికదాడికి పాల్పడిన యువకుడిపై హైదరాబాద్ బేగంపేట పోలీసులు పోక్సో చట్టం కింద కేసు నమోదు చేశారు. బేగంపేటలో నివసించే ఓ వ్యక్తి ఆదివారం సాయంత్రం విధుల కోసం ఇంటి నుంచి బయటకు వెళ్లాడు. ఇంట్లో అతని కూతురు (15) ఒంటరిగా ఉన్నది. పనులు ముగించుకొని ఇంటికి వచ్చిన ఆ వ్యక్తి తలుపు మూసి ఉండటంతో తలుపుతట్టాడు. ఎవరూ తీయకపోవడంతో బలవంతంగా నెట్టాడు. ఇంట్లో నుంచి సోనూ(20) అనే యువకుడు అతన్ని నెట్టుకుంటూ బయటకు పరుగుతీశాడు. ఏం జరిగిందని ఇంట్లో ఉన్న తన కూతురును ఆరా తీశాడు. తన నోట్లో గుడ్డలు కుక్కి నిర్బంధించి లైంగికదాడికి పాల్పడ్డట్టు ఆమె తెలిపింది. ఎవరికైనా చెబితే చంపేస్తానని బెదిరించాడని చెప్పింది. దీంతో బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసుకున్న బేగంపేట పోలీసులు పరారీలో ఉన్న నిందితుడి కోసం గాలిస్తున్నారు.

కన్నవారిపై ఖాకీ జులుం!

- తోబుట్టువుల ఆస్తిపై సీఐ కన్ను
- వృద్ధ తల్లిదండ్రులకు చిత్రహింసలు
- కొడుకు నుంచి రక్షణ కల్పించండి
- డీజీపీకి ఓ పోలీస్ ఇన్‌స్పెక్టర్ తల్లిదండ్రుల మొర



హైదరాబాద్, ఆగస్టు 5 (నమస్తే తెలంగాణ) : అతనో పోలీసు ఉన్నతాధికారి. స్టేషన్‌లో కేసులు డీల్ చేయడం తెలిసిన ఆయన.. కన్న తల్లిదండ్రుల వేదనను అర్థం చేసుకోలేకపోయాడు. పైగా.. కని, పెంచి, ఓ ప్రయోజకుడిని చేసిన తల్లిదండ్రులనే అధికార మదంతో చిత్రహింసలకు గురి చేస్తున్నాడు. అన్నయ్య తప్పుడు వ్యవహారం తెలిసిన తమ్ముడు.. మంచి పద్ధతి కాదని వారించి ఆత్మహత్య చేసుకునేందుకు యత్నించినా.. కఠిన ఖాకీ హృదయం చలించలేదు. విసిగివేసారిన ఆ తల్లిండ్రులు ఏకంగా పోలీస్ బాస్‌ను కలిసి తమ మొర ఏకరువు పెట్టారు. వివరాల్లోకి వెళ్తే.. వనపర్తి జిల్లా ఖిల్లా ఘనపురం మండలం, వెంకటాయింపల్లికి చెందిన రఘునాథ్‌రెడ్డి, బొజ్జమ్మ దంపతులకు ఇద్దరు కొడుకులు, ఇద్దరు కూతుళ్లు. పెద్ద కొడుకు నాగేశ్వర్‌రెడ్డి రాచకొండ కమిషనరేట్‌లో ఓ స్టేషన్ సీఐ, చిన్నకొడుకు యాదయ్య కానిస్టేబుల్‌గా పని చేస్తున్నాడు. రఘునాథ్‌రెడ్డికి ఉన్న 30 ఎకరాల 23 గుంటల భూమిలో.. పెద్దకొడుకు పేరున 15 ఎకరాలు, చిన్న కొడుకు పేరున 11 ఎకరాలు పట్టాచేశాడు. మిగిలిన భూమిని కూతుళ్లకు ఇచ్చేందుకు తమ పేరున ఉంచుకున్నారు. ఈ భూమిపై పెద్దకొడుకు, సీఐ నాగేశ్వర్‌రెడ్డి కన్ను పడింది. తోబుట్టువులకు తానే దగ్గరుండి పంచాల్సింది పోయి, ఆ భూమిని కొట్టేసేందుకు విశ్వప్రయత్నం చేస్తున్నాడు. తన పేరున ఇంకో 5 ఎకరాలు పట్టా చేయాలని వృద్ధులైన తల్లిదండ్రులపై ఒత్తిడి చేస్తున్నాడు. ఇష్టమొచ్చినట్లు దూషిస్తూ పలుమార్లు దాడి చేశాడు. పెద్ద కొడుకు వేధింపులు తాళలేక చిన్న కొడుకు యాదయ్య ఆత్మహత్యాయత్నం చేశాడు. ఈ విషయాలన్నీ డీజీపీ జితేందర్‌కు ఆ వృద్ధ తల్లిదండ్రులు కన్నీటి పర్యంతమవుతూ మొరపెట్టుకున్నారు. తన కొడుకు నాగేశ్వర్‌రెడ్డిపై చర్యలు తీసుకొని తమకు రక్షణ కల్పించాలని వేడుకున్నారు. ఈ విషయంపై విచారణ చేయిస్తామని, ఇబ్బంది లేకుండా చూస్తామని డీజీపీ వారికి హామీ ఇచ్చినట్టు తెలిసింది.

తప్పించుకున్నాడా?.. తప్పించారా?

- మధురానగర్ ఠాణా నుంచి రెండోసారి పారిపోయిన దొంగ
- పోలీసుల నిర్లక్ష్యంపై ఆగ్రహం
- కష్టపడి అప్పగిస్తే వదిలేశారని స్థానికుల మండిపాటు



దొంగను పట్టుకున్న నగర కమిటీ సభ్యుడు యాదగిరి

వెంగళరావునగర్, ఆగస్టు 5 : మధురానగర్ ఠాణా నుంచి ఓ దొంగ రెండోసారి పారిపోయాడు. అతడు తప్పించుకున్నాడా ? లేక పోలీసులే తప్పించారా? అని స్థానికులు అనుమానం వ్యక్తంచేస్తున్నారు. చోరీలతో విసుగుచెంది అతికష్టం మీద దొంగను పట్టుకొని పోలీసులకు అప్పగిస్తే వారి తీరుతో అతడు మళ్లీ బయటపడ్డాడని విమర్శిస్తున్నారు. షాద్‌నగర్‌లో చేయని నేరానికి ఓ మహిళను దొంగను చేసి పోలీసులు ఇష్టంవచ్చినట్టు కొట్టారని, ఇక్కడ మాత్రం దొంగతనం చేసినట్టు రుజువులున్నా దొంగను వదిలేశారని మండిపడుతున్నారు. యూసుఫ్‌గూడ చెక్‌పోస్ట్ సమీపంలోని యాదగిరినగర్ బస్తీలోని ఇండల్లో వాటర్ ట్యాప్‌ల చోరీలతో జనం బేజారయ్యారు. పోలీసులకు చెప్పినా వినే పరిస్థితి లేకపోడంతో తామే రంగంలోకి దిగారు. దొంగను ఎలాగైనా పట్టుకోవాలని నిర్ణయించుకున్నారు. ఓచోట దొంగ చోరీ చేస్తుండగా సీసీ కెమెరాల్లో నమోదు కావడంతో బస్తీవాసులు ఆ ఫుటేజీని తమ వాట్సాప్ గ్రూపుల్లో పోస్ట్‌చేసి అందర్నీ అలర్ట్ చేశారు. ఆగస్టు 1న గట్టి నిఘాపెట్టి దొంగను యాదగిరినగర్ కమిటీ సభ్యులు పట్టుకున్నారు. అతడు నేపాల్‌కు చెందిన వికాస్‌గా గుర్తించారు. దేహశుద్ధి చేసి మధురానగర్ పోలీసులకు అప్పగిస్తే అదేరోజు పరారయ్యాడు. పోలీసులు గాలించి మళ్లీ జూబ్లీహిల్స్ ప్రాంతంలో శుక్రవారం రెండోసారి అదుపులోకి తీసుకుని ఠాణాలో ఉంచారు. కాగా స్టేషన్ నుంచి ఆదివారం సాయంత్రం సదరు దొంగ మళ్లీ పారిపోవడంతో విధినిర్వహణలో పోలీసుల నిర్లక్ష్యంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు.

మహిళల భద్రతలో సర్కారు విఫలం

- మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్



హైదరాబాద్, ఆగస్టు 5 (నమస్తే తెలంగాణ) : రాష్ట్రంలో శాంతి భద్రతలు క్షీణించాయని, క్రైం రేటు దారుణంగా పెరిగిపోయిందని, మహిళలకు భద్రత కల్పించడంలో ప్రభుత్వం విఫలమైందని మాజీ మంత్రి వీ శ్రీనివాస్‌గౌడ్ విమర్శించారు. శాంతిభద్రతల పరిస్థితి ఇలా తయారైతే పెట్టుబడులు ఎలా వస్తాయని ప్రశ్నించారు. సోమవారం తెలంగాణ భవన్‌లో ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ తెలంగాణ, హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్ దెబ్బతినే పరిస్థితి రావొద్దని, ప్రజలు భయం గుప్పిట్లో బతుకుతున్నారని ఆందోళన వ్యక్తంచేశారు. కేసీఆర్ హయాంలో మహిళలకు తెలంగాణ సురక్షిత ప్రాంతంగా ఉండేదని, శాంతిభద్రతల విషయంలో దేశానికే ఆదర్శంగా నిలిచిందని, ఏడు నెలల కాంగ్రెస్ పాలనలో పరిస్థితి పూర్తిగా మారిపోయిందని గుర్తుచేశారు. షాద్‌నగర్‌లో దళిత మహిళను పోలీసులు హింసించిన తీరు చాలా దారుణమని, దళిత మహిళను బట్టలు విప్పి కొట్టే దుస్థితికి తెలంగాణ చేరుకున్నదని ఆవేదన వ్యక్తంచేశారు. దేశంలో ఎక్కడా ఇలాంటి పరిస్థితి లేదని, మగ పోలీసులతో ఓ మహిళను విచారించడమా? అంటూ మండిపడ్డారు. రాష్ట్రంలో నేరాల రేటు 9 శాతం పెరిగిపోయిందని, ముఖ్యమంత్రే హోంమంత్రిగా ఉన్నారని, దీనిపై ఏం సమాధానం చెబుతారని, శాంతిభద్రతలపై సీఎం సమీక్ష చేయడం లేదా? అని నిలదీశారు. రాష్ట్రంలో లైంగికదాడులు, దొంగతనాలు, హత్యలు విపరీతంగా పెరిగాయని విమర్శించారు. షాద్‌నగర్ ఘటనలో సీఐని సస్పెండ్ చేసినంత మాత్రాన దళిత మహిళకు న్యాయం జరగదని, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం ఇకనైనా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

కాంగ్రెస్ పాలనలో అరాచకాలు

ప్రభుత్వంపై మాజీ మంత్రి, ఎమ్మెల్సీ సత్యవతి రాథోడ్ ఫైర్



మహబూబాబాద్, ఆగస్టు 5 (నమస్తే తెలంగాణ): షాద్‌నగర్‌లో దళిత మహిళను కొడుకు ముందే వివస్త్రను చేసి కర్కశంగా థర్డ్ డిగ్రీ ప్రయోగించి మానవ మృగాల్లా ప్రవర్తించిన పోలీసులపై వెంటనే కఠిన చర్యలు తీసుకోవాలని మాజీ మంత్రి, ఎమ్మెల్సీ సత్యవతిరాథోడ్ డిమాండ్ చేశారు. సోమవారం మహబూబాబాద్ జడ్పీ కార్యాలయ ఆవరణలో మీడియాతో ఆమె మాట్లాడారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి, రేవంత్ రెడ్డి సీఎం అయిన తర్వాత 8 నెలల్లో మహిళలపై అత్యాచారాలు, భౌతికదాడులు, దోపిడీలు, హత్యలు విపరీతంగా పెరిగిపోయాయన్నారు. ఇప్పటి వరకు 180 మంది మహిళలపై లైంగికదాడులు, 500 మంది మహిళలపై దాడులు, హత్యలు, దోపిడీలు జరిగాయన్నారు. 8 నెలల కాలంలోనే ఇంత జరిగిందంటే రేవంత్‌రెడ్డి సిగ్గుతో తలదించుకోవాలని ధ్వజమెత్తారు.

న్యాయవాదులపై పోలీసుల జులుం

- నేడు కోర్టు విధుల బహిష్కరణకు జనగామ బార్ అసోసియేషన్ పిలుపు
- మా పైనే దురుసుగా ప్రవర్తించారన్న సీఐ

జనగామ, ఆగస్టు 5 (నమస్తే తెలంగాణ): కేసు విషయంలో మాట్లాడేందుకు పోలీస్ స్టేషన్‌కు వెళ్లిన ఇద్దరు న్యాయవాదులపై జనగామ స్టేషన్‌లో పోలీసులు దురుసుగా ప్రవర్తించి దాడి చేశారని జనగామ బార్ అసోసియేషన్ ఆరోపించింది. ఈ మేరకు మంగళవారం కోర్టు విధుల బహిష్కరణకు పిలుపునిచ్చింది. ఓ కేసు విషయంలో సోమవారం సాయంత్రం జనగామ పోలీస్‌స్టేషన్‌కు వెళ్లిన న్యాయవాదులు గద్దల అమృతరావు, కవితపై పోలీసులు దురుసుగా ప్రవర్తిస్తూ దాడి చేశారని డీసీపీ రాజమహేంద్ర నాయక్‌కు రాత్రి 9 గంటలకు బార్ అసోసియేషన్ ప్రతినిధులు ఫిర్యాదు చేశారు. అయితే, న్యాయవాదులే పోలీసులపట్ల దురుసుగా ప్రవర్తించారని సీఐ రఘుపతిరెడ్డి చెప్పారు.

'వేదిక' పేజీ కోసం సమకాలీన అంశాలపై వ్యాసాలను
ఈ చిరునామాకు పంపించండి. మీ వ్యాసం 700 పదాలకు మించకుండా ఉండాలి.
చిరునామా: 8-2-603, 1/7,8,9 కృష్ణాపురం, రోడ్ నం.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034.
e-mail: editpage@ntnews.com

నమస్తే తెలంగాణ

బంగ్లా సంక్షోభం

బంగ్లాదేశ్‌లో రిజర్వేషన్ వ్యతిరేక ఆందోళనను షేక్ హసీనా వాజెద్ ఉక్కుపాదంతో అణచివేసేందుకు జరిపిన ప్రయత్నం బెడిసికొట్టింది. శాంతిభద్రతలు అదుపు తప్పి దేశం సంక్షోభంలోకి కూరుకుపోవడంతో సైన్యం రంగప్రవేశం చేసి అల్టిమేటం ఇవ్వడంతో ప్రధాని పదవి నుంచి ఆమె వైదొలగడమే కాకుండా దేశం విడిచి వెళ్లిపోయారు. అరాచకం ప్రబలిన నేపథ్యంలో బంగ్లా సైన్యాధినేత వాకర్ ఉజ్జమాన్ దేశ పరిపాలనా పగ్గాలను తన చేతుల్లోకి తీసుకున్నారు. ఉద్యోగాల్లో కోటాకు వ్యతిరేకంగా గత జూన్‌లో మొదలైన నిరసనలు క్రమంగా తారస్థాయికి చేరుకున్నాయి. ప్రభుత్వ ప్రతిస్పందన కూడా దారుణంగా ఉండటంతో దేశవ్యాప్తంగా హింసాకాండ ప్రజ్వరిల్లింది. రాజధాని ఢాకా సహా పలు నగరాలు నిరసనజ్వాలలతో అట్టుడుకుతున్నాయి. అల్లర్లు, పోలీసు కాల్పుల్లో చాలామంది యువకులు ప్రాణాలు కోల్పోయారు. నిన్నటి ఆదివారం ఒక్కరోజే 100 మందికి పైగా మరణించారు. గత నెల నుంచి ఇప్పటివరకు 300కు పైగా మరణాలు సంభవిస్తే అందులో 32 మంది 18 ఏండ్లలోపు పిల్లలే. భద్రతా దళాల చర్యల్లో మరో 25 వేలమంది గాయపడి చికిత్స పొందుతున్నారు. నర్సింగ్‌దీ జైలుపై ఆందోళనకారులు దాడిచేసి 500 మందిని విడిపించుకుపోవడం, రంగపూర్‌లోని పోలీసు క్యాంపుపై 4 వేల మంది నిరసనకారులు దాడిచేయడం పరిస్థితి తీవ్రతను తెలియజేస్తున్నది. ఆగస్టు 4న జరిగిన సహాయ నిరాకరణ ఆందోళన హింసాత్మకంగా పరిణమించింది.

1971 బంగ్లా విముక్తి యుద్ధం తర్వాత ఇంతటి తీవ్రస్థాయిలో హింసాకాండ ఎన్నడూ చెలరేగలేదంటున్నారు. ఆందోళనకారులతో మంత్రులు చర్చలు జరుపుతుంటే పాలక అవామీ లీగ్ కార్యకర్తలు దేశవ్యాప్తంగా దాడులకు దిగడం, భద్రతాదళాలు 11 వేలమందికి పైగా ఆందోళనకారులను అరెస్టు చేసి దేశాన్ని జైలుగా మార్చడమే ఈ ప్రజాగ్రహానికి కారణంగా భావించాల్సి ఉంటుంది. హసీనా తండ్రి ముజీబ్ నేతృత్వంలో సాగిన విముక్తి పోరాటంలో పాల్గొన్నవారి కుటుంబాలకు ప్రభుత్వ ఉద్యోగాల్లో 30 శాతం కోటా ఉండేది. ఇతర కోటాలూ అమల్లో ఉండేవి. ప్రజా వ్యతిరేకత కారణంగా హసీనా ప్రభుత్వం మొత్తం అన్ని రిజర్వేషన్లను 2018లో రద్దు చేసింది. ఇటీవల ఈ నిర్ణయాన్ని ఢాకా హైకోర్టు కొట్టేయడంతో మళ్లీ రిజర్వేషన్లు అమలుచేయక తప్పని పరిస్థితి ఏర్పడింది. దీంతో కోటా వ్యతిరేక ఆందోళన ఊపందుకున్నది. బంగ్లా విముక్తి యుద్ధం రోజుల్లో పాకిస్థాన్ తరపున బంగ్లాదేశీయులపై అరాచకాలకు పాల్పడిన 'రజాకార్ల'తో కోటా వ్యతిరేక నిరసనకారులను ప్రధాని షేక్ హసీనా పోల్చడంపై కూడా ప్రజల్లో ఆగ్రహం వ్యక్తమైంది. పైగా 2018, 2024 ఎన్నికల్లో ప్రతిపక్షాలను దిగ్బంధనానికి గురిచేసి షేక్ హసీనా విజయం సాధించారనే విమర్శలు వచ్చాయి. తాజా ఘటనల నేపథ్యంలో బంగ్లాదేశ్ మరోమారు సైనిక పాలన కిందకు వెళ్లడం విషాదకరం. దేశంలో శాంతిభద్రతలను పునరుద్ధరించడం అనేది సైనిక ప్రభుత్వం తక్షణ కర్తవ్యం కావాలి. సుదీర్ఘకాలం సైనిక పాలకుల కింద మగ్గిన చరిత్ర బంగ్లాదేశ్‌కు ఉంది. వాకర్ ఉజ్జమాన్ కూడా ఎర్షాద్, జియావుర్ రహమాన్ తరహాలో మరో సైనిక నియంతగా మారుతారా లేక ఎన్నికలు జరిపించి ప్రజాస్వామ్యాన్ని పునరుద్ధరించేందుకు చర్యలు చేపడుతారా? అనేది వేచిచూడాలి.

మేధావులు ఎందుకిట్లా అయ్యారు?

ఎందుకిట్లా అయ్యారని కేవలం మేధావుల గురించి ఆలోచించటం వల్ల ఉపయోగం లేదు. వారి విషయం మాత్రమే ఆలోచించటంతో సమాధానం కూడా దొరకదు. ఎందుకంటే వారిని పరిస్థితులు అట్లా తయారుచేస్తున్నాయి. పరిస్థితులు అనారోగ్యకరంగా ఉన్నట్లయితే వాటికి భిన్నంగా ఆలోచించి సమాజానికి మార్గదర్శనం చేయటం కదా మేధావుల బాధ్యత అనే సందేహం కలగవచ్చు. అది నిజమే. ఆ విధంగా చేసినవారు అనేకులు కన్పిస్తారు. వారు సమాజాన్ని చైతన్యపరిచి సంఘ సంస్కరణల నుంచి విప్లవాల వరకు అనేక మార్పులకు దోహదం చేశారు. కనీసం ఆ దిశగా అలుపు లేని కృషిని తమ జీవితాంతం వరకు చేశారు.



టంకశాల అశోక్



తెలంగాణ విషయానికి వస్తే పరిస్థితి ఏమిటి? అటువంటి మేధావుల తరం బాలగోపాల్‌తో ముగిసిపోయింది. వరవరరావు, గద్దర్‌లను ఈ పరిధిలోకి తీసుకురావటం లేదు. వారు విప్లవకారులు. మెయిన్‌స్ట్రీమ్ అనబడే పరిధిలోకి ఇమడని వారు గనుక. అందువల్ల బాలగోపాల్ తర్వాత మనకిక మిగిలింది శూన్యం. ఇంకా మేధావులమని చెప్పుకునేవారు, లేదా చెప్పబడేవారు, సమాజాన్ని చైతన్య పరుస్తున్నది, ఉత్తేజపరుస్తున్నది ఏమీ కన్పించదు. అంతేకాదు. రొటీన్ గానుగ బండ వలె మిగిలిపోయారు.

ఇందుకు సమాధానం, పైన అనుకున్నట్టు, కేవలం వారి గురించి ఆలోచించటం వల్ల దొరకదు. ముఖ్యంగా వారు రొటీన్‌లో గానుగ బండ వలె మిగిలిపోయారు తప్ప, రొటీన్‌కు భిన్నంగా ఆలోచించి పనిచేసేవారు కాకుండాపోయారు గనుక. అటువంటప్పుడు వారిని ఏ పరిస్థితులు అట్లా తయారుచేస్తున్నాయంటూ, సమాధానాన్ని పరిస్థితులలో వెతకాలి. మ్యాన్ అండ్ హిజ్ టైమ్స్ అనే మాట ఒకటుంది గదా. అదే పద్ధతిలో ప్రస్తుతపు సోకాల్డ్ మేధావులు అండ్ దెయిర్ టైమ్స్ అన్న మాట. అట్లా అర్థం చేసుకున్నప్పుడు వీరిపై వ్యతిరేకతకు బదులు సానుభూతి కలుగుతుంది.

ఈ స్థితికి ఆరంభాన్ని బహుశా 1991లో సోవియెట్ యూనియన్ పతనం నుంచి వెతకాలి. వర్తమాన తరాలకు సంబంధించిన సామాజిక మేధావులలో స్థూలంగా మూడు విధాలైన వారున్నారు. ఈ చర్చలోకి అకడమిక్ మేధావులను తీసుకురావటం లేదు. కనుక సామాజిక మేధావులంటున్నాము. ఆ ముగ్గురిలో ఒకరు, మితవాద భావనలు కలవారు. వారు సామాజిక చైతన్యాలు, పరివర్తనల గురించి ఆలోచించేవారు కాదు గనుక వారిని కూడా వదిలివేద్దాము. మిగిలిన ఇద్దరిలో ఒకరు పూర్తిగా వామపక్ష భావజాల పరిధిలోని వారు కాగా, మరొకరు ఉదారవాదులు, సాధారణ రూపంలో అభ్యుదయవాదులు. వామపక్ష పరిధిలోని వారిలో ఉభయ కమ్యూనిస్టు పార్టీలను, విప్లవ పార్టీలను అనుసరించే వారుంటారు. వాటిమధ్య తేడాలలోకి ఇక్కడ పోవటం లేదు. కాకపోతే ఒక మాట మాత్రం అనుకోవచ్చు. ఉభయ కమ్యూనిస్టులను అనుసరించే మేధావులలోనూ అనేకానేకులు, ఆ పార్టీల క్షీణత కారణంగా ఉదారవాదులుగా, సాధారణ అభ్యుదయవాదులుగా మారిపోతున్నారు. కొందరు అంతకన్నా కిందిస్థాయికి పోతున్నారు. అయినప్పటికీ ప్రస్తుత చర్చ కోసం వారిని కూడా పక్కకు పెడదాము. ఇంకా చెప్పాలంటే, ఈ ప్రభావాలు క్రమంగా విప్లవ పార్టీల అనుయాయ మేధావులపైన సైతం పడటం కనిపిస్తున్నది. మొత్తానికి ఈ రకరకాల వామపక్షీయులందరినీ పక్కన ఉంచితే మిగిలేది ఉదారవాదులు, సాధారణ అభ్యుదయవాదులు.

తక్కినవారిని వదిలివేసి ప్రత్యేకంగా వీరిగురించి చర్చించటం ఎందుకన్నది ప్రశ్న. అందుకు కొన్ని కారణాలున్నాయి. అవి సమాజ స్వభావానికి సంబంధించినవి. సమాజం, లేదా సాధారణ ప్రజలు సాధారణ సమయాలలో ఇటు మితవాదంతోనో, అటు అతివాదంతోనో ఆలోచించరు. మధ్యస్థంగా ఉంటారు. వారిలోనూ ఉదారవాదం, మంచితనం, ఆ మేరకు అభ్యుదయ లక్షణాలుంటాయి. అసాధారణ పరిస్థితులు ఏర్పడినప్పుడు వాటిని బట్టి మితవాదులు, లేదా అతివాదులు అవుతారు. అనగా, సర్వసాధారణంగా వారి ఆలోచనా ధోరణికి, ఉదారవాద-అభ్యుదయవాద మేధావుల ధోరణికి దగ్గరితనం ఉంటుంది.

> **ఒకవిధంగా వారు సహజమిత్రులన్న మాట. అందువల్ల, సాధారణ సమయాలలో ప్రజలు మితవాద మేధావులను, అతివాద మేధావులను కాదని, ఉదారవాద-అభ్యుదయ వాద మేధావుల మధ్యే మార్గానికి ఎక్కువ విలువ ఇస్తారు. దానిని అనుసరిస్తారు. ఆ కారణంగానే ప్రస్తుత సందర్భంలో ఈ వర్గం గురించి చర్చిస్తున్నాము. ఇప్పుడు తెలంగాణలో మితవాదం లేదు, అతివాదం లేదు. మధ్యేవాద పరిస్థితులు, ఆలోచనా ధోరణులే ఉన్నాయి.**

ఈ మాటలు చెప్పుకొన్నాక, కొద్దిగా నేపథ్యాన్ని చూడాలి. తెలంగాణలో కొంతకాలం కిందటి వరకు అతివాద ఆలోచనలు (ఇందులో సీపీఐ నుంచి నక్సలైట్ల వరకు అందరినీ కలిపి స్థూలంగా మాట్లాడుతున్నాము) ప్రబలంగా ఉండేవి. అన్యాయాలకు వ్యతిరేకంగా, ప్రత్యేక రాష్ట్రం కోసం తీవ్ర భావనలతో జరిగిన సుదీర్ఘ ఉద్యమాన్ని కూడా ఈ వరుసలోనే చేర్చుతున్నాము. ఈ రెండు జరిగినంతకాలం వాటి ప్రభావాలు ఉదారవాద, సాధారణ అభ్యుదయవాద, మధ్యేమార్గ మేధావులపై ఉండేవి. వారి వ్యవహరణ అందుకు అనుగుణంగా ఉండేది. కనుక కేవలం మధ్యేమార్గంలో గాక, కొంత ఎడమకు మొగ్గి ఆలోచించేవారు. మరొక మాటలో చెప్పాలంటే అప్పటిదంతా ఒక విధమైన ప్రత్యేక వాతావరణం గనుక వారి తీరు అదే పద్ధతిలో ఉండేది. అయితే వారు స్వయంగా తమ ఉదారవాద స్వభావాన్ని బట్టి గాని, సాధారణ అభ్యుదయ ధోరణిని బట్టి గాని, మితవాదుల వలెనో, అతివాదుల వలెనో, నిర్దిష్టమైన, ఖచ్చితమైన భావ ధోరణులు గలవారు కాదు. ఉదారవాదులు, సాధారణ అభ్యుదయవాదుల స్వభావం ఎప్పుడైనా అంతే. అందులోనూ, పైన అనుకున్నట్టు, అతివాదం బలంగా ఉండినంతకాలం ఆ ప్రభావాలకు లోనైన వారు, అది బలహీనపడటంతో పక్కకు జరిగి సాధారణ మధ్యేమార్గ ధోరణికి దగ్గరవుతారు. తమ గతంతో వారికి బంధం బలహీనపడుతుంది.

తెలంగాణలో ప్రస్తుతం జరుగుతున్నది అదే. మధ్యేమార్గ ధోరణికి దగ్గరకావటమంటే అనివార్యంగా తాము నిన్నటిస్థాయి అభ్యుదయవాదానికి దూరంగా జరిగి, సమాజంలో, రాజకీయాలలో, పరిపాలనలో జరిగే పరిణామాల పట్ల అంతే సాధారణంగా ఆలోచించటం, వ్యవహరించటమన్నమాట. వారిపై వామపక్ష భావజాల ప్రభావాలు బలహీనపడటం మొదటి దశ. పైన చెప్పుకున్నట్టు బాలగోపాల్ మరణం అందుకు తుది ఘడియ. వరవరరావు వంటి వారు క్రియాశీలతలో లేరు. తెలంగాణ భావజాలం కనీసం ఉద్యమకాలంలో వలె లేదు. ఇటువంటి స్థితిలో, కేవలం ఇసుక భూమి వంటి పునాదులపై నిలిచే మధ్యేమార్గ, ఉదారవాద, సాధారణ అభ్యుదయ వాద మేధావి తరగతి రకరకాల బలహీనతలకు, అయోమయాలకు, ఊగిసలాటలకు లోనవుతూ, చుక్కాని లేని పడవ వలె సాగుతుంటుంది. వారికి కొత్త రాజకీయ సానుభూతులు మొదలవుతాయి.

> **ఈ తరగతి మేధావి వర్గం మనకు ప్రస్తుతం కనిపిస్తున్నది ఆ విధంగానే. వివిధ పరిస్థితుల మధ్య వారొక కొత్త చట్రంలో బిగుసుకుని పోయారు. అందువల్ల బీఆర్ఎస్ పాలననైతే యథేచ్ఛగా విమర్శించారు. కనీసం ఒక్క మంచినైనా గుర్తించలేని నిజాయితీరాహిత్య స్థితికి పతనమయ్యారు. వరుసగా కనిపిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలలో ఒక్కదానినైనా ఎత్తిచూపగల నిజాయితీ లేని వారిగా తెలంగాణ ప్రజల దృష్టిలో మిగులుతున్నారు.**

అందుకు సంబంధించిన ప్రశ్నలు ఏవైనా ఎదురైతే కళ్లు వాల్చుకుని మొహం దింపుకోవటం, వినిపించీ వినిపించని అరకొర మాటలతో నీళ్లు నమలటం మినహా మరొకటి చేయలేని బలహీనత ఏదో వారిని ఆవరించింది. ప్రభుత్వం రానున్న రోజులలోనైనా ప్రజలకిచ్చిన హామీలు అమలుపరిచి, బాగా పాలించి, తమను తిరిగి తల ఎత్తుకునేట్టు చేయకపోతుందా అనే ఆశలతో జీవిస్తున్నారు. కానీ, మేధావులు చేయవలసింది అదికాదు కదా? మొన్నటివరకు బీఆర్ఎస్ పట్ల చేసింది కూడా అది కాదు. అయితే, వారిని ఈ విధంగా తయారుచేసింది పరిస్థితులని, అందుకు భిన్నంగా వ్యవహరించగల శక్తిని వారు కోల్పోయారని, ఒక కొత్త చట్రంలో ఇరుక్కున్నారని, అదెట్లా జరిగిందోనని పైన చెప్పుకున్నాము. చివరగా, తమపై సమాజం ఒక ఆశ పెట్టుకోవచ్చునేమో చూడాలి. నేడు కానట్టయితే రేపు తెలంగాణ సమాజం తిరిగి తన చైతన్యాన్ని తెచ్చుకున్న పక్షంలో, కనీసం ఆ ప్రభావంతో ఒత్తిడితో వీరు కూడా తమ ప్రస్తుత చట్రం నుంచి బయటపడవచ్చునా?


నేడు ప్రొఫెసర్ జయశంకర్ సార్ జయంతి

'తెలంగాణ వాదానికి అసలు సిసలు సిద్ధాంతకర్తలు ప్రజలే. ఫణికర మల్లయ్యను మించిన సిద్ధాంతకర్త ఎవరుంటరు?' అని ప్రకటించిన దార్శనికుడు ఆచార్య కొత్తపల్లి జయశంకర్. 1952 నుంచి తుదిశ్వాస విడిచేదాకా మూడు దశల ఉద్యమానికి కలం.. గళం జమిలీ సాగిన కార్యశీలత నిత్యస్మరణీయం.

తెలంగాణకు నిత్యస్ఫూర్తి



నూర శ్రీనివాస్




తెలంగాణకు జరిగిన అన్యాయాలపై శ్రీకృష్ణ కమిటీకి ఆమూలాగ్రం అందజేసిన ఉద్యమ గ్రంథం జయశంకర్ సార్. ఆయన అనుసరించి.. ఆచరించి ప్రవచించిన స్వీయ రాజకీయ అస్తిత్వ వాదం అనివార్యతే తెలంగాణకు రక్షణ కవచం. తెలంగాణ సాధన స్వప్నాన్ని సాకారం చేసుకోవటానికి ఆరాటపడుతూనే అనేక శిఖరాలను అధిరోహించిన విద్యావేత్త ఆయన.

కాకతీయ విశ్వవిద్యాలయానికి జయశంకర్ సార్ వైస్‌చాన్స్‌లర్‌గా నియమితులు కాగానే ఆయనను సన్మానిద్దామని విద్యావంతులు, అధ్యాపకులు, ఆయనను అభిమానించే బుద్ధిజీవులు ప్రజాకవి కాళోజీని వెంటబెట్టుకొని వెళ్లారు. 'సన్మానం వద్దు' అని వారిని నిలువరించటమే కాకుండా అందరినీ కూర్చోబెట్టుకొని 'నేను వీసీగా ఉన్నకాలంలో ఏమైనా తప్పులు జరిగితే కాళోజీ అధ్యక్షతన ఒక సమావేశం పెట్టండి. దానికి నన్ను పిలిచి కడిగిపారేయండి' అని పేర్కొన్న విషయాన్ని వివరిస్తూ జయశంకర్ సార్ నిజాయితీ, చిత్తశుద్ధిని ప్రొఫెసర్ లక్ష్మణ్ అనేక సందర్భాల్లో ఉదహరించారు. అలాగే ఉమ్మడి వరంగల్‌కు చెందిన ఒక సీనియర్ మంత్రి తన అనుచరుడికి విశ్వవిద్యాలయంలో ఉద్యోగం ఇవ్వాలని సిఫారసు లేఖ పంపిస్తే.. ఆ లేఖను చదివి లేఖ తెచ్చిన వ్యక్తి ముందే చించి చెత్తబుట్టలో వేశారట. ఆ వ్యక్తి ఒక్కసారిగా ఖిన్నుడై.. 'మంత్రిగారికి ఏం చెప్పమంటారు?' అని అడిగితే 'నేను ఏం చేశానో అదే చెప్పు' అని చెప్పిన ముక్కుసూటితత్వం జయశంకర్ సార్‌ది.

వివక్షకు, దోపిడీకి గురైన ప్రజలు పోరాట పంథాను అనుసరించినప్పుడు రాజకీయ పార్టీలు పుడతాయి. తెలంగాణ కోసం అట్లా ఉద్భవించిన పార్టీలు, ఆ పార్టీల నాయకుల్లో ఉన్న చిత్తశుద్ధి, లక్ష్యశుద్ధి ఆధారంగానే గమ్యాగమ్యాలు ఆధారపడి ఉంటాయన్నది జయశంకర్ సార్ అనుభవసారం. 'నేను అన్ని పార్టీలను చూసిన. తెలంగాణ అన్న ప్రతీ నాయకుడి తలుపు తట్టిన. కానీ, నాకు చంద్రశేఖర్‌రావులో లక్ష్యశుద్ధి నచ్చింది. అందుకే ఆయనతో ర్యాలీ అవుతున్న. అందులో తప్పేముంది' అని జయశంకర్ సార్ ప్రశ్నించిన సందర్భాలనేకం. జయశంకర్ సార్‌ను కేసీఆర్ నుంచి వేరు చేయాలని అనేక శక్తులు ప్రయత్నించి విఫలమయ్యాయి. 'ప్రజాస్వామిక వ్యవస్థలో రాజకీయ పార్టీలు, వాటికి ప్రాతినిధ్యం వహించే నాయకులు, ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా ప్రవర్తించకపోగా అవకాశవాద అధికార రాజకీయాలకు పాల్పడితే ప్రజలు చేయవలసిందేం ఉంటుంది? బానిసలుగా బతకటమా? లేక న్యాయం కోసం పోరాడటమా? ఘనమైన పోరాటాల చరిత్ర గల తెలంగాణ ప్రజలు ఏ పార్టీ సమర్థించినా, సమర్థించక పోయినా తమ న్యాయ పోరాటాన్ని ఐదారు దశాబ్దాల నుంచి కొనసాగిస్తూనే ఉన్నారు. లక్ష్యసాధన జరిగే వరకు కొనసాగిస్తూనే ఉంటారు. ఈ నేపథ్యంలోనే తెలంగాణ రాష్ట్ర సమితి ఆవిర్భవించింది. పోరాటాన్ని ముందుకు తీసుకుపోతున్నది. ముందుకు తీసుకెళ్లే సత్తా కేసీఆర్‌లో ఉందని నా అనుభవం చెప్తున్నది' అని చెప్పిన జయశంకర్ సార్ 2001 నుంచి కడదాకా కేసీఆర్‌తోనే నడిచారు.

తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర దశాబ్ది ముంగిట్లో జయశంకర్ సార్ ఉండి ఉంటే ఏం వ్యాఖ్యానించేవారు? ఈ పదేండ్లకాలంలో రాజకీయ నాయకులు, బుద్ధిజీవులు, మేధావులు, సామాజిక అధ్యయనశీలురు అనుసరిస్తున్న వైఖరిని ఆయన ఎలా విశ్లేషించేవారు? అన్నది ఆసక్తిదాయకం. తెలంగాణలో ప్రస్తుతం జరుగుతున్న రాజకీయ క్రీడా నేపథ్యాలు, వెలిబుచ్చుతున్న వైఖరులు కొత్తవేమీ కాదు. తెలంగాణ పట్ల ఉమ్మడి పాలకులు అందించిన అనుభవగ్రంథంలోని పాఠాలే ఇప్పటి పాలకులు వల్లె వేస్తున్నారా? అన్న అనుమానాలు కలుగుతున్నాయి. చరిత్రనూ గుర్తుచేస్తున్నాయి. నాడు తెలంగాణ ఉద్యమ తీవ్రతను సహించక 'ఒకవేళ తాము హైదరాబాద్‌ను విడిచి వెళ్లవలసి వస్తే ఆ నగరాన్ని తగులబెట్టిపోతాం' అని దబాయించినట్టే వాతావరణం నెలకొన్నది. ఇటువంటి సందర్భంలో 'బాధిత సమాజం గళం విప్పినప్పుడు విద్యావంతులు కలం పట్టాలి' అన్న ఆచార్య రావాడ సత్యనారాయణ ఉద్బోధను జీవితాంతం ఆచరించిన జయశంకర్ సార్ నడిచిన దారిని అనుసరించటమే తెలంగాణ ప్రజలు ఆయనకు ఇచ్చే నిజమైన నివాళి..!

అదే పోరాట పంథా



టి.విఠల్

మొన్న తెలంగాణ ఉద్యమంలో ఉవ్వెత్తున ఎగసిన కెరటం.. నిన్న అధికారంలో తెలంగాణను సమున్నత శిఖరాలకు చేర్చిన సంకల్పం.. నేడు ప్రతిపక్షంలో ప్రజల గొంతుకను బలంగా వినిపిస్తున్నది. హోదా ఏదైనా.. పరిస్థితి ఎలాంటిదైనా.. అందులో ఒదిగిపోయి ప్రతిక్షణం తెలంగాణ రాష్ట్ర ప్రయోజనాల కోసం పరితపించే సమర్థ నాయకత్వానికి నిలువెత్తు ప్రతీకగా కల్వకుంట్ల తారకరామారావు నిలుస్తున్నారు. నాడు తెలంగాణ సాధన కోసం గర్జించిన గళం.. నేడు తెలంగాణ ప్రజల హక్కుల కోసం మరోసారి నినదిస్తున్నది. అబద్ధపు హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్‌ను అడుగడుగునా నిలదీస్తున్నది.

నాడు స్వరాష్ట్ర సాధనే లక్ష్యంగా సాగిన మహోద్యమంలో అడుగడుగునా గులాబీ సైనికులతో కలిసి కదంతొక్కారు కేటీఆర్. సమైక్య రాష్ట్రంలోని కాంగ్రెస్ పాలకుల అన్యాయాలను ఎక్కడికక్కడ ఎండగట్టారు. కేటీఆర్ పాల్గొన్న నిరసనలకు లెక్కలేదు.. సమైక్య పాలకులు ఆయనపై పెట్టిన ఉద్యమ కేసులకు కొదవే లేదు.. ఇక అక్రమ అరెస్టులకైతే అంతే లేదు. ప్రజాక్షేత్రాన్నే ప్రధాన వేదికగా చేసుకుని కేటీఆర్ నిత్యం వినిపించిన రణన్నినాదం ఇప్పటికీ తెలంగాణ చరిత్ర పుటల్లో మార్మోగుతూనే ఉన్నది. ధర్నాలు, రాస్తారోకోలే కాదు, జాతీయ చానళ్లలో జరిగిన చర్చల్లో కూడా తెలంగాణ గోసను వినిపించి, ఢిల్లీ పెద్దలను మెప్పించి, ఒప్పించేలా సాగిన వాదనలు నేటికీ హస్తిన మీడియా సర్కిళ్లలో చర్చనీయాంశాలే.

ఇటీవల తెలంగాణ అసెంబ్లీ బడ్జెట్ సెషన్ సందర్భంగా ఆవిష్కృతమైన కేటీఆర్ అరెస్టు దృశ్యాలు.. ప్రతిఒక్కరికీ ఉద్యమ జ్ఞాపకాలను గుర్తుచేశాయి. ఓవైపు ఇందిరమ్మ రాజ్యమని చెప్పుకొంటూ.. మరోవైపు మాజీ మంత్రులు, సీనియర్ శాసనసభ్యులైన సబితా ఇంద్రారెడ్డి, సునీతా లక్ష్మారెడ్డిలను సీఎం, డిప్యూటీ సీఎం అవమానించేలా మాట్లాడిన తీరు మహిళాలోకాన్నే కాదు, తెలంగాణలోని ప్రతీఒక్కరి గుండెను గాయపరిచింది. ముఖ్యమంత్రి క్షమాపణలు చెప్పేవరకు విడిచిపెట్టేది లేదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్యే కేటీఆర్ సారథ్యంలో.. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు అసెంబ్లీలోని సీఎం చాంబర్ ముందే బైఠాయించడంతో ప్రభుత్వం ఒక్కసారిగా ఉలిక్కిపడింది. ఇక చేసేది లేక మార్షల్స్‌ను రంగంలోకి దింపి అక్కడినుంచి కేటీఆర్ సహా ఇతర ఎమ్మెల్యేలను బలవంతంగా ఎత్తుకెళ్లి పోలీసు వ్యానుల్లో పడేసింది. మార్షల్స్ చుట్టుముట్టినా కేటీఆర్ పిడికిలెత్తి ముఖ్యమంత్రి నిరంకుశ వైఖరికి వ్యతిరేకంగా నినాదాలు మాత్రం ఆపలేదు. సమైక్యరాష్ట్రంలో దర్శనమిచ్చిన ఇలాంటి దృశ్యాలు చూసి దశాబ్దం దాటిపోయింది.





పదేండ్లు ప్రశాంతంగా సాగిన తెలంగాణ అసెంబ్లీ.. ఈ సారి బడ్జెట్ సెషన్‌లో మాత్రం అట్టుడికింది. సమైక్యరాష్ట్రంలో నిరసనలకు కేంద్ర బిందువుగా నిలిచిన గన్‌పార్క్ మరోసారి ఆందోళనలకు కేరాఫ్ అడ్రస్‌గా మారింది. ఇందుకు ఆజ్యం పోసిన మరో కీలకాంశం జాబ్ క్యాలెండర్. తొలి ఏడాదిలోనే 2 లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తామని ఊరించి.. చివరికి ఉద్యోగాల ఊసు లేకుండా కాంగ్రెస్ సర్కారు ప్రకటించిన జాబ్ లెస్ క్యాలెండర్ యువత కోపాగ్నికి కారణమైంది. నిరుద్యోగులను నిలువునా దగా చేసిన కాంగ్రెస్‌పై అసెంబ్లీలోనే కాకుండా గన్‌పార్క్ వేదికగా యువత పక్షాన కేటీఆర్ జంగ్ సైరన్ మోగించారు.

> **ఓవైపు ఈసారి బడ్జెట్‌లో కాంగ్రెస్ వేసిన తప్పటడుగులను లెక్కలతో సహా ఎండగడుతూ కేటీఆర్ సంధించిన ప్రశ్నలు అధికార పక్షం తలలు పట్టుకునేలా చేశాయి. మరోవైపు అసెంబ్లీ లోపల, బయటా ఆయన సారథ్యంలో హోరెత్తిన నిరసనలు అధికార పక్షానికి ముచ్చెమటలు పట్టించాయి.**

తెలంగాణ ఆడబిడ్డల ఆత్మగౌరవ పోరాటం నుంచి.. నిరుద్యోగ యువత ఆశలపై నీళ్లు చల్లిన కాంగ్రెస్ సర్కారు నిర్వాకాన్ని నాలుగు కోట్ల తెలంగాణ ప్రజల ముందు ఎండగట్టే వరకు.. ప్రతి అధ్యాయంలో అడుగడుగునా నాటి ఉద్యమ స్ఫూర్తిని కొనసాగించారు కేటీఆర్. పదేండ్ల క్రితం వరకు సమైక్యరాష్ట్రంలో అనుసరించిన పోరాట పంథానే గుండెల నిండా నింపుకొని కాంగ్రెస్ పాలకపక్షాన్ని గడగడలాడించారు. ఉద్యమాలే ఊపిరిగా పురుడుపోసుకున్న ఈ రాజకీయ చాణక్యుడి అలుపెరగని పోరాటం ప్రభుత్వాన్ని పూర్తిగా ఆత్మరక్షణలో పడేసింది. వ్యక్తిగత దూషణలే పతాక శీర్షికలుగా మారుతున్న ఈ రోజుల్లో.. వాటికి ఏ మాత్రం తావులేకుండా, ఎవరెంత రెచ్చగొట్టినా సబ్జెక్ట్ నుంచి ఏ మాత్రం డీవియేట్ కాకుండా లెక్కలతో సహా నిలదీయడంతో ప్రభుత్వం చిక్కుల్లో పడింది. కేటీఆర్ లేవనెత్తిన ప్రశ్నలకు, సంధించిన వాగ్బాణాలకు సమాధానం చెప్పే ధైర్యం లేక ప్రభుత్వం అటెన్షన్ డైవర్షన్ పాలిటిక్స్‌కు తెరలేపి చివరికి నాలుక కర్చుకున్నది.

ఉద్యమ నాయకుడు కేసీఆర్ సారథ్యంలో అమరుల త్యాగాలతో తెచ్చుకున్న తెలంగాణ పదేండ్ల ప్రగతి ప్రస్థానంలోనూ చెరగని ముద్ర వేశారు కేటీఆర్. తెలంగాణ సాధనతోనే లక్ష్యం నెరవేరలేదని స్పష్టం చేస్తూ.. కోట్లాది మంది ఆకాంక్షలు నెరవేర్చేందుకు అహర్నిశలు శ్రమించారు. అన్నింటికన్నా ముఖ్యంగా హైదరాబాద్‌ను యువతకు ఉపాధి అవకాశాల గనిగానే కాదు, యావత్ దేశం ఖజానా నింపే అక్షయపాత్రగా తీర్చిదిద్దారు. ఉద్యమ స్ఫూర్తితో పనిచేయడం వల్లే అనతికాలంలోనే అద్భుత ఫలితాలు సాధించి విశ్వవేదికలపై శభాష్ అనిపించుకున్నారు.

(తెలంగాణ దళిత బహుజన చైతన్య వేదిక)

నేడు గద్దర్ వర్ధంతి

గద్దర్ ఓ యుద్ధగీతం

> **కత్తుల వంతెన మీద కవాతు చేసిన గద్దర్ (గుమ్మడి విఠల్‌రావు) పీడిత వర్గాల గొంతుకగా నిలిచారు. పాటనే అస్త్రంగా చేసుకొని ప్రజా ఉద్యమాల్లో సాంస్కృతిక విప్లవాన్ని సృష్టించారు. విప్లవోద్యమం, దళితోద్యమం, మలిదశ తెలంగాణోద్యమంలో అగ్గిగళంతో యుద్ధం చేశారు. ఒక్క మాటలో చెప్పాలంటే త్యాగానికి, పోరాటానికి నిలువెత్తు ప్రతిరూపం గద్దర్.**

అసమానతల సమాజంలో గద్దర్ తన జననం నుంచి మరణం వరకు అసామాన్య పోరాటం సాగించారు. 1949లో నిరుపేద కుటుంబంలో జన్మించిన గద్దర్ పాలకులు, భూస్వాముల అణచివేత, దోపిడీని ధిక్కరించారు. నూనూగు మీసాల వయసు నుంచే బీఆర్ అంబేద్కర్, అల్లూరి సీతారామరాజు జీవిత చరిత్రలను అర్థమయ్యేరీతిలో ఒగ్గు కథలు, బుర్ర కథల రూపంలో వినిపించి మట్టి మనుషుల్లో చైతన్యం రగిలించారు. గోసి, గొంగళి, కాళ్లకు గజ్జెలు, చేతి కర్ర, ఎర్రజెండా కలగలిపిన ఆహార్యంతో గద్దర్ ఒక ట్రెండ్‌ను సృష్టించారు.



'అమ్మా తెలంగాణమా.. ఆకలి కేకల గానమా' పాటలో ఒకవైపు ఆవేదన చెందుతూనే, మరోవైపు 'ఎట్టోళ్ల మట్టి చిప్పవు.. గాయిదోళ్ల గండ్ర గొడ్డలివి' అంటూ తిరుగుబాటును నేర్పడం గద్దర్‌కే చెల్లింది. ప్రభుత్వమిచ్చే 'నంది అవార్డు'ను తిరస్కరించి ప్రజల హృదయాల్లో స్థానం సంపాదించుకున్నారు. జీవితమంతా ప్రజా పోరాటాల్లో గడిపిన గద్దర్‌ను రాజ్యం 75 ఏండ్ల వయస్సు వరకు 32 పోలీసు కేసులతో వెంటాడింది. తుపాకీ గుండ్లను ఎదుర్కొన్న గద్దర్ 'నన్నూ గన్న తల్లులారా, తెలుగూ తల్లి పల్లెల్లారా.. మీ పాటనై వస్తున్నానమ్మో మా అమ్మాల్లారా' అంటూ ప్రజల వెంట నడిచారు. నక్సల్, మావోయిస్టు ఉద్యమ పంథాలో నడిచిన గద్దర్ 70 ఏండ్లు నిండాక తొలిసారి ఓటు హక్కు వినియోగించుకున్నారు. 'భారత రాజ్యాంగమే మనకు రక్ష.. ఓట్ల విప్లవానికి సిద్ధం కావాల'ంటూ తన జీవిత చరమాంకంలో పిలుపునివ్వడం అంటే బహుజనులను రాజ్యాధికారం వైపు పయనించమన్నట్టే. అదే ఆయన చివరి సందేశంగా భావించాలి.

తన జీవిత కాలమంతా పోరుబాటలో నడిచిన గద్దర్ 2023, ఆగస్టు 6న అనారోగ్యంతో తుదిశ్వాసను విడిచారు. రాష్ట్ర ప్రభుత్వం ఆయన విగ్రహాన్ని ట్యాంక్ బండ్‌పై ప్రతిష్ఠించి, పాఠ్యపుస్తకాల్లో ఆయన జీవిత చరిత్రను పొందుపర్చాలి. అప్పుడే ఆయనకు మనం ఘన నివాళులు అర్పించినవారమవుతాం.

-నరేష్ పాపట్ల, 95054 75431

ఆటోడ్రైవర్ ఆత్మహత్య

ఎడపల్లి, ఆగస్టు 5: వివిధ కారణాలతో జీవితంపై విరక్తి చెందిన ఆటోడ్రైవర్ ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన సోమవారం నిజామాబాద్ జిల్లా ఎడపల్లి మండలం బాపూనగర్‌లో చోటుచేసుకుంది. బాపూనగర్‌కు చెందిన రేపక కుమార్ (38)కు భార్య మౌనిక, పిల్లలు ఉన్నారు. కుమార్ ఆటో నడుపుతూ కుటుంబాన్ని నెట్టుకొస్తున్నాడు. కొద్దిరోజులుగా ఆటోకు గిరాకీ లేకపోవడంతో మద్యానికి బానిసయ్యాడు. మరోవైపు ఆటో నడిపే విషయంలో సోమవారం ఇంట్లో గొడవ జరిగింది. దీంతో కుమార్ గదిలోకి వెళ్లి ఉరేసుకున్నాడు. భార్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై వంశీకృష్ణారెడ్డి తెలిపారు.



సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండలం తిప్పాపూర్ పంప్‌హౌస్ డెలివరీ సిస్టర్న్ నుంచి బయటికొస్తున్న గోదారి జలాలు

అన్నపూర్ణకు గోదావరి జలాలు

హరీశ్‌రావు లేఖకు దిగొచ్చి నీటిని వదిలిన సర్కారు

రాజన్న సిరిసిల్ల, ఆగస్టు 5: కాళేశ్వరం నుంచి గోదావరి జలాలను ప్రభుత్వం ఎట్టకేలకు అన్నపూర్ణ జలాశయానికి విడుదల చేసింది. మాజీమంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు లేఖతో రాష్ట్ర సర్కారు స్పందించింది. సిద్దిపేట అన్నపూర్ణ, రంగనాయక, మల్లన్నసాగర్, కొండపోచమ్మ రిజర్వాయర్లను నింపి సాగునీరివ్వాలని శనివారం నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి లేఖ రాయగా.. ఆదివారం సాగునీటి పారుదల శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ రాహుల్ బొజ్జా స్పందించారు. మిడ్‌మానేరు ద్వారా సిద్దిపేట జిల్లాలోని రిజర్వాయర్లకు నీటిని ఎత్తిపోస్తామని చెప్పినట్టుగానే సోమవారం నుంచి సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండలం అనంతగిరిలోని అన్నపూర్ణ ప్రాజెక్టుకు ఎత్తిపోతలను ప్రారంభించారు. బోయినపల్లి మండలంలోని మధ్యమానేరు నుంచి అండర్ టన్నెళ్ల ద్వారా తిప్పాపూర్‌లోని సర్జ్‌పూల్‌కు జలాలు చేరుతుండగా.. ఇక్కడి పంప్‌హౌస్‌లో రెండు బాహుబలి మోటర్లను ఆన్ చేశారు. ఒక్కో మోటర్ ద్వారా 3,220 క్యూసెక్కుల చొప్పున 6,440 క్యూసెక్కులు అన్నపూర్ణ జలాశయానికి తరలిస్తున్నట్టు ఏఈ సమరసేట తెలిపారు. మాజీ మంత్రి హరీశ్‌రావు, మాజీ జడ్పీ వైస్ చైర్మన్ సిద్ధం వేణు, బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు పల్లె నర్సింహారెడ్డి నీటిని విడుదల చేయాలని కోరిన మూడు రోజులకే ప్రభుత్వం స్పందించడంతో రైతులు సంబురపడుతున్నారు.

పెదవాగు మరమ్మతులకు 3.5 కోట్లు

- ఇరిగేషన్ అధికారుల అంచనా
- ప్రాజెక్టు పరిస్థితిపై జీఆర్‌ఎంబీ సమావేశం

హైదరాబాద్, ఆగస్టు 5 (నమస్తే తెలంగాణ) : ఖమ్మం జిల్లా అశ్వారావుపేటలోని పెదవాగు ప్రాజెక్టుకు తాత్కాలిక మరమ్మతుల కోసం దాదాపు రూ.3.5కోట్లు అవసరమవుతాయని ఇరిగేషన్ అధికారులు అంచనా వేశారు. ఈ మేరకు ఏపీతోపాటు జీఆర్‌ఎంబీకి నివేదించారు. ప్రాజెక్టుపై తెలంగాణ, ఏపీ రాష్ట్రాలతో గోదావరి రివర్ మేనేజ్‌మెంట్ బోర్డు(జీఆర్‌ఎంబీ)చైర్మన్ ముకేశ్‌కుమార్ సిన్హా జలసౌధలో సోమవారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ప్రాజెక్టుకు వాటిల్లిన నష్టం, పునరుద్ధరణపై సుదీర్ఘంగా చర్చించారు. ఈ సందర్భంగా ప్రాజెక్టుకు వాటిల్లిన నష్టాన్ని తెలంగాణ, ఏపీ అధికారులు జీఆర్‌ఎంబీకి వివరించారు. జీఆర్‌ఎంబీ చైర్మన్ మాట్లాడుతూ.. ప్రాజెక్టుకు భారీ వరద వచ్చిన నేపథ్యంలో హైడ్రాలజీ అధ్యయనం చేయించాలని, ప్రాజెక్టుకు శాశ్వత మరమ్మతుల కోసం ఇరు రాష్ట్రాలు అంచనాలు రూపొందించాలని, డ్యామ్ సేఫ్టీ సూచనలను పరిగణలోకి తీసుకోవాలని సూచించారు. ప్రాజెక్టు కాల్వల పునరుద్ధరణ పనులను ఏ రాష్ట్రానికి ఆ రాష్ట్రం చేసుకోవాలని స్పష్టం చేసినట్టు తెలిసింది. సమావేశంలో బోర్డు సెక్రటరీ(టెక్నికల్)కనోడియా, ఎస్‌ఈ ప్రసాద్, తెలంగాణ నుంచి ప్రాజెక్టు ఈఈ సురేశ్, ఏపీ ఏలూరు ఎస్‌ఈ దేవప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.

కన్నెపల్లిలో పంపింగ్ స్టార్ట్ చేయాలి

- కృష్ణా, గోదావరి నీళ్లు సముద్రం పాలు
- రాజకీయ కుట్రలో భాగమే ప్రాజెక్టుల ఖాళీ
- రైతాంగానికి నీరు ఇవ్వకపోతే పోరాటమే
- మాజీ మంత్రులు జగదీశ్‌రెడ్డి, గంగుల హెచ్చరిక



ఢిల్లీలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి, చిత్రంలో ఎమ్మెల్యేలు గంగుల కమలాకర్, కొత్త ప్రభాకర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి

హైదరాబాద్, ఆగస్టు 5 (నమస్తే తెలంగాణ): కన్నెపల్లిలో తక్షణమే పంపిగ్ ప్రారంభించి కాళేశ్వరం జలాలను రైతాంగానికి అందించాలని బీఆర్‌ఎస్ పార్టీ డిమాండ్ చేసింది. వందల టీఎంసీల కృష్ణాగోదావరి జలాలు సముద్రం పాలవుతున్నా సర్కారు పట్టించుకోవటం లేదని నిప్పులు చెరిగింది. కాంగ్రెస్ ప్రభుత్వం రాజకీయాల ద్వారా తమను సాధించాలనకుంటే నిరభ్యంతరంగా చేసుకోవచ్చని, అదే సమయంలో రైతాంగాన్ని ఇబ్బందులకు గురిచేస్తామంటే బీఆర్‌ఎస్ సహించదని తేల్చిచెప్పింది. ఢిల్లీలో సోమవారం మాజీ మంత్రులు జగదీశ్‌రెడ్డి, గంగుల కమలాకర్, ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా జగదీశ్‌రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం రైతు వ్యతిరేక విధానాలను అనుసరిస్తుందని ఎండగట్టారు. రాష్ట్రంలో 8 నెలలుగా పరిపాలన పడకేసిందని విమర్శించారు. సాగునీటి రంగంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని ధ్వజమెత్తారు. గోదావరి, కృష్ణా నదుల నుంచి నీరు వందల టీఎంసీల నీరు వృథాగా సముద్రం పాలవుతున్నా రైతులకు నీరు ఇచ్చేందుకు కాంగ్రెస్ సర్కారుకు మనసు రావడం లేదని ధ్వజమెత్తారు. రాజకీయ కుట్రలో భాగంగా రైతులకు అందాల్సిన అన్నారం, సుందిళ్ల ప్రాజెక్టుల్లో నీటిని ప్రభుత్వం దుర్మార్గంగా ఖాళీ చేసిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. మరోవైపు శ్రీశైలం, నాగార్జునసాగర్‌కు నీళ్లు ఉన్నాయనే సమాచారం తమకు ఉన్నదని, ఉన్న నీటిని సద్వినియోగం చేసుకునే సోయి కాంగ్రెస్ సర్కార్‌కు లేదని మండిపడ్డారు. మహబూబ్‌నగర్, నల్లగొండ జిల్లాల్లో వర్షాభావం కారణంగా కరవు పరిస్థితులు కనిపిస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. నాగార్జునసాగర్ ఎడమ కాలువకు నీటిని విడుదల చేసి అన్ని రిజర్వాయర్లు, చెరువులు నింపాలని డిమాండ్ చేశారు.

భూగర్భ జలాలు అడుగంటుతున్నాయి: కొత్త ప్రభాకర్‌రెడ్డి

రైతులను కేసీఆర్ కన్నబిడ్డలుగా కడుపులో పెట్టుకొని చూసుకుంటే కాంగ్రెస్ సర్కార్ రైతాంగాన్ని తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నదని ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు. రంగనాయక్‌సాగర్, అనంతసాగర్, కొండపోచమ్మ సాగర్ నింపి హల్దీ వాగు, కూడవెల్లివాగులో కేసీఆర్ గోదావరి నీటితో నింపి గజ్వేల్, నర్సాపూర్, దుబ్బాక, మెదక్ నియోజకవర్గాలోని రైతాంగానికి నీటి కష్టాలు లేకుండా చేశారని గుర్తుచేశారు.

రైతుల నోట్లో మట్టి కొడుతున్న కాంగ్రెస్: గంగుల

కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల నోట్లో మట్టికొడుతున్నదని మాజీ మంత్రి గంగుల కమలాకర్ ఆరోపించారు. ఇటీవల బీఆర్‌ఎస్ పార్టీ ప్రజాప్రతినిధుల బృందం కాళేశ్వరం ప్రాజెక్టు పర్యటకు వెళ్లిన తరువాత నీటిని విడుదల చేసిందని ఆ తరువాత ఆపేసిందని మండిపడ్డారు. మిడ్‌మానేర్, ఎల్లంపల్లి, ఎల్‌ఎండీ ప్రాజెక్టులను కాంగ్రెస్ సర్కార్ కావాలనే ఎండబెట్టిందని ఆరోపించారు. ఇన్‌ఫ్లో ఉన్నా కన్నెపల్లి పంపింగ్ చేయడం లేదని పేర్కొన్నారు. ఎన్‌డీఎస్‌ఏ పేరు చెప్పి ప్రభుత్వం తప్పించుకోవాలని చూస్తున్నదని మండిపడ్డారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్‌డీఎస్ ఏకు ప్రస్తుత పరిస్థితిని వివరించిందా? ఒకవేళ ఉంటే ఎన్‌డీఎస్‌కు పంపిన నివేదికను బయటపెట్టాలని డిమాండ్ చేశారు. కన్నెపల్లి నుంచి లిఫ్ట్ చేయ డానికి సమస్య ఏమిటని ప్రశ్నించారు. ఇప్పటికైనా ప్రభుత్వం భేషజాలకు పోకుండా నీటిని విడుదల చేయాలని హితవు పలికారు.

అనర్హత వేటు పడేదాకా పోరాటం

బీఆర్‌ఎస్ టికెట్‌పై గెలిచి పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్‌పై న్యాయకోవిదులు, రాజ్యాంగ నిపుణులతో చర్చించామని మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి పేర్కొన్నారు. చట్టానికి వ్యతిరేకంగా ప్రవర్తిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వ తీరుపై న్యాయపోరాటం చేస్తామని స్పష్టం చేశారు. పార్టీ ఫిరాయింపుల చట్టాన్ని తెచ్చిన కాంగ్రెస్ పార్టీయే ఆ చట్టానికి తూట్లు పొడుస్తున్నదని మండిపడ్డారు. ఈ విషయంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్రానికో విధానం అన్నట్టుగా వ్యవహరించడం దుర్మార్గమని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ వైఖరిని ప్రజల్లో ఎండగడతామని హెచ్చరించారు. న్యాయస్థానాలపై తమకు నమ్మకం ఉన్నదని, హైకోర్టు తీర్పు కోసం వేచి చూస్తున్నామని పేర్కొన్నారు.

కొడంగల్ -నారాయణపేట లిఫ్ట్‌కు టెండర్లు

- 9వ తేదీ నుంచి బిడ్ల స్వీకరణ

హైదరాబాద్, ఆగస్టు5 (నమస్తే తెలంగాణ): కొడంగల్-నారాయణపేట ఎత్తిపోతల పథకం (ఎన్‌కేఎల్‌ఐఎస్) పనుల కోసం టెండర్లను ఆహ్వానించేందుకు నీటిపారుదల శాఖ సిద్ధమైంది. రెండు ప్యాకేజీలుగా విభజించి పనులు చేపట్టాలని, ఈ నెల 9 నుంచి టెండర్లు స్వీకరించాలని నిర్ణయించింది. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని నారాయణపేట, కొడంగల్, మక్తల్ నియోజకవర్గాల్లో ని లక్ష ఎకరాలకు సాగునీటితోపాటు నారాయణపేట జిల్లాలో తాగునీటి అవసరాలను తీర్చేందుకు ఎన్‌కేఎల్‌ఐఎస్‌ను ప్రభుత్వం ప్ర తిపాదించింది. దీనికోసం రూ.4,350 కోట్ల అంచనా వేసింది. ఈ మేరకు పథకం పనులకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇప్పటికే శం కుస్థాపన చేయగా, ఇటీవల బడ్జెట్‌లో కూడా ప్రభుత్వం దాదాపు రూ.610 కోట్లను కేటాయించింది. పాంచ్‌దేవ్ బండ పంప్‌హౌస్ నుంచి బీమా పథకంలో భాగంగా నిర్మించిన భూత్పూర్ జలాశయానికి, అక్కడి నుంచి ఊట్కూరు చెరువుకు తరలించే పనులను ప్యాకేజీ 1 కింద చేపట్టనున్నారు. ఊట్కూరు చెరువు నుంచి జయమ్మ చెరువుకు, అక్కడి నుంచి కనుకుర్తి చెరువుకు నీటిని తరలించే పనులను ప్యాకేజీ 2 కింద చేపట్టనున్నారు. ఒక్కో ప్యాకేజీ పనులకు దాదాపు రూ.1,100 కోట్లు అవుతుందని అధికారులు అంచనా వేశారు.



నాగార్జునసాగర్ గేట్ల నుంచి దిగువకు వెళ్తున్న నీరు

ఉప్పొంగుతున్న కృష్ణమ్మ

హైదరాబాద్, ఆగస్టు 5 (నమస్తే తెలంగాణ): కర్ణాటక, మహారాష్ట్రలో విస్తారంగా కురుస్తున్న వర్షాలతో కృష్ణమ్మ ఉప్పొంగి ప్రవహిస్తున్నది. జూరాల, శ్రీశైలం ప్రాజెక్టులకు స్థిరంగా భారీ వరద ప్రవాహం కొనసాగుతున్నది. శ్రీశైలం ప్రాజెక్టుకు 3.90 లక్షల క్యూసెక్కుల ప్రవాహం కొనసాగుతుండగా, దిగువకు నీటిని విడుదల చేస్తున్నారు. నాగార్జునసాగర్ ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి నిల్వ సామర్థ్యం 312 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 294 టీఎంసీలకు చేరుకున్నది. 16 గేట్లను ఎత్తి వరదను దిగువకు విడుదల చేస్తున్నారు. మరోవైపు గోదావరిలో ఎస్సారెస్పీ, ఎల్లంపల్లి ప్రాజెక్టులకు వరద స్వల్పంగా కొనసాగుతున్నది.

నాగార్జునసాగర్, శ్రీశైలం ప్రాజెక్టుల నుంచి సాగునీటి అవసరాలకు సంబంధించి ఇండెంట్‌ను ఇవ్వాలని ఇరు రాష్ట్రాలకు తాజాగా కృష్ణా రివర్ మేనేజ్‌మెంట్ బోర్డు లేఖ రాసింది. 12 టీఎంసీలు కావాలని బోర్డుకు ఏపీ ఇండెంట్ సమర్పించినట్టు సమాచారం.



టీచర్ల కోసం పాఠశాలకు తాళం వేసి నిరసన

ఉపాధ్యాయులను నియమించాలని డిమాండ్ చేస్తూ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వాపురం మండలం కుర్వపల్లి కొత్తూరు ప్రాథమిక పాఠశాల విద్యార్థులు పాఠశాలకు తాళం వేసి తల్లిదండ్రులతో కలిసి ఆందోళన చేపట్టారు. గతంలో పనిచేసిన ముగ్గురు ఉపాధ్యాయులు బదిలీపై వెళ్లగా.. ఐదు తరగతులకు ఒక్కరు మాత్రమే విధులు నిర్వర్తిస్తున్నారని, ఏజెన్సీ ప్రాంతంలోని పాఠశాలపై చిన్నచూపు చూడకుండా వెంటనే ఉపాధ్యాయులను కేటాయించాలని డిమాండ్ చేశారు.

- అశ్వాపురం

ధర్నాలతో దద్దరిల్లిన తెలంగాణ

సమస్యలను వెంటనే పరిష్కరించాలని కార్మిక, విద్యార్థి సంఘాల డిమాండ్ • రాష్ట్రవ్యాప్తంగా నిరసనలు

కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చాలని, పెండింగ్ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ వివిధ రంగాల కార్మికులు, విద్యార్థి సంఘాల నాయకులు రాష్ట్ర వ్యాప్తంగా సోమవారం ధర్నాలు నిర్వహించారు. ఆయా జిల్లా కేంద్రాల్లో ర్యాలీలు తీసి అధికారులకు వినతిపత్రాలు అందజేశారు. వెంటనే సమస్యలు పరిష్కరించకుంటే ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని పీడీఎస్‌యూ, ఏబీవీపీ నాయకులు డిమాండ్ చేశారు. పింఛన్లు పెంచాలని, సాగు భూములకు పట్టాలివ్వాలని లబ్ధిదారులు ప్రభుత్వాన్ని కోరారు.



చేనేత సమస్యలు పరిష్కరించాలి

చేనేత సమస్యలను పరిష్కరించాలని యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలం కొయ్యలగూడెం గ్రామ చేనేత సహకార సంఘం వద్ద చేనేత కార్మిక సంఘం నాయకులు ధర్నా చేశారు. గత ప్రభుత్వం ప్రవేశపెట్టిన త్రిఫ్ట్ పథకం నిలిపివేశారని, ముద్ర రుణాలు, మార్కెట్ సౌకర్యం కల్పించడం లేదని, బునకర్ యోజన పథకాన్ని తీసివేశారని ఆవేదన వ్యక్తం చేశారు. చేనేత నాయకులు మాచర్ల కృష్ణ, గంజి శ్రీనివాస్, జయశంకర్, మధు, చేనేత కార్మికులు పాల్గొన్నారు.

- చౌటుప్పల్ రూరల్

రేవంత్ ప్రభుత్వానికి మూల్యం తప్పదు: పీడీఎస్‌యూ



విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఖమ్మంలోని కాల్వొడ్డు నుంచి ట్రాఫిక్ పోలీసుస్టేషన్ వరకు పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. అనంతరం నాయకులు అదనపు కలెక్టర్ మధుసూదన్‌కు వినతిపత్రం అందించారు.

-ఖమ్మం ఎడ్యుకేషన్,

ఆటో కార్మికుల సంక్షేమ బోర్డు ఏర్పాటుకు ఆందోళన



కేంద్ర ప్రభుత్వం ఆటో డ్రైవర్లకు, రవాణారంగ కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ ఆల్ ఇండియా రోడ్ ట్రాన్స్‌పోర్ట్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు విక్రమ్ ఆధ్వర్యంలో ఖమ్మం జిల్లా ప్రాంతీయ రవాణాశాఖ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఆటో కార్మికులకు రాష్ట్ర ప్రభుత్వం రూ.12 వేల ఆర్థిక సాయం అదించాలని డిమాండ్ చేశారు. అనంతరం ఎంవీఐ వెంకటరమణకు వినతిపత్రం అందజేశారు. సంఘం బాధ్యులు జిల్లా ఉపేందర్, రాందాస్, సాగర్, నాగేశ్వరరావు, రమేశ్, నర్సయ్య, లక్ష్మణ్, బాలాజీ, రవి, సైదులు, సతీశ్, నరేశ్ పాల్గొన్నారు.

- రఘునాథపాలెం

సాగు భూములకు పట్టాలివ్వాలివ్వాలని ఆందోళన

మహబూబ్‌నగర్ జిల్లా హన్వాడ సమీపంలోని సర్వే నం. 718లో సాగు చేసుకుంటున్న భూములకు పట్టాలు అందించాలని 30 మంది దళితులు తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేపట్టారు. వ్యవసాయ వృత్తిదారుల, తెలంగాణ సర్వీస్ వర్కర్స్ యూనియన్లు మద్దతుగా నిలిచాయి. అనంతరం డిప్యూటీ తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో వ్యవసాయ వృత్తిదారుల యూనియన్ రాష్ట్ర కార్యదర్శి వెంకటయ్య, నాయకులు నాగన్న, జంబులయ్య, వెంకటేశ్వరమ్మ, స్వాతి, నర్సింహులు, శ్రీనివాసులు పాల్గొన్నారు.

- హన్వాడ



సూపర్‌వైజర్లు బూతులు తిడుతున్నారు!



సూపర్‌వైజర్లు తమను బూతులు తిడుతున్నారని సచివాలయ హౌజ్‌కీపింగ్ సిబ్బంది, స్వీపర్లు సోమవారం ఆందోళనకు దిగారు. గ్రౌండ్‌ఫ్లోర్‌లో బైఠాయించి నిరసన తెలిపారు. పోలీసులు వారికి సర్ది చెప్పేందుకు ప్రయత్నించారు. కొందరిని చీఫ్ సెక్యూరిటీ ఆఫీసర్(సీఎస్‌వో)దగ్గరికి తీసుకెళ్లి మాట్లాడించారు.

- సెక్రటేరియట్

పింఛన్లు పెంచాలని వామపక్షాల ధర్నా



కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన మాట మేరకు జీవనభృతి రూ.4 వేలకు పెంచాలని డిమాండ్ చేస్తూ ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలోని తహసీల్ కార్యాలయాల ఎదుట ఐఎఫ్‌టీయూ, సీపీఎం ఎంఎల్ (మాస్ లైన్) ఆధ్వర్యంలో ధర్నా చేశారు. కాంగ్రెస్ ఆరు గ్యారెంటీలను అమలు చేయాలని, నూతన రేషన్ కార్డులు ఇవ్వాలని, స్థలమున్న వారికి ఇల్లు కట్టుకోవడానికి రూ.10 లక్షల రుణం ఇవ్వాలని కోరారు.

- డిచ్‌పల్లి

ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయండి



పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను వెంటనే విడుదల చేయాలని ఏబీవీపీ నాయకులు సోమవారం శంషాబాద్‌లో రాస్తారోకో నిర్వహించారు. ఎన్నికల హామీలు నెరవేర్చడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని మండిపడ్డారు.

- శంషాబాద్ రూరల్

గృహజ్యోతితో ఉపాధి కోల్పోయాం.. ఆదుకోండి



గృహజ్యోతితో ఉపాధి కోల్పోయిన తమకు ఉపాధి కల్పించాలని బిల్ కలెక్టర్లు హైదరాబాద్‌లోని ఇందిరా పార్కు వద్ద ధర్నాచౌక్‌లో నిరసనకు దిగారు.

సర్కార్ స్కూళ్లల్లో పరిశుభ్రతకు నిధులు

- 4 నెలల ఆలస్యంగా కేటాయింపు
- శ్లాబుల ఆధారంగా 3వేల నుంచి 20వేలు విడుదల
- 'సీఎం హామీ నీటి మూటలేనా' అంటూ 'నమస్తే' కథనం
- స్పందించిన రేవంత్ సర్కారు... ఉత్తర్వులు జారీ

నమస్తే ఎఫెక్ట్

హైదరాబాద్, ఆగస్టు 5 (నమస్తే తెలంగాణ): సర్కారు బడుల పరిశుభ్రతకు నాలుగు నెలలు ఆలస్యంగా రేవంత్ సర్కారు నిధులు కేటాయించింది. బడులు ప్రారంభమైన రెండు నెలల తర్వాత పాఠశాలల పరిశుభ్రత బాధ్యత 'అమ్మ ఆదర్శ పాఠశాల' కమిటీలకు అప్పగిస్తూ ఉత్తర్వులు విడుదల చేసింది. కేవలం పరిశుభ్రత నిర్వహించేవారికి గౌరవ భత్యం చెల్లించడానికి మాత్రమే ఆ గ్రాంటు నిధులను వాడాలని తెలిపింది. పరిశుభ్రత కోసం పని చేసే వారి పేరు ఎక్కడా ఉండరాదని, కమిటీ పేరు మీదనే చెల్లించాలని విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి బుర్రా వెంకటేశం ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా పాఠశాలలకు నెలవారీగా పరిశుభ్రతకు గ్రాంటును కేటాయించారు. కనిష్ఠంగా రూ.3 వేలు, గరిష్ఠంగా రూ.20 వేల చొప్పున పది నెలల పాటు గ్రాంటు ఇవ్వనున్నారు. మార్చిలో ఉపాధ్యాయ సంఘాలతో నిర్వహించిన సమావేశంలో పారిశుధ్య కార్మికులను నియమించాలని సంఘాలు ముక్తకంఠంతో కోరాయి. అదే సభలో సీఎం రేవంత్‌రెడ్డి పారిశుధ్య కార్మికులను నియమిస్తామని హామీ ఇచ్చి విస్మరించారు. ఇటీవలే ఎల్బీ స్టేడియంలో టీచర్లతో ముఖాముఖి నేపథ్యంలో 'సీఎం హామీ నీటి మూటలేనా' అంటూ 'నమస్తే తెలంగాణ' కథనాన్ని ప్రచురించింది. దీంతో స్పందించిన సీఎం రెండు రోజుల్లోనే నిధులు కేటాయిస్తామని హామీ ఇచ్చారు. ఈ మేరకు విద్యాశాఖ ప్రత్యేకంగా జీవోను జారీ చేసింది.

గతంలో స్కావెంజర్లు !

గతంలో 28 వేల ప్రభుత్వ పాఠశాలల్లో పారిశుధ్య పనులకు ఔట్ సోర్సింగ్ సర్వీస్ పర్సన్స్ పేరిట 28 వేల మంది వరకు పనిచేసేవారు. వీరికి గౌరవ వేతనం రూ.2500 ఇచ్చేవారు. కరోనా సమయంలో విద్యాసంస్థలు మూసివేయడంతో వీరిని తొలగించి, పంచాయతీరాజ్ , మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ విభాగానికి బాధ్యతలు అప్పగించారు. ఆయా శాఖలు సమర్థవంతంగా నిర్వహించకపోవడంతో టీచర్లే స్కావెంజర్లను నియమించుకున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఆ బాధ్యతను అమ్మ ఆదర్శ కమిటీలకు అప్పగించింది. గ్రాంటు నిధులపై పీఆర్టీయూ, టీజీయూటీఎఫ్, ఎస్టీయూటీఎస్ రాష్ట్ర అధ్యక్షులు పింగళి శ్రీపాల్‌రెడ్డి, జంగయ్య, పర్వత్‌రెడ్డి, కార్యదర్శులు బీరెల్లి కమలాకర్‌రావు, చావా రవి, సదానందం గౌడ్ వర్షం వ్యక్తం చేసి ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపారు.

ఎన్‌రోల్ మెంట్ స్లాబ్	నెలకు ఒక్కో స్కూలుకు
1 నుంచి 30	రూ.3 వేలు
31 నుంచి 100	రూ.6 వేలు
101 నుంచి 250	రూ.8 వేలు
251 నుంచి 500	రూ.12 వేలు
501 నుంచి 750	రూ.15 వేలు
750 మంది కంటే ఎక్కువ	రూ.20 వేలు

పురుగుల అన్నంపై ప్రశ్నిస్తే కొడ్తుండ్రు

తల్లిదండ్రులతో కన్నీరు పెట్టుకున్న విద్యార్థినులు



పెంట్లవెల్లిలో కేజీబీవీ వద్ద తల్లిదండ్రులతో కన్నీరు పెట్టుకుంటున్న విద్యార్థినులు

పెంట్లవెల్లి, ఆగస్టు 5 : పురుగుల అన్నం పెడుతున్నారని ఎస్‌వో స్వప్న మేడానికి ఫిర్యాదు చేస్తే గిన్నెతో కొట్టారని కస్తూర్బా గాంధీ పాఠశాల విద్యార్థినులు సోమవారం తల్లిదండ్రులతో కంటతడి పెట్టుకున్నారు. ఆదివారం రాత్రి నాగర్‌కర్నూల్ జిల్లా పెంట్లవెల్లి కేజీబీవీలో 30 మంది విద్యార్థినులు ఫుడ్‌పాయిజన్‌కు గురై దవాఖానలో చికిత్స పొందుతున్న విషయం తెలిసిన విద్యార్థినుల తల్లిదండ్రులు విద్యాలయానికి చేరుకున్నారు. విద్యార్థినులు పేరెంట్స్‌తో మాట్లాడుతూ 'మాకు ఈ పాఠశాల వద్దు.. మీ వెంటే మేము వస్తాం..' అంటూ కన్నీరు పెట్టుకున్నారు. ప్రజాపాలన పేరుతో గద్దెనెక్కిన రేవంత్ సీఎం అయ్యాక విద్యాశాఖకు మంత్రిని నియమించలేదని ధ్వజమెత్తారు. పురుగుల అన్నం, కుళ్లిపోయిన కూరగాయలతో వంటచేసి పెడుతున్నారని వాపోయారు. ఎస్‌వోను వివరణ కోరేందుకు ప్రయత్నించగా.. అందుబాటులోకి రాలేదు.

ఆర్థిక మాంద్యంలో పెట్టుబడులా?

- సీఎం అమెరికా పర్యటనపై కార్పొరేట్ వర్గాల్లో చర్చ
- అధ్యక్ష ఎన్నికల్లో తలమునకలైన అమెరికా
- విపత్కర వేళ పెట్టుబడులు ఎలా సాధ్యమని ప్రశ్నలు
- 'మరో దావోస్‌నా?' అంటూ అనుమానాలు

హైదరాబాద్, ఆగస్టు 5 (నమస్తే తెలంగాణ): సీఎం రేవంత్‌రెడ్డి అమెరికా పర్యటన విజయవంతమవుతుందా అని కార్పొరేట్ వర్గాల్లో చర్చ జరుగుతున్నది. ప్రస్తుతం అమెరికా ఆర్థిక మాంద్యం అంచున ఊగిసలాడుతున్నది. అమెరికా ఆర్థిక మాంద్యం భయంతోనే సోమవారం స్టాక్ మార్కెట్లు కుప్పకూలాయి. మన దేశంలో ఒకే రోజు రూ.15 లక్షల కోట్ల మేర ఇన్వెస్టర్ల సంపద ఆవిరైంది. మరోవైపు అమెరికాలో అధ్యక్ష ఎన్నికలు జరుగుతున్నాయి. కార్పొరేట్ కంపెనీలు సైతం కొత్త అధ్యక్షుడికి తగ్గట్టుగా తమ పాలసీలు మార్చుకోవాలనే ఉద్దేశంతో ఎన్నికలను క్షుణ్ణంగా పరిశీలిస్తున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో సీఎం రేవంత్‌రెడ్డి, రాష్ట్ర ప్రతినిధి బృందం పెట్టుబడులు సాధిస్తుందా? అన్నది మార్కెట్ వర్గాల్లో మిలియన్ డాలర్ల ప్రశ్నగా మారింది. ఇందుకు కాగ్నిజెంట్ ప్రకటనే ఉదాహరణగా చెప్తున్నారు. తెలంగాణలో 15 వేల ఉద్యోగాలు కల్పిస్తామని, 10 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో క్యాంపస్ పెడతామని కాగ్నిజెంట్ ప్రకటించిందని సీఎంవో తెలిపింది. ఇదే సంస్థ గత ఏడాదిన్నర కాలంలో 7 వేల మంది ఉద్యోగులను తొలగించిందని, ఆఫీస్ స్పేస్ లీజును రద్దు చేసుకున్నదని చెప్తున్నారు. ఇలాంటి సంస్థ వ్యాపార విస్తరణ ఎలా చేపడుతుందని ప్రశ్నిస్తున్నారు.

మరో దావోస్‌నా?

సీఎం రేవంత్ ఈ ఏడాది జనవరిలో దావోస్ పర్యటనకు వెళ్లిన సందర్భంగా రూ.40 వేల కోట్ల పెట్టుబడులు సాధించామని, తెలంగాణ చరిత్రలోనే అత్యధికమని చెప్పుకొచ్చారు. ఈ పెట్టుబడుల్లో అత్యధికం బోగసని విమర్శలు వచ్చాయి. మూలధనమే లేని గోడి ఇండియా కంపెనీ రూ.8 వేల కోట్ల పెట్టుబడి ఎలా పెడుతుందని బీఆర్‌ఎస్ విమర్శించింది. జేఎస్‌డబ్ల్యూ సంస్థ 2022లో చేసుకున్న రూ.9 వేల కోట్ల ఒప్పందాన్నే మళ్లీ చెప్పుకున్నారని ఆరోపించారు. అదానీ కంపెనీ ఇప్పటివరకు పెట్టుబడి పెట్టలేదని, పాతబస్తీలో కరెంటు బిల్లుల వసూలు అప్పగించారని విమర్శిస్తున్నారు. టాటా, జిందాల్, వెబ్ వర్క్స్, ఆరాజెన్, క్యూసెంట్రియో, ఓ9 సొల్యూషన్స్, గోద్రెజ్, సర్జికల్ ఇన్‌స్ట్రుమెంట్స్.. కంపెనీలు వస్తాయని, 35 వేల ఉద్యోగాలు వస్తాయని చెప్పుకున్నారని, ఆ కంపెనీల్లో ఏవి గ్రౌండింగ్ అయ్యాయో బహిర్గతం చేయాలని డిమాండ్ చేస్తున్నారు. నాటి దావోస్ తరహాలోనే ఈసారి అమెరికా పర్యటన కూడా ఉత్తుత్తిదనే! అన్న అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.

తెలంగాణను ప్రత్యేక దేశంగా గుర్తించండి

- మీ సహకారంతో ప్రపంచంతో పోటీ
- రాష్ట్రానికి పెట్టుబడులు తీసుకురండి
- ప్రజలకిచ్చిన మాట నిలబెట్టుకున్నాం
- నాలుగో నగరంగా ఫ్యూచర్ సిటీ
- న్యూజెర్సీ ప్రవాసుల సమ్మేళనంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలు



హైదరాబాద్, ఆగస్టు 5(నమస్తే తెలంగాణ): తెలంగాణను దేశంలోని ఒక రాష్ట్రంగా భావించవద్దని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. తెలంగాణ స్వతంత్ర దేశమైతే ప్రపంచంతో ఎలా పోటీపడుతుందో, అలాగే మీ అందరి సహకారంతో ప్రపంచంతో పోటీ పడాలని అనుకుంటున్నట్టు తెలిపారు. అమెరికా పర్యటనలో ఉన్న రేవంత్‌రెడ్డి ఆదివారం న్యూజెర్సీలో ఏర్పాటు చేసిన ప్రవాసుల ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడారు. రాష్ట్రానికి అత్యధిక పెట్టుబడులు తీసుకురావడంలో భాగస్వాములు కావాలని తెలుగు రాష్ట్రాల ప్రవాసులకు పిలుపునిచ్చారు. పొరుగు రాష్ట్రాలతో పోటీపడాలనుకోవడం లేదని, ప్రపంచంతో పోటీపడాలని అనుకుంటున్నట్టు చెప్పారు.

ప్రతిమాటను నిలబెట్టుకుంటాం

జన్మభూమి తెలంగాణలో పెట్టిన ప్రతి పెట్టుబడికి తప్పకుండా ప్రయోజనం ఉంటుందని సీఎం పేర్కొన్నారు. ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని ప్రభుత్వం నిలబెట్టుకుంటుందని తెలిపారు. భవిష్యత్తు అవసరాలను దృష్టిలో పెట్టుకుని సమ్మిళిత ఆర్థికాభివృద్ధి సాధించేలా కొత్త పారిశ్రామిక విధానాన్ని తీసుకొస్తుందని తెలిపారు. హైదరాబాద్‌ను ప్రపంచంలోనే అగ్రగామి నగరంగా అభివృద్ధి చేసేందుకు పోటీపడతామని పేర్కొన్నారు. ప్రతిభాపాటవాలతో అమెరికాను సంపన్నంగా మార్చారని ప్రవాసులను అభినందించిన రేవంత్‌రెడ్డి.. ఇకపై తెలంగాణలోనూ సేవలు అందించాలని స్వాగతించారు. ఈస్ట్‌కోస్ట్ ఇండియన్ కమ్యూనిటీకి చెందిన ముఖ్యులతో మాట్లాడిన రేవంత్‌రెడ్డి.. హైదరాబాద్, సికింద్రాబాద్, సైబరాబాద్ తరహాలో నాలుగో నగరంగా ఫ్యూచర్ సిటీని అభివృద్ధి చేస్తున్నట్టు చెప్పారు. హైదరాబాద్‌ను అభివృద్ధి చేసేందుకు అందరూ కలిసి రావాలని ప్రవాసులకు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా హైదరాబాద్ అభివృద్ధికి చేపడుతున్న కార్యక్రమాలను, భవిష్యత్తు ప్రణాళికలను ఎన్నారైలు ప్రశంసించారు. తెలంగాణలో పెట్టుబడులు పెట్టాలనే ప్రచారంలో ప్రభుత్వంతో కలిసి పాల్గొంటామని హామీ ఇచ్చారు.

అమెరికాకు మంత్రి కోమటిరెడ్డి

రాష్ట్ర ఆర్‌అండ్‌బీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి సోమవారం సాయంత్రం అమెరికా బయలుదేరి వెళ్లారు. 7న అమెరికాలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో కలిసి ప్రవాస భారతీయ నాయకులతో జరిగే మీట్ అండ్ గ్రీట్ కార్యక్రమంలో పాల్గొంటారు. ఎస్‌ఎల్‌బీసీ టన్నెల్ తవ్వకాన్ని వేగవంతం చేసేందుకు అవసరమైన అధునాతన బేరింగ్ మెషినరీని సమకూర్చేందుకుగాను 12న ఓహియోలోని రాబిన్స్ టన్నెల్ బేరింగ్ మెషినరీ తయారీ కంపెనీ సీఈవో లాక్‌హోమ్‌తో మంత్రి సమావేశమవుతారు.

ప్రొఫెసర్ జయశంకర్ స్ఫూర్తిని కొనసాగిస్తాం

సీఎం రేవంత్ రెడ్డి

హైదరాబాద్, ఆగస్టు 4 (నమస్తే తెలంగాణ): ప్రత్యేక రాష్ట్ర సాధనే ధ్యేయంగా జీవితాంతం గడిపిన ప్రొఫెసర్ జయశంకర్ ఉద్యమ స్ఫూర్తిని కొనసాగిస్తామని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. ప్రొఫెసర్ జయశంకర్ జయంతి సందర్భంగా ఆయన సేవలను సీఎం గుర్తుచేసుకున్నారు. హైదరాబాద్ రాష్ట్రాన్ని ఆంధ్ర రాష్ట్రంలో విలీనం చేయడాన్ని జయశంకర్ వ్యతిరేకించారని గుర్తు చేశారు. ఏపీలో విలీనంతో జరిగిన అన్యాయాన్ని ఎప్పటికప్పుడు వివరిస్తూ ప్రత్యేక రాష్ట్ర ఉద్యమాన్ని ఆరు దశాబ్దాలు సజీవంగా ఉంచిన ఘనత ఆయనదేనని కొనియాడారు. ఆయన ఆశయ సాధనకు తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని సీఎం స్పష్టం చేశారు.

స్థానిక సంస్థల్లో స్పెషల్ ఆఫీసర్లు

ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం


హైదరాబాద్, ఆగస్టు 5 (నమస్తే తెలంగాణ): పదవీకాలం ముగిసిన మండల, జిల్లా పరిషత్‌లకు స్పెషల్ ఆఫీసర్లను నియమిస్తూ ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. ములుగు, ఖమ్మం, కొత్తగూడెం, మహబూబాబాద్ జిల్లా పరిషత్‌లకు జిల్లా కలెక్టర్లను, కొత్తగూడెం, ఖమ్మం జిల్లాలోని అన్ని మండలాలు, ములుగు జిల్లా వాజేడు, వెంకటాపురం, మహబూబాబాద్ జిల్లా గార్ల, బయ్యారం మండల పరిషత్‌లకు ప్రత్యేక అధికారులను నియమించింది. కొత్త పాలకవర్గాలు ఎన్నికయ్యే వరకు వీరు కొనసాగుతారని పేర్కొంది.

మరో 3 రోజులు వర్షాలు

హైదరాబాద్, ఆగస్టు 5 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో రానున్న మూడు రోజులు మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. రాష్ట్రవ్యాప్తంగా నేడు, రేపు ఈదురు గాలుల ప్రభావం ఉంటుందని తెలిపింది. రాష్ట్రవ్యాప్తంగా గత 24 గంటల్లో నిర్మల్ జిల్లా బాసరలో అత్యధికంగా 4.08 సెం.మీ వర్షపాతం నమోదైందని వెల్లడించారు.

స్కిల్ యూనివర్సిటీ చైర్మన్‌గా ఆనంద్ మహీంద్రా

వెల్లడించిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి



హైదరాబాద్, ఆగస్టు 5(నమస్తే తెలంగాణ): స్కిల్ యూనివర్సిటీ చైర్మన్‌గా మహీంద్రా గ్రూప్ అధినేత ఆనంద్ మహీంద్రా వ్యవహరిస్తారని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వెల్లడించారు. అమెరికా పర్యటనలో ఉన్న సీఎం ఆదివారం న్యూజెర్సీలో జరిగిన ఓ కార్యక్రమంలో ఈ విషయాన్ని వెల్లడించారు. స్కిల్ యూనివర్సిటీకి చైర్మన్‌గా వ్యవహరించేందుకు ఆనంద్ మహీంద్రా అంగీకరించారని, త్వరలోనే బాధ్యతలు స్వీకరిస్తారని తెలిపారు. రంగారెడ్డి జిల్లా ముచ్చర్ల కేంద్రంగా అభివృద్ధి కానున్న ఫ్యూచర్ సిటీ పరిధిలో బేగరికంచె వద్ద తెలంగాణ స్కిల్ యూనివర్సిటీ భవనానికి సీఎం గతవారం శంకుస్థాపన చేశారు. యూనివర్సిటీలో 17 రకాల కోర్సుల్లో ఏటా 20వేల మందికి శిక్షణ ఇచ్చి, సర్టిఫికెట్ ఇవ్వడంతోపాటు ఆయా కంపెనీల్లో ఉద్యోగ ఉపాధి అవకాశాలు కూడా కల్పించే ఏర్పాటు చేస్తున్నారు. ఈ ఏడాది నుంచే ఆరు కోర్సులు ప్రారంభించనున్నట్టు సీఎం తెలిపారు. రాబోయే సంవత్సరాల్లో ఏడాదికి లక్ష మందికి శిక్షణ ఇచ్చేలా స్కిల్ వర్సిటీని విస్తరిస్తామని పేర్కొన్నారు. బేగరికంచెలో సొంత భవనం పూర్తయ్యే వరకు గచ్చిబౌలిలోని ఇంజినీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా భవనంలో స్కిల్ యూనివర్సిటీ కార్యకలాపాలు కొనసాగుతాయి.

హైదరాబాద్‌లో కాగ్నిజెంట్ విస్తరణ

- దాదాపు 15 వేల మంది యువతకు ఉద్యోగాలు
- అమెరికాలో సీఎంతో కంపెనీ ప్రతినిధుల చర్చలు

హైదరాబాద్, ఆగస్టు 5(నమస్తే తెలంగాణ): ప్రపంచస్థాయిలో ఐటీ రంగంలో పేరొందిన కాగ్నిజెంట్ కంపెనీ తెలంగాణలో భారీ విస్తరణ ప్రణాళికతో ముందుకు వచ్చింది. హైదరాబాద్ లో దాదాపు 15 వేల మందికి ఉద్యోగాలు కల్పించేలా కొత్త సెంటర్ నెలకొల్పనున్నట్టు ప్రకటించింది. ఇరవై వేలమంది ఉద్యోగులుండేలా పది లక్షల చదరపు అడుగుల స్థలంలో ఈ సెంటర్‌ను స్థాపించనుంది. అమెరికా పర్యటనలో ఉన్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఐటీశాఖ మంత్రి శ్రీధర్‌బాబు సోమవారం కాగ్నిజెంట్ సీఈవో రవికుమార్‌తోపాటు కంపెనీ ప్రతినిధి బృందంతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా జరిగిన చర్చల్లో ఈ ఒప్పందం కుదిరింది. టెక్నాలజీ, ఇన్నోవేషన్ హబ్‌గా సత్తా చాటుకుంటున్న హైదరాబాద్‌లో తమ కంపెనీని విస్తరించడం సంతోషంగా ఉందని కాగ్నిజెంట్ సీఈవో ఎస్ రవికుమార్ తెలిపారు. ఐటీ రంగానికి మరింత అనుకూలమైన వాతావరణం కల్పించేందుకు తమ ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉన్నదని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. కాగ్నిజెంట్ కంపెనీ కొత్త సెంటర్ ఏర్పాటుతో ప్రపంచ టెక్నాలజీ కంపెనీలన్నీ హైదరాబాద్‌ను తమ ప్రధాన గమ్యస్థానంగా ఎంచుకుంటాయని అభిప్రాయపడ్డారు.

నీట్ అడ్మిషన్లలో స్థానికులకు న్యాయం చేయాలి

హైదరాబాద్, ఆగస్టు 5 (నమస్తే తెలంగాణ): ఎంబీబీఎస్ అడ్మిషన్‌లో జీవో నంబర్ 33కు గత నెల 19న చేసిన అటాచ్ సవరణతో స్థానికత కోల్పోతున్న తెలంగాణ విద్యార్థులకు తగు న్యాయం చేయాలని విద్యార్థుల తల్లిదండ్రులు విజ్ఞప్తిచేశారు. ఈ మేరకు వారు సోమవారం రాష్ట్ర వైద్యారోగ్యశాఖ మంత్రికి లేఖ రాశారు. కొన్నేండ్లుగా అమలవుతున్న నిబంధనల ప్రకారం 6 నుంచి 12వ తరగతి చదివిన ఏడేండ్ల కాలంలో గరిష్ఠంగా 4 సంవత్సరాలు ఎక్కడ చదివితే అక్కడ స్థానికులుగా పరిగణించేవారని, కానీ జీవో నంబర్ 33కు అటాచ్ చేసిన అమెండ్‌మెంట్‌తో 9 నుంచి 12వ తరగతులు వరుసగా తెలంగాణ రాష్ట్రంలో చదివితేనే స్థానికులుగా పరిగణించబడుతుందని, 9వ తరగతి కంటే ముందు ఎక్కడ చదివారనే దానిని పరిగణలోకి తీసుకోవడం లేదని తెలిపారు. వైద్యారోగ్య, కుటుంబ సంక్షేమశాఖ జారీ చేసిన ఈ జీవో ప్రకారం ఒకటో తరగతి నుంచి పదో తరగతి వరకు తెలంగాణలో చదివి, ఇంటర్మీడియట్ ఏపీలో చదివిన తెలంగాణ విద్యార్థులు స్థానికతను కోల్పోతున్నారని పేర్కొన్నారు.

తిప్పి తిప్పి చేతులెత్తేసిన భట్టివిక్రమార్క

- రైతులను తిప్పించుకుని వదిలేసిన మంత్రి
- సమస్యలు వింటాం రమ్మని సమాచారం
- వచ్చాక ముఖం చాటేసిన డిప్యూటీ సీఎం



నాదర్‌గుల్ బస్టాండ్‌లో భట్టిని అడ్డగించిన రైతులు

బడంగ్‌పేట, ఆగస్టు 5: కలుద్దాం రమ్మని రైతులకు సమాచారం ఇచ్చి ఆపై కలవకుండా వెళ్లిపోయిన ఉప ముఖ్యమంత్రి భట్టివిక్రమార్కపై రైతులు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. సమస్యలు చెప్పుకునేందుకు వస్తే సమయం ఇవ్వకుండా అవమానించారని మండిపడుతున్నారు. సమయం ఇవ్వలేనప్పుడు పిలవడం ఎందుకని ప్రశ్నిస్తున్నారు. బడంగ్‌పేట మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని కుర్మల్‌గూడ నల్లపోచ్చమ్మ దేవాలయంలో ఆదివారం జరిగిన బోనాల ఉత్సవాలకు మంత్రి హాజరయ్యారు. ఈ కార్యక్రమానికి జనాన్ని పోగుచేసేందుకు భూములు కోల్పోయిన రైతులకు మంత్రి న్యాయం చేస్తారని రైతులకు చెప్పి ఓ నాయకుడు రైతులను తరలించారు. అయితే, వారిని కలవకుండానే మంత్రి వెళ్లిపోయారు. దీంతో సోమవారం ఉదయం 10 గంటలకు నాదర్‌గుల్‌లోని కాసుబాగు, హర్డ్‌వేర్ పార్క్ రైతులతో కలిసి డిప్యూటీ సీఎం భూమిని పరిశీలిస్తారని నమ్మించారు. ఇది నమ్మిన రైతులు సోమవారం ఉదయం భూమి దగ్గర పడిగాపులు కాశారు. పొలాలకు సంబంధించిన కాగితాలు పట్టుకొని ఎదురుచూశారు. పది గంటల సమయంలో రైతులకు మరో నేత ఫోన్ చేసి మంత్రి పొలాల దగ్గరకు రావడం లేదని సమాచారం ఇచ్చారు.

మరో చోటకు వెళ్లినా అదే తీరు

నాదర్‌గుల్ బస్టాండ్‌లో భట్టి విక్రమార్క కలుస్తారని చెప్పడంతో రైతులు తిరిగి పది గంటలకు అక్కడికి చేరుకున్నారు. డిప్యూటీ సీఎం ఆదిబట్లకు రాగానే పోలీసులు అప్రమత్తం అయ్యారు. రైతులను అక్కడి నుంచి పంపించే ప్రయత్నం చేశారు. తమకు సమయం ఇచ్చిన తర్వాత ఎందుకు పొమ్మంటున్నారని రైతులు పోలీసులతో వాగ్వాదానికి దిగారు. దీంతో పోలీసులకు రైతుల మధ్య తోపులాట జరిగింది. ఈ క్రమంలో భట్టి నాదర్‌గుల్ చౌరస్తాకు చేరుకున్నారు. అక్కడ కొందరు రైతులు భట్టి కారుకు అడ్డుగా వచ్చారు. వారితో మాట్లాడిన డిప్యూటీ సీఎం గుడి దగ్గరకు వస్తే మాట్లాడుకుందామని చెప్పారు. అక్కడ కూడా రైతులకు నిరాశే ఎదురైంది. ఆ తర్వాత ఎవరైనా ఒకరు వచ్చి వినతిపత్రాలు ఇవ్వాలని మంత్రి నుంచి పిలుపొచ్చింది. ఆ వెంటనే మనసు మార్చుకుని తర్వాత తీసుకుంటామని చెప్పి అక్కడి నుంచి భట్టి వెళ్లిపోవడంతో రైతులు తీవ్ర అగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

మెడికల్ సీట్లలో లోకల్ గోల్‌మాల్!

మొదటిపేజీ తరువాయి...

నుంచి ఇంటర్మీడియట్ వరకు ఎక్కడ చదివితే అక్కడ స్థానికులుగా పరిగణిస్తామని నోటిఫికేషన్‌లో పేర్కొన్నారు. 2023-24 విద్యా సంవత్సరం వరకు 6వ తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు ఏడేండ్ల కాలంలో గరిష్ఠంగా నాలుగేండ్లు ఎక్కడ చదివితే అక్కడ స్థానికులుగా పరిగణలోకి తీసుకునేవారు. స్థానికతపై ప్రస్తుత విద్యా సంవత్సరం నుంచి చేసిన మార్పులతో తెలంగాణ వారికే ఎక్కువ అన్యాయం జరుగుతుందన్న ఆందోళన వ్యక్తమవుతున్నది.

ప్రైవేటు కాలేజీలకు లబ్ధి

ఎంబీబీఎస్, బీడీఎస్ కోర్సుల్లో తాజాగా పెట్టిన స్థానికత నిబంధనతో హైదరాబాద్‌లో చదివిన ఏపీ విద్యార్థులు తెలంగాణలో స్థానికులుగా ఉంటారు. ఉమ్మడి ఖమ్మం, నల్లగొండ జిల్లాల్లోని చాలా ప్రాంతాలకు చెందినవారు విజయవాడ, గుంటూరులలో ఇంటర్మీడియట్ చదువుతారు. రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా పెట్టిన స్థానిక నిబంధనలతో ఇలా ఇంటర్మీడియట్ కోసం ఇతర రాష్ట్రాలకు వెళ్లిన వారికి స్థానికత కోటా ఉండడంలేదు. తెలంగాణలో పుట్టి పెరిగి రెండేండ్ల ఇంటర్మీడియట్ కోసం ఆంధ్రప్రదేశ్‌కు వెళ్లిన వారు సొంత రాష్ట్రంలో స్థానికులు కాకుండా పోతున్నారు. ఎంబీబీఎస్, బీడీఎస్ కోర్సుల్లో ప్రైవేటు కాలేజీలకు మేలు చేసేందుకే స్థానికతపై రాష్ట్ర ప్రభుత్వం కొత్త నిబంధనలను పెట్టిందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. స్థానికత నిర్ధారణ కోసం వైద్య, ఆరోగ్యశాఖ జారీ చేసినట్టు చెబుతున్న ఈ 33 జీవో ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వ వెబ్‌సైట్‌లోనూ అందుబాటులో లేదని, పారదర్శకత లేకపోవడంతో ఈ జీవో అమలుపై అనేక అనుమానాలు ఉన్నాయని విద్యార్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కేసీఆర్ ప్రభుత్వ చర్యలతో రాష్ట్రంలో ప్రభుత్వ మెడికల్ కాలేజీలు ఎక్కువగా ఏర్పాటయ్యాయి. ఎంబీబీఎస్ సీట్లు బాగా పెరిగాయి. దీంతో ప్రైవేటు మెడికల్ కాలేజీల సీట్ల దందాకు అడ్డంకులు ఏర్పడ్డాయి. ప్రైవేటు కాలేజీలు గతంలో ఒక్కో సీటు కోసం కోట్ల రూపాయలు వసూలు చేసేవి. ప్రభుత్వ మెడికల్ కాలేజీలు పెరిగిన తర్వాత ఈ ధరలు తగ్గాయి. స్థానికత కోటాలో ఎక్కువ మందికి అవకాశం ఇస్తే ప్రైవేటు కాలేజీల్లో బీ క్యాటగిరీ సీట్లకు పోటీ పెరుగుతుందని, ఇది ప్రైవేట్ కాలేజీలకు మేలు చేస్తుందని విద్యార్థులు చెప్తున్నారు.

2023-24లో ఎంబీబీఎస్ సీట్లు దక్కిన చివరి ర్యాంకులు

కేటగిరీ	చివరి ర్యాంకు
ఓపెన్	1,60,979
ఈడబ్ల్యూఎస్	1,42,345
బీసీ(ఈ)	1,84,367
బీసీ(డీ)	1,75,555
బీసీ(సీ)	2,66,945
బీసీ(బీ)	1,82,579
బీసీ(ఏ)	2,58,239
ఎస్సీ	2,45,043
ఎస్టీ	2,30,180
మైనార్టీ కాలేజీలు	1,84,179

ఏపీ విద్యార్థుల కోసమేనా?

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టం ప్రకారం హైదరాబాద్ ఉమ్మడి రాజధాని గడువు ఈ ఏడాది జూన్‌తో ముగిసింది. విద్యాసంస్థల్లో ఆంధ్రప్రదేశ్ విద్యార్థులకు కోటాలోనూ ఇదే అమలు కానుంది. ఆంధ్రప్రదేశ్‌లో ప్రతిష్ఠాత్మక కాలేజీలు లేనందున అక్కడి విద్యార్థులకు మెడికల్ ఎడ్యుకేషన్‌లో అవకాశాలు కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం జీవో 33ను తీసుకువచ్చినట్లు స్పష్టమవుతున్నది.

ఆంధ్రా లాబీతోనేనా?

ప్రభుత్వం కొత్తగా విడుదల చేసిందని చెప్తున్న నూతన మార్గదర్శకాల వెనక ఆంధ్రా లాబీ ఉన్నదనే ప్రచారం జోరుగా సాగుతున్నది. ఈ విషయంలో ఆంధ్రా విద్యాసంస్థల యాజమాన్యాలు కొన్ని తీవ్రస్థాయిలో లాబీ చేసినట్టు తెలంగాణ మేధావుల్లో విస్తృతస్థాయి చర్చ కొనసాగుతున్నది. ఇప్పటివరకు అమలైన స్థానికత నిబంధనలను యథావిధిగా కొనసాగిస్తే తెలంగాణ రాష్ట్ర విద్యార్థులకు ఎలాంటి నష్టం వాటిల్లే ప్రస్తక్తే లేదు. కానీ ప్రభుత్వం ఆ నిబంధనలను ఇప్పటికిప్పుడు ఎందుకు మార్చింది? అందులో అంతర్యమేంటని? తెలంగాణ విద్యావేత్తల్లో చర్చ జరుగుతున్నది.

47,356 మంది అర్హత

ప్రస్తుత విద్యా సంవత్సరంలో రాష్ట్రంలో 30 ప్రభుత్వం, 30 ప్రైవేటు మెడికల్ కాలేజీలు అందుబాటులో ఉన్నాయి. వీటిలో 8,315 ఎంబీబీఎస్ సీట్లు ఉన్నాయి. ప్రభుత్వ కాలేజీల్లో నేషనల్ పూల్ కింద 617 సీట్లు భర్తీ చేస్తారు. మిగిలిన సీట్లను రాష్ట్రంలో కాళోజీ ఆరోగ్య విశ్వవిద్యాలయం భర్తీ చేస్తుంది. రాష్ట్రంలో ఈసారి 77,848 మంది నీట్ యూజీ పరీక్షకు హాజరయ్యారు. వీరిలో 47,356 మంది అర్హత సాధించారు. రాష్ట్రంలో ఎంబీబీఎస్, బీడీఎస్ సీట్లలో నేషనల్ కోటా మినహా మిగిలిన కన్వీనర్ కోటా సీట్లన్నీ రాష్ట్ర విద్యార్థులకే దక్కనున్నాయి. రాష్ట్ర పునర్విభజన చట్టం మేరకు పదేళ్ల వరకు అమలైన 15 శాతం అన్‌రిజర్వ్‌డ్ కోటా సీట్లు ఈ ఏడాది నుంచి రద్దయ్యాయి. రాష్ట్రంలో 2014కు ముందు ఏర్పాటైన అన్ని వైద్య కళాశాలల్లో 15 శాతం(అన్‌రిజర్వ్‌డ్) కోటా సీట్లకు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ విద్యార్థులు పోటీ పడేవారు. రాష్ట్ర విభజన జరిగి పదేళ్లు పూర్తి కావడంతో కన్వీనర్ కోటా సీట్లన్నీ రాష్ట్ర విద్యార్థులతోనే భర్తీ కానున్నాయి. రాష్ట్రంలో ఎంబీబీఎస్, బీడీఎస్ సీట్లలో బీసీలకు 29 శాతం, ఎస్సీలకు 15 శాతం, ఎస్టీలకు 10 శాతం సీట్లు దక్కనున్నాయి.


వీ హబ్‌లో పెట్టుబడులు

- రూ.42 కోట్ల పెట్టుబడులకు వాల్స్ కర్రా హోల్డింగ్స్ ఒప్పందం
- వచ్చే ఐదేండ్లలో స్టార్టప్‌లలో మరో రూ.839 కోట్ల పెట్టుబడి

హైదరాబాద్, ఆగస్టు 5 (నమస్తే తెలంగాణ): అమెరికాకు చెందిన వాల్ష్ కర్రా హోల్డింగ్స్ తెలంగాణలో పెట్టుబడులకు సుముఖత వ్యక్తం చేసింది. వచ్చే ఐదేండ్లలో వీ హబ్‌లో రూ.42 కోట్ల పెట్టుబడులు పెట్టేందుకు ప్రభుత్వంతో ఒప్పందం చేసుకుంది. వీ హబ్‌తోపాటు తెలంగాణలో నెలకొల్పే స్టారప్‌లలో దాదాపు రూ.839 కోట్ల పెట్టుబడి పెట్టేందుకు సిద్ధంగా ఉన్నట్టు ప్రకటించింది. వాల్ష్ కర్రా కంపెనీకి చెందిన ఫణి కర్రా, గ్రెగ్ వాల్ష్.. వీ హబ్ సీఈవో సీతా పల్లచోళ్ల ఈ ఒప్పందంపై సంతకాలు చేశారు. వీ హబ్‌తో ఒప్పందం సందర్భంగా గ్రెగ్‌వాల్ష్ మాట్లాడుతూ పెట్టుబడులతోపాటు ప్రభుత్వంతో కలిసి వివిధ కార్యకలాపాల్లో భాగస్వామ్యం పంచుకుంటామని తెలిపారు. ఓయూ నుంచి కెరీర్ ప్రారంభించి అంతర్జాతీయ స్థాయికి చేరగలిగానని, మన దేశం, రాష్ట్రం పట్ల కృతజ్ఞతను చాటుకునే అవకాశం దొరికిందని ఫణి తెలిపారు.

జుక్కల్ ఎమ్మెల్యేకు నిరసన సెగ

- హామీలు ఎప్పుడు నెరవేరుస్తారని నిలదీత
- కారుకు అడ్డంగా నిలబడి ప్రశ్నించిన యువకులు
- సహనం కోల్పోయిన లక్ష్మీకాంతారావు
- తమాషాలు చేస్తున్నారా అంటూ అసహనం



యువకులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు

బాన్సువాడ (జుక్కల్), ఆగస్టు 5: జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావుకు తీవ్ర పరాభవం ఎదురైంది. ఎన్నికల్లో ఇచ్చిన హామీలు ఏమయ్యాయని యువకులు నిలదీయటంతో బిత్తరపోవడం ఆయన వంతైంది. వారికి సమాధానం చెప్పలేని ఎమ్మెల్యే సహనం కోల్పోయి తమాషాలు చేస్తున్నారా? అని యువకులపై చెలరేగిపోయారు. దీంతో తీవ్ర ఉద్రిక్తతకు దారి తీసింది. అసలేం జరిగిందంటే.. కామారెడ్డి జిల్లా జుక్కల్‌లో స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమాన్ని ప్రారంభించేందుకు స్థానిక ఎమ్మెల్యే లక్ష్మీకాంతారావు, కలెక్టర్ సోమవారం వచ్చారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చాలని స్థానిక యువకులు లక్ష్మీకాంతారావు కారుకు అడ్డంగా నిలుచున్నారు. నియోజకవర్గంలో రోడ్ల దుస్థితి దారుణంగా ఉన్నదని, కనీసం నడవలేని పరిస్థితి ఉన్నదని ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. అధికారంలోకి వచ్చి 9 నెలలవుతున్నా చిన్న సమస్య కూడా పరిష్కరించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. పలు సమస్యలను దృష్టికి తీసుకొచ్చే ప్రయత్నం చేస్తుండగా ఎమ్మెల్యే సహనం కోల్పోయి.. తమాషాలు చేస్తున్నారా? అంటూ బెదిరించారు. రోడ్లు బాగా లేవని అడిగితే, తమాషాలా! అంటూ ఎవరిని అంటున్నారని యువకులు నిలదీశారు. ఏమైనా సమస్యలు ఉంటే క్యాంప్ కార్యాలయానికి వచ్చి మాట్లాడాలని ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తం చేయగా.. యువకులు మరింత గట్టిగా నిలదీయటంతో ఆయన అక్కడి నుంచి వెనుదిరిగి వెళ్లిపోయారు.

బంగ్లాలో సైనిక తిరుగుబాటు!

ప్రధాని పదవికి షేక్ హసీనా రాజీనామా

- బంగ్లాదేశ్‌లో తీవ్ర రాజకీయ సంక్షోభం
- సోదరితో కలిసి భారత్‌కు పరారైన హసీనా
- ఆర్మీ అల్టిమేటంతోనే పదవికి గుడ్ బై!
- తాత్కాలిక ప్రభుత్వం ఏర్పాటు కానున్నట్టు ఆర్మీ చీఫ్ వాకర్ ఉజ్ జమాన్ ప్రకటన
- ప్రధాని నివాసాన్ని లూటీ చేసిన ఆందోళనకారులు



ప్రధాని ప్యాలెస్‌ను చుట్టుముట్టి జాతీయ జెండాను ఎగరవేస్తున్న ఆందోళనకారులు

ఢాకా, ఆగస్టు 5: బంగ్లాదేశ్‌లో తీవ్ర రాజకీయ సంక్షోభం తలెత్తింది. దేశంలో కొన్ని రోజులుగా కొనసాగుతున్న అల్లర్లు పతాక స్థాయికి చేరడంతో ప్రధాని పదవికి షేక్ హసీనా రాజీనామా చేశారు. ఉద్యోగాల్లో రిజర్వేషన్లు కల్పించేందుకు ఆమె చేసిన ప్రయత్నానికి వ్యతిరేకంగా మొదలైన ఉద్యమం చివరకు ఆమెనే గద్దె దింపింది. ప్రపంచంలోనే ఎక్కువ కాలం ప్రభుత్వాధినేతగా పనిచేసిన మహిళగా ఘనత వహించిన హసీనా ప్రజా ఉద్యమానికి జడిసి పదవిని వదులుకున్నారు. ఎన్నికల్లో తిరుగులేని ప్రజాతీర్పుతో అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లోనే అవమానకర రీతిలో దేశాన్ని వీడి పరారయ్యారు. దీంతో బంగ్లాదేశ్ సైనిక పాలన దిశగా అడుగులు వేస్తోంది. దేశాన్ని సైన్యం ఆధీనంలోకి తీసుకుంటున్నది. తాత్కాలిక ప్రభుత్వం ఏర్పాటు కానున్నట్లు ఆర్మీ చీఫ్ ప్రకటించారు. మరోవైపు హసీనా స్వదేశం నుంచి పరారై భారత్‌కు చేరారు.

ఎసరు తెచ్చిన 30 శాతం రిజర్వేషన్లు

1971లో బంగ్లాదేశ్ విముక్తి కోసం పోరాడిన వారి కుటుంబసభ్యులకు ప్రభుత్వ ఉద్యోగాల్లో 30 శాతం రిజర్వేషన్లు ఇవ్వాలని హసీనా ప్రభుత్వం 2018లో నిర్ణయించింది. అప్పుడు తీవ్ర వ్యతిరేకత రావడంతో ఈ ప్రతిపాదనను పక్కనపెట్టింది. అయితే, రిజర్వేషన్లు కల్పించాలని ఈ ఏడాది జూన్‌లో హైకోర్టు తీర్పు ఇవ్వడంతో రిజర్వేషన్లకు వ్యతిరేకంగా విద్యార్థులు 'స్టూడెంట్స్ అగెనెస్ట్ డిస్క్రిమినేషన్' అనే పేరుతో జూలైలో ఉద్యమాన్ని ప్రారంభించారు. విశ్వవిద్యాలయాల్లో ప్రారంభమైన ఈ ఉద్యమంలో క్రమంగా రోడ్లపైకి చేరి హింసాత్మకంగా మారింది. పోలీసుల కాల్పుల్లో పదుల సంఖ్యలో విద్యార్థులు, నిరసనకారులు మరణించారు. దీంతో జూలై 21న 30 శాతం రిజర్వేషన్లను ఐదు శాతానికి కుదించాలని సుప్రీం కోర్టు ఆదేశించింది. అయినప్పటికీ నిరసనకారులు శాంతించలేదు.

ఆర్మీ అల్టిమేటంతోనే రాజీనామా?!

హసీనా రాజీనామాకు పట్టుబడుతూ మూడు రోజులుగా ఆందోళనకారులు దేశంలో రోడ్లపై నిరసన ప్రదర్శనలు నిర్వహిస్తున్నారు. ఈ ఉద్యమంపై హసీనా ప్రభుత్వం కఠినంగా వ్యవహరించింది. దేశవ్యాప్తంగా కర్ఫ్యూ విధించింది. మూడు రోజుల్లో దాదాపు 100 మంది ఆందోళనకారులు పోలీస్ కాల్పుల్లో మరణించారు. ఇది వారిలో మరింత ఆగ్రహానికి కారణమైంది. దీంతో సోమవారం ఆందోళనకారులు ఢాకాకు లాంగ్ మార్చ్‌కు పిలుపునిచ్చారు. ఢాకా ప్రధాన వీధుల్లో వందలాది మంది గుమిగూడారు. దీంతో మరోసారి పోలీసులు కాల్పులు జరపగా ఆరుగురు నిరసనకారులు మరణించారు. ఇంతలో అనూహ్యంగా సోమవారం ఉదయం షేక్ హసీనా ప్రధానమంత్రి పదవికి రాజీనామా చేశారు. ఆమె ఉన్నఫళంగా ఢాకాను వీడి సైనిక విమానంలో భారత్‌కు పయనమయ్యారు. అయితే 45 నిమిషాల్లో పదవికి రాజీనామా చేసి, దేశాన్ని విడిచి వెళ్లిపోవాలని ఆర్మీ ఇచ్చిన అల్టిమేటంతోనే ఆమె పదవిని వదులుకున్నారని తెలుస్తోంది.

ముజిబుర్ విగ్రహాన్ని బద్ధలు కొట్టి సంబరాలు



ప్యాలెస్ లోపల సేద తీరుతున్న యువకులు

హసీనా రాజీనామా విషయం తెలుసుకొని నిరసనకారులు సంబరాలు చేసుకున్నారు. ప్రధాని నివాసం గణ భవన్‌లోకి ప్రవేశించి ఫర్నీచర్‌ను, ఇతర సామాగ్రిని లూటీ చేశారు. హసీనా దుస్తులనూ ఎత్తుకెళ్లారు. హసీనా తండ్రి, బంగబంధుగా పేరొందిన ముజిబుర్ రెహ్మాన్ విగ్రహాన్ని సైతం నిరసనకారులు బద్దలు కొట్టారు. హసీనా పార్టీ కార్యాలయాన్ని తగలబెట్టారు. హోంమంత్రి అసదుజ్జమన్ ఖాన్ ఇంటిని ధ్వంసం చేశారు. బంగ్లాదేశ్ పార్లమెంటులోకి ప్రవేశించి బీభత్సం సృష్టించారు. దేశవ్యాప్తంగా నాలుగు హిందూ ఆలయాలపైనా దాడి జరిగింది. అయితే ఈ పరిస్థితిని ఉపయోగించుకొని ఎవరూ దేశాన్ని దోచుకునేందుకు అవకాశం ఇవ్వొద్దని విద్యార్థి ఉద్యమ నేతల్లో ఒకరైన నహీద్ ఇస్లాం.. బంగ్లా ప్రజలను కోరారు.



ఢాకాలో బంగ్లాదేశ్ మెమోరియల్ మ్యూజియంకు నిప్పు పెట్టిన ఆందోళనకారులు

తాత్కాలిక ప్రభుత్వం ఏర్పాటు: ఆర్మీ చీఫ్

హసీనా రాజీనామా, దేశాన్ని వీడిన విషయాన్ని బంగ్లాదేశ్ ఆర్మీ చీఫ్ వాకర్ ఉజ్ జమాన్ ప్రకటించారు. దేశానికి సంబంధించి తాను అన్ని బాధ్యతలు తీసుకుంటున్నానని, అందరూ సహకరించాలని ఆయన కోరారు. దేశం ఇప్పటికే చాలా ఇబ్బంది పడుతున్నదని, ఆర్థిక వ్యవస్థ దెబ్బతిన్నదని, చాలామంది మరణించారని చెప్పారు. దేశంలో ఎమర్జెన్సీ విధించాల్సిన అవసరం లేదని, తాత్కాలిక ప్రభుత్వం ఏర్పాటు కానున్నట్టు ప్రకటించారు.

హసీనా పయనం బ్రిటన్‌కా?

ఉన్నఫళంగా సైనిక విమానంలో తన సోదరి షేక్ రెహానాతో కలిసి ఢాకా నుంచి బయలుదేరిన షేక్ హసీనా ఢిల్లీ సమీపంలోని హిండన్ ఎయిర్‌బేస్‌లో ల్యాండ్ అయ్యారు. అయితే, ఆమె భారత్ నుంచి లండన్‌కు వెళ్లనున్నారనే వార్తలు వస్తున్నాయి. అయితే, భారత్‌లో ఆశ్రయం పొందడం హసీనాకు కొత్త కాదు. 1975లో హసీనా తండ్రి హత్య జరిగినప్పుడు ఆమె భారత్‌లోనే ఆశ్రయం పొందారు.


భారత్ అప్రమత్తం.. భద్రత కట్టుదిట్టం

షేక్ హసీనా రాజీనామా, బంగ్లాదేశ్ పరిణామాల నేపథ్యంలో భారత్ కూడా అప్రమత్తమైంది. భద్రత వ్యవహారాలకు సంబంధించిన క్యాబినెట్ కమిటీతో సోమవారం సాయంత్రం ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తన నివాసంలో భేటీ అయ్యారు. హసీనాతో భారతదేశ జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్ సమావేశమయ్యారు. బంగ్లాదేశ్‌లో ఉద్రిక్తతల నేపథ్యంలో భారత్ – బంగ్లా సరిహద్దులో సరిహద్దు భద్రతా దళం హై అలెర్ట్ ప్రకటించింది. బంగ్లాదేశ్‌కు వెళ్లే అన్ని రైళ్లు, విమానాలు రద్దయ్యాయి.

ఇక రాజకీయాలకు గుడ్‌బై!

షేక్ హసీనా(78) ఇక రాజకీయాలకు గుడ్‌బై చెప్పాలని నిర్ణయించుకున్నట్టు ఆమె కుమారుడు సాజీబ్ వాజేద్ తెలిపారు. దేశాన్ని హసీనా ఎంతో అభివృద్ధి చేశారని చెప్పారు.

ఎగసి 'పడిన' కెరటం



బంగ్లాదేశ్ ప్రధానిగా ఎక్కువ కాలం పని చేసిన రికార్డు షేక్ హసీనాది. 1975లో హసీనా తండ్రి రెహ్మాన్, తల్లి, సోదరులు హత్యకు గురైనప్పుడు హసీనా, ఆమె సోదరి రెహానా జర్మనీలో ఉండటంతో ప్రాణాలతో బయటపడ్డారు. అప్పుడు ఆరేండ్ల పాటు ప్రవాస జీవితం గడిపిన తర్వాత 1981లో ఆమె అవామీ లీగ్ పార్టీ నాయకత్వ బాధ్యతలు తీసుకున్నారు. రాజకీయాల్లోకి వచ్చాక అనేక నిర్బంధాలను ఎదుర్కొని నిలదొక్కుకున్నారు. 1991 ఎన్నికల్లో ఓడిపోయినా.. 1996 ఎన్నికల్లో గెలిచి మొదటిసారి ప్రధాని అయ్యారు. 2001 ఎన్నికల్లో మళ్లీ బీఎన్‌పీ చేతిలో ఓటమి చవిచూశారు. 2009లో మరోసారి ప్రధాని అయిన హసీనా అప్పటినుంచి 15 ఏండ్లుగా అప్రతిహతంగా నాలుగు పర్యాయాలు గెలిచి ప్రధానిగా కొనసాగారు. హసీనాపై 19 సార్లు హత్యాయత్నాలు జరిగాయి. 2004లో గ్రనేడ్ దాడి నుంచి ఆమె తృటితో తప్పించుకున్నారు. ఆర్థిక సంస్కరణలు చేపట్టి బంగ్లాదేశ్ దిశ, దశను మార్చారని ఆమె పేరు తెచ్చుకున్నారు. సైన్యం పెత్తనం, తిరుగుబాట్లతో దేశంలో ప్రజాస్వామ్యం పూర్తిగా కనుమరుగవుతున్న వేళ బంగ్లా రాజకీయాల్లోకి వచ్చిన ఆమె ప్రజాస్వామ్యాన్ని పునరుద్ధరించారు. అయితే, అదే స్థాయిలో ఆమె నియంతృత్వ శైలిని ప్రదర్శించారనే విమర్శలూ ఉన్నాయి.

బ్లాక్ డేగా '370' రద్దు దినం

రాష్ట్ర హోదా పునరుద్ధరణకు పీడీపీ డిమాండ్

జమ్ము: జమ్ము కశ్మీరుకు ప్రత్యేక హోదాను కల్పించిన రాజ్యాంగంలోని అధికరణ 370ని రద్దు చేసి ఐదేండ్లు పూర్తయిన సందర్భంగా కాంగ్రెస్, పీడీపీ సోమవారం 'బ్లాక్ డే'గా పాటించాయి. జమ్ము కశ్మీరుకు ప్రత్యేక హోదా ఇవ్వాలని, రాష్ట్ర హోదాను పునరుద్ధరించాలని ఈ పార్టీలు వేర్వేరుగా నిర్వహించిన నిరసన ప్రదర్శనల్లో డిమాండ్ చేశాయి. కాగా, సోమవారం అమర్‌నాథ్ యాత్ర ను నిలిపేశారు. జమ్ము కశ్మీర్ శాసనసభ ఎన్నికలు సెప్టెంబర్‌లో జరుగుతాయని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి వెల్లడించారు. అధికరణ 370 రద్దు జరిగిన రోజును 'ఏకాత్మ మహోత్సవం'గా బీజేపీ నిర్వహించింది.

చొరబాటుదారులపై కాల్పులు

జమ్ము కశ్మీరులోని నియంత్రణ రేఖ వెంబడి అఖ్నూర్, సుందర్‌బని సెక్టర్లలో చొరబాటుదారులు రెండు బృందాలుగా వస్తున్నట్లు అనుమానించిన సైన్యం కాల్పులు జరిపింది. సోమవారం ఈ ఘటన చోటుచేసుకుంది.

'డెత్ చాంబర్లు'గా మారాయి

- కోచింగ్ సెంటర్లపై సుప్రీంకోర్టు ఆగ్రహం
- ఢిల్లీ రావూస్ ఘటన మేల్కొలుపని వ్యాఖ్య




న్యూఢిల్లీ: కోచింగ్ సెంటర్లు 'డెత్ చాంబర్లు'గా మారాయని, విద్యార్థుల జీవితాలతో ఆడుకుంటున్నాయని సుప్రీంకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. ఇటీవల ఢిల్లీలోని పాత రాజిందర్ నగర్‌లోని రావూస్ ఐఏఎస్ కోచింగ్ సెంటర్ బేస్‌మెంట్‌లో ముగ్గురు విద్యార్థులు మరణించడంపై స్వీయ విచారణ జరపాలని కోర్టు నిర్ణయించింది. ఈ సంఘటన అందరికీ మేలుకొలుపు అని వ్యాఖ్యానించింది. దీనిపై స్పందించాలని కేంద్ర ప్రభుత్వానికి, ఢిల్లీ రాష్ట్ర ప్రభుత్వానికి సోమవారం నోటీసులు ఇచ్చింది. అవసరమైతే ఈ కోచింగ్ సెంటర్లను మూసేయాలని ఆదేశిస్తామని ధర్మాసనం ఈ సందర్భంగా హెచ్చరించింది. దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి ఎన్నో ఆశలతో వచ్చి, కఠోరంగా శ్రమించే విద్యార్థుల పట్ల శిక్షణా కేంద్రాలు 'డెత్ ఛాంబర్లు'గా మారాయని ఆవేదన వ్యక్తం చేసింది. కెరీర్ కోసం ఈ శిక్షణ కేంద్రంలో చేరిన ముగ్గురు విద్యార్థులు ప్రాణాలు కోల్పోవడం అందరికీ కండ్లు తెరిపించే సంఘటన అని తెలిపింది. అందుకే ఈ విచారణ పరిధిని విస్తరించాలని భావిస్తున్నామని చెప్పింది. ఈ శిక్షణ కేంద్రాలకు జారీ చేసిన నిబంధనలు ఏమిటి? వాటిని అవి అమలు చేసేలా పర్యవేక్షించే యంత్రాంగం ఏమిటో తెలియజేయాలని కేంద్ర ప్రభుత్వంతోపాటు, ఢిల్లీ రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది.

2023 డిసెంబరులో ఢిల్లీ హైకోర్టు ఇచ్చిన ఆదేశాలను సవాల్ చేస్తూ శిక్షణ సంస్థల సంఘం చేసిన అప్పీలుపై విచారణ సందర్భంగా సుప్రీంకోర్టు ఈ కేసును స్వీయ విచారణకు చేపట్టింది. అగ్ని ప్రమాదాలు సంభవించినపుడు నిబంధనల ప్రకారం తగిన భద్రతా చర్యలు అమలవుతున్నాయో, లేదో పరిశీలించాలని ఢిల్లీ నగర పాలక సంస్థను, అగ్నిమాపక శాఖను హైకోర్టు అప్పట్లో ఆదేశించింది. ఈ ఆదేశాలను సవాల్ చేస్తూ శిక్షణ సంస్థల సంఘం అప్పీల్ చేసింది. ఈ అప్పీల్‌ను సుప్రీంకోర్టు సోమవారం తోసిపుచ్చింది. ఖర్చుల కింద రూ.1 లక్ష చెల్లించాలని ఈ సంఘాన్ని ఆదేశించింది. అగ్ని ప్రమాదాల నుంచి తప్పించుకోవడానికి నిర్దేశించిన భద్రతా చర్యలను, ఇతర నిబంధనలను పాటించకుండా శిక్షణ సంస్థలు పని చేయడానికి అనుమతించరాదని స్పష్టం చేసింది.

వక్ఫ్ బిల్లుపై విమర్శల వెల్లువ

కేంద్రం సవరణలను వ్యతిరేకించిన విపక్ష పార్టీలు • మార్పులు సహించబోమన్న ముస్లిం పర్సనల్ లా బోర్డ్



న్యూఢిల్లీ, ఆగస్టు 5: వక్ఫ్ బోర్డులకు అపరిమిత అధికారాలకు చెక్ పెట్టే దిశగా కేంద్రం కీలక బిల్లును తీసుకురాబోతున్నది. ఇందులో భాగంగా వక్ఫ్ చట్టం–1995 సవరించేందుకు మోదీ సర్కార్ రంగం సిద్ధం చేసింది. వక్ఫ్ చట్టం–1995 సవరణ బిల్లును రూపొందించింది. ప్రస్తుత పార్లమెంట్ బడ్జెట్ సమావేశాల్లోనే బిల్లును ప్రవేశపెట్టి, ఆమోదింపజేయాలని మోదీ సర్కార్ నిర్ణయానికి వచ్చింది. అయితే ఈ బిల్లు పార్లమెంట్‌లో రాజకీయ సునామీ సృష్టించే అవకాశం కనిపిస్తున్నది. బిల్లును పార్లమెంట్‌లో ప్రవేశపెడితే, తాము వ్యతిరేకిస్తామని సమాజ్‌వాదీ పార్టీ సోమవారం ప్రకటించింది. శివసేన (ఉద్ధవ్ వర్గం) కూడా బిల్లుపై మండిపడింది. బీజేపీ విభజన రాజకీయాలకు పాల్పడుతున్నదని సీపీఎం ఆరోపించింది. ఏకపక్షంగా నిర్ణయం తీసుకోకూడదని జేఎంఎం అభిప్రాయపడింది. మరోవైపు వక్ఫ్ బోర్డ్‌ల చట్టబద్ధమైన హోదా, అధికారాల్లో జోక్యం చేసుకుంటే సహించబోమని 'ఆల్ ఇండియా ముస్లిం పర్సనల్ లా బోర్డ్' (ఏఐఎంపీఎల్‌బీ) ప్రకటించింది. .

ముసాయిదా బిల్లులో ఏముంది?

'భారత సైన్యం, భారతీయ రైల్వేల తర్వాత భారతదేశంలో మూడో అతి పెద్ద భూ యజమానిగా ఉన్న 'వక్ఫ్ బోర్డు'కు విస్తృత అధికారాలను కట్టబెట్టారు. దాని ఆస్తులు 2009 తర్వాత రెట్టింపు అయ్యాయి' అని ముసాయిదా బిల్లులో కేంద్రం పేర్కొంది. దేశంలో ఇతర మతాలకు చెందిన మతాలకు, అఖారా, ట్రస్టులు, సొసైటీలకు లేని విస్తృత అధికారాలు, స్వతంత్ర హోదాను వక్ఫ్ బోర్డులకు కట్టబెట్టారని ప్రతిపాదిత బిల్లులో వివరించారు. తాజా సవరణల ద్వారా వక్ఫ్ ఆస్తులపై కేంద్ర, రాష్ట్ర బోర్డులకు ఉన్న అధికారాలను కట్టడి చేయడం వల్ల వక్ఫ్ బోర్డుల నిర్వహణలో మరింత పారదర్శకత ఏర్పడుతుందని కేంద్రం భావిస్తున్నది. సెంట్రల్, స్టేట్ వక్ఫ్ బోర్డులలో తప్పనిసరిగా మహిళలకు ప్రాతినిథ్యం కల్పించాలని బిల్లు పేర్కొన్నది. వక్ఫ్ ఆస్తుల నిర్వహణపై పర్యవేక్షణ బాధ్యతను జిల్లా కలెక్టర్లకు అప్పగించాలని బిల్లులో ప్రతిపాదించనుంది. వక్ఫ్ బోర్డులు ఏదైనా భూమి లేదా ఆస్తిని తమదిగా ప్రకటించటం ద్వారా పలు వివాదాలు, అధికార దుర్వినియోగానికి కారణమవుతున్నాయని కేంద్రం తెలిపింది. బిల్లు చట్టరూపం దాల్చితే.. వక్ఫ్ బోర్డులు మునుపటిలాగా ఏ ఆస్తిని స్వచ్ఛందంగా తమ ఆస్తిగా ప్రకటించుకోలేవు.

వక్ఫ్ చట్టం అంటే ఏమిటి?

దేశంలో మొదటిసారిగా వక్ఫ్ చట్టాన్ని 1954లో తీసుకొచ్చారు. అనంతరం దానికి మరిన్ని అధికారాలు కట్టబెడుతూ 1995లో చట్టాన్ని సవరించారు. 2013లో మరోసారి సవరించారు. ఇందులో పేర్కొన్న నిబంధనల ప్రకారం, ఏ కోర్టుల్లోనూ సవాల్ చేయలేని విధంగా, ఎవరి ఆస్తులనైనా స్వాధీనం చేసుకునే ప్రత్యేక అధికారాలు బోర్డులకు కల్పించారు. నేడు దేశంలో 30 వరకు వక్ఫ్ బోర్డులున్నాయి. తమిళనాడులోని వక్ఫ్ బోర్డు తాజాగా ఓ గ్రామం మొత్తం తమదేనంటూ ప్రకటించటం వివాదానికి దారి తీసింది.

పదో తరగతి బాలుడు.. మోసాల్లో ఘనుడు

- విలాసాల కోసం పోటీ పరీక్షల పేపర్ల బేరం!

ఇండోర్: జీవితాన్ని విలాసంగా గడపాలనుకున్న ఓ పదో తరగతి విద్యార్థి పబ్లిక్ సర్వీస్ కమిషన్ పరీక్షలు రాసే అభ్యర్థులనే బురిడీ కొట్టించాడు. లీకైన మధ్యప్రదేశ్ పబ్లిక్ సర్వీసెస్ పరీక్ష (ప్రిలిమ్స్) ప్రశ్నపత్రాలను విక్రయిస్తానని నమ్మించి పలువురి నుంచి డబ్బులు వసూలు చేశాడు. దీనిపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్న పోలీసులు.. నిందితుడు పదో తరగతి కుర్రాడని తెలిసి ఆశ్చర్యపోయారు. రాజస్థాన్‌లోని ఝుంఝును జిల్లాకు చెందిన నిందితుడు జీవితాన్ని విలాసంగా గడపాలని నిర్ణయించుకున్నాడు. అందుకోసం ఉద్యోగార్థులను మోసం చేయాలనుకున్నాడు. సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ టెలిగ్రాంలో ఓ చానల్‌ను క్రియేట్ చేశాడు. దాని ద్వారా మోసానికి తెరతీశాడు. జూన్ 23న జరగనున్న ఎంపీపీఎస్సీ ప్రిలిమినరీ రౌండ్ పేపర్లు లీకయ్యాయని, అవి తన వద్ద ఉన్నాయని ప్రచారం చేశాడు. ఒక్కోదాన్ని రూ.2,500 విక్రయిస్తానని బేరం పెట్టాడు. ఇలా ఐదుగురిని మోసం చేశాడు. నిజానికి అతడి వద్ద ఎలాంటి పేపర్లు లేవని పోలీసులు తెలిపారు. అతడికి నోటీసులిచ్చి కేసును దర్యాప్తు చేస్తున్నారు. నిందితుడు నీట్ పేపర్ విక్రయిస్తానని గతంలోనూ మోసానికి పాల్పడ్డాడని, ఆ కేసును సీబీఐ దర్యాప్తు చేస్తున్నదని పోలీసులు తెలిపారు.



వర్షాలతో ఉత్తరాది కుదేలు

కేదార్‌నాథ్‌లో 130 మందిని రక్షించిన ఐఏఎఫ్

న్యూఢిల్లీ, ఆగస్టు 5: దేశంలోని కొన్ని రాష్ట్రాలను భారీ వర్షాలు ముంచెత్తుతున్నాయి. గత కొద్ది రోజులుగా ఉత్తరాఖండ్‌లో కురిసిన భారీ వర్షాలు, కొండ చరియలు కూలిన ఘటనల్లో కేదార్‌నాథ్ ధామ్‌లో చిక్కుకుపోయిన 130 మంది యాత్రికులను భారత వైమానిక దళం(ఐఏఎఫ్) సోమవారం సురక్షితంగా తరలించింది. రాజస్థాన్, గుజరాత్‌లోలోనూ భారీ వర్షాలు కురుస్తున్నాయి. పశ్చిమ బెంగాల్, జార్ఖండ్‌లోనూ వర్షాలు ప్రజల జీవనంపై ప్రభావం చూపించాయి.

గో సంరక్షణపై చేతలేవి?

కేంద్రంపై టీఎంసీ ఎంపీ ఘోష్ విమర్శ


న్యూఢిల్లీ, ఆగస్టు 5: బీజేపీ దాని అనుబంధ సంస్థలు నిత్యం గోవుల గురించి, వాటి రక్షణ గురించి మాట్లాడతాయే తప్ప వాటికి సరైన దాణా సమకూర్చడంతో, వాటికి వచ్చే వ్యాధుల నుంచి రక్షణకు ఎలాంటి చర్యలు తీసుకోవని తృణమూల్ కాంగ్రెస్ ఎంపీ సయోని ఘోష్ విమర్శించారు. దేశంలోని 70 శాతం గ్రామీణ ప్రాంతాలు ఇదే రంగంపై ఆధారపడి జీవిస్తున్నా, దీనికి అతి తక్కువ మొత్తంలో నిధులు కేటాయిస్తున్నారని విమర్శించారు. కోళ్ల, పశువుల దాణా ధరలు రోజురోజుకూ ఆకాశాన్ని అంటుతున్నాయని అన్నారు.

మ్యాజిక్ మష్రూమ్‌లతో మానసిక ఆరోగ్య చికిత్స!



న్యూఢిల్లీ: వివిధ రకాల మానసిక అస్వస్థతలకు చికిత్స కోసం మ్యాజిక్ పుట్టగొడుగుల్లోని(మష్రూమ్) సిలోసిబిన్ ఉపయోగపడే అవకాశం ఉందని తాజా అధ్యయనం అంచనా వేస్తున్నది. సెయింట్ లూయిస్‌లోని వాషింగ్టన్ యూనివర్సిటీ స్కూల్ ఆఫ్ మెడిసిన్‌కు చెందిన పరిశోధకులు ఈ అధ్యయనాన్ని నిర్వహించారు. 'నేచర్' జర్నల్‌లో ఈ నివేదిక ప్రచురితమైంది. ఈ అధ్యయనంలో పాల్గొన్న ప్రతి వ్యక్తికి 18 ఎఫ్ఎంఆర్ఐ స్కాన్స్ తీశారు. వేర్వేరు బ్రెయిన్ నెట్‌వర్క్‌ల మధ్య కమ్యూనికేషన్ పెరిగినప్పటికీ, అప్పటికే ఏర్పాటైన నెట్‌వర్క్‌లలో మెదడులోని వేర్వేరు భాగాల మధ్య అనుసంధానం దెబ్బ తిన్నట్లు కనిపించింది. దీనిని బట్టి మెదడు ద్వారా సమాచారం ప్రాసెస్ అవడాన్ని అంచనా వేయగలిగే సామర్థ్యాన్ని సిలోసిబిన్ తగ్గిస్తుందని, క్రమరహిత స్థితిని సృష్టిస్తుందని తెలుస్తున్నది. అయితే ఈ అధ్యయనంలో పాల్గొన్నవారిలో దీర్ఘకాలంలో మెరుగుదల కనిపించలేదు.

ఆక్సిజన్ తగ్గినప్పుడు బీపీని పెంచే కెమికల్స్



న్యూఢిల్లీ: ప్రాణవాయువు (ఆక్సిజన్) స్థాయి తక్కువగా ఉన్నప్పుడు, మెదడులో తయారయ్యే రెండు రసాయనాలు రక్తపోటును పెంచడంలో కీలక పాత్ర పోషిస్తాయని కొత్త అధ్యయనంలో తేలింది. ఈ అధ్యయనం ప్రకారం ఈ రసాయనాల్లో ఒకటి ఆక్సిటోసిన్ కాగా, మరొకటి కార్టికోట్రోపిన్ రిలీజింగ్ హార్మోన్ (సీఆర్‌హెచ్). ఆక్సిటోసిన్‌ను లవ్ హార్మోన్ అని కూడా పిలుస్తారు. ఇది రక్తపోటు, పరస్పర సంబంధాలు, సాంఘిక అనుబంధాలను ప్రభావితం చేస్తుంది. అదే విధంగా ఒత్తిడికి గురైనపుడు స్పందించడం, ప్రవర్తనలో సీఆర్‌హెచ్ చెప్పుకోదగ్గ పాత్ర పోషిస్తుంది. అంతేకాకుండా ఆరోగ్యానికి హాని కలిగించే వాటిని గుర్తించి, తొలగించే ప్రక్రియలో కూడా ఇది ప్రముఖంగా వ్యవహరిస్తుంది. మస్తిష్క మూలంపై ఈ రెండు హార్మోన్లు చూపించే ప్రభావం గురించి తెలుసుకోవడం కోసం ఈ అధ్యయనం జరిగింది. ఈ నివేదికను జర్నల్ ఆఫ్ సైకాలజీలో ప్రచురించారు.

టోల్ ఫీజు వసూలుకు మినహాయింపులు లేవు

- 60 కి.మీ. పరిధిలో రెండు టోల్ ప్లాజాలు ఉండొచ్చు
- కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ

న్యూఢిల్లీ: జాతీయ రహదారులపై గల టోల్ ప్లాజాల వద్ద వాహనాలు బారులు తీరి నిలిచిపోయినపుడు, ఆ బారుల పొడవు నిర్దేశిత దూరం మించినపుడు లేదా వేచి ఉండాల్సిన సమయం నిర్దేశిత పరిమితిని దాటినపుడు, టోల్ రుసుము చెల్లింపును మినహాయించే నిబంధనలేవీ లేవని కేంద్ర రోడ్డు రవాణా, హైవేల శాఖ సోమవారం పార్లమెంటుకు తెలిపింది. జాతీయ రహదారులపై టోల్ ప్లాజాల మధ్య దూరం 60 కిలోమీటర్ల కన్నా తక్కువ ఉండవచ్చునని సంబంధిత నిబంధనలు స్పష్టం చేస్తున్నాయని చెప్పింది. లోక్‌సభలో ఇద్దరు సభ్యులు వేర్వేరుగా అడిగిన ప్రశ్నలకు కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ ఈ మేరకు సమాధానమిచ్చారు. ఎన్‌హెచ్ ఫీ రూల్స్ అండ్ కన్సెషన్ అగ్రిమెంట్ ప్రకారం 60 కి.మీ. పరిధిలో ఒకటి కన్నా ఎక్కువ టోల్ ప్లాజాలు పని చేయవచ్చునని స్పష్టం చేశారు. శాశ్వత వంతెన, బైపాస్, సొరంగం వంటివాటి కోసం ఈ విధంగా మరొక టోల్ ప్లాజా ఉండవచ్చునన్నారు.



కన్వర్ యాత్రలో విషాదం

కరెంట్ షాక్‌తో 9 మంది మృతి

హాజీపూర్: బీహార్‌లోని వైశాలి జిల్లాలో జరుగుతున్న కన్వర్ యాత్రలో విషాదం చోటుచేసుకున్నది. విద్యుదాఘాతంతో తొమ్మిది మంది భక్తులు మరణించగా, మరో ఇద్దరికి గాయాలయ్యాయి. వారు ప్రయాణిస్తున్న వాహనం హైటెన్షన్ విద్యుత్తు లైన్‌ను తాకడంతో ఈ ప్రమాదం జరిగిందని అధికారులు తెలిపారు. జలాభిషేకం నిర్వహించేందుకు భక్తులు సోనేపూర్‌లోని బాబా హరిహర్ నాథ్ ఆలయానికి వెళ్తుండగా సుల్తాన్‌పూర్ గ్రామంలో ఆదివారం రాత్రి 11.15 గంటలకు ఈ దుర్ఘటన జరిగిందని వైశాలి జిల్లా కలెక్టర్ యష్పాల్ మీనా తెలిపారు. గాయపడిన వారిని దవాఖానకు తరలించామని, వారిద్దరూ ప్రాణాపాయం నుంచి బయటపడ్డారని పేర్కొన్నారు. బాధితులంతా వైశాలి, చుట్టుపక్కల ప్రాంతాలకు చెందిన వారని తెలిపారు.

మహారాష్ట్రలో పోటీపై నెలాఖరులో నిర్ణయం

మరాఠా ఉద్యమ నేత జరాంగే

జాల్నా, ఆగస్టు 5: ఈ ఏడాది అక్టోబర్‌లో జరిగే మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో తమ తరఫున పోటీ చేయగలిగే అభ్యర్థుల డాటా అందుబాటులోనే ఉందని మరాఠా రిజర్వేషన్ల ఉద్యమ నేత మనోజ్ జారంగే తెలిపారు. అయితే అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేయమని తమను బలవంతం చేయవద్దని ఆయన కోరారు. ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఈ నెల 29న తమ సామాజికవర్గ నేతలతో సమావేశమై 288 స్థానాలున్న అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేయాలా? వద్దా? అన్న విషయాన్ని నిర్ణయిస్తామని తెలిపారు.

రాష్ట్ర విభజనకు వ్యతిరేకంగా బెంగాల్ అసెంబ్లీ తీర్మానం

కోల్‌కతా, ఆగస్టు 5: రాష్ట్రాన్ని విభజించే ఏ ప్రయత్నాన్ని అయినా వ్యతిరేకిస్తూ పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ సోమవారం ఒక తీర్మానాన్ని ఏకగ్రీవంగా ఆమోదించింది. సభలో సీఎం మమతా బెనర్జీ మాట్లాడుతూ సహకార సమాఖ్య వ్యవస్థను తాము విశ్వసిస్తామని, రాష్ట్రాన్ని విభజించే ఏ ప్రయత్నాన్నైనా వ్యతిరేకిస్తామని పేర్కొన్నారు. రాష్ట్ర విభజన ప్రయత్నాలను తాము కూడా వ్యతిరేకిస్తామని బీజేపీ పక్ష నేత సువేందు అధికారి పేర్కొన్నారు. ఒక లైన్‌ను తీర్మానంలో చేర్చాలన్న ఆయన ప్రతిపాదనను సీఎం అంగీకరించడంతో తీర్మానం ఏకగ్రీవంగా ఆమోదం పొందింది.

ఐదేండ్లలో 100 హార్టికల్చర్ క్లస్టర్లు

కేంద్ర మంత్రి చౌహాన్

న్యూఢిల్లీ: రైతులకు వ్యవసాయం ద్వారా ఆదాయాన్ని పెంచేందుకు ఓ రోడ్‌మ్యాప్‌ను కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ సోమవారం పార్లమెంటులో ప్రకటించారు. ఎగుమతి చేయడమే లక్ష్యంగా ఉండే 100 హార్టికల్చర్ క్లస్టర్లను రానున్న ఐదేళ్లలో ఏర్పాటు చేస్తామని తెలిపారు. వీటి కోసం రూ.18,000 కోట్లు ఖర్చు చేస్తామన్నారు. గత కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నడూ రైతులకు మేలు చేసే చర్యలు తీసుకోలేదని ఆయన విమర్శించారు. నెహ్రూ, ఇందిర స్వాతంత్ర్య దినోత్సవాల ప్రసంగాల్లో రైతులు అనే మాట ఎప్పుడూ కనిపించలేదని ఆయన విమర్శించారు.

సీఎం ప్రాసిక్యూషన్‌కు అనుమతిస్తే న్యాయ పోరాటం

'ముడా'పై కర్ణాటక మంత్రి పరమేశ్వర

బెంగళూరు, ఆగస్టు 5: ముడా కుంభకోణంలో కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య ప్రాసి క్యూషన్‌కు గవర్నర్ అనుమతి ఇస్తే అన్నారు. దానిపై న్యాయ పోరా టం చేస్తామని హోం మంత్రి పరమేశ్వర తెలిపారు. మరోవైపు ముడా స్కామ్ సూత్రధారి, కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య వెంటనే రాజీనామా చేయాలంటూ విపక్ష పార్టీలైన బీజేపీ, జేడీ(ఎస్) చేపట్టిన వారం రోజుల నిరసన పాదయాత్ర సోమవారం నాటికి మూడో రోజుకు చేరింది.

పంచాయతీరాజ్ శాఖలో బదిలీలు

హైదరాబాద్, ఆగస్టు 5 (నమస్తే తెలంగాణ): పంచాయతీరాజ్ శాఖలో పలువురు అధికారులు బదిలీ అయ్యారు. డీఆర్‌డీవో, డీఆర్‌డీఏ, సీఈవో, డీపీవోల స్థానాల్లో కొత్తవారిని నియమించింది. ఈ మేరకు ఆ శాఖ కార్యదర్శి లోకేశ్‌కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు.

రెండు రోజుల్లో విచారణ నివేదిక ఇవ్వండి

- ఇబ్రహీంపట్నం ఆర్డీవోకు జిల్లా కలెక్టర్ ఆదేశం
- ఆర్డీవో కార్యాలయంలో కలెక్టర్ శశాంక్ తనిఖీ



ఇబ్రహీంపట్నం ఆర్డీవో కార్యాలయంలో రికార్డులు పరిశీలిస్తున్న కలెక్టర్

ఇబ్రహీంపట్నం, ఆగస్టు 5: రంగారెడ్డి జిల్లా మంచాల, ఇబ్రహీంపట్నం మండలాల పరిధుల్లో భూముల డబుల్ రిజిస్ట్రేషన్ల వ్యవహారంతో పాటు తహసీల్దార్ కార్యాలయాల్లో ప్రైవేటు వ్యక్తుల దందాపై సమగ్ర విచారణ చేసి, రెండు రోజుల్లో నివేదిక సమర్పించాలని రంగారెడ్డి జిల్లా కలెక్టర్ శశాంక్ ఇబ్రహీంపట్నం ఆర్డీవో అనంతరెడ్డిని ఆదేశించారు. రాచకొండ పరిధిలో వేలాది ఎకరాలు గతంలోనే రిజిస్ట్రేషన్లు జరగ్గా.. ఆ భూములను తక్కువ ధరకు డబుల్ రిజిస్ట్రేషన్ చేస్తున్న వ్యవహారంపై సోమవారం 'నమస్తే తెలంగాణ' 'రాచకొండలో అరాచకకాండ' శీర్షికన కథనం ప్రచురించింది. ఇందుకు స్పందించిన కలెక్టర్ శశాంక్ వెంటనే విచారణ చేయాల్సిందిగా ఆర్డీవోను ఆదేశించారు. సోమవారం ఇబ్రహీంపట్నంలోని ఆర్డీవో కార్యాలయానికి వచ్చిన ఆయన ఆర్డీవో, ఇతర అధికారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా రాచకొండ పరిసర ప్రాంతాల్లో గుట్టుగా సాగుతున్న భూ దందాలో భాగంగా డబుల్ రిజిస్ట్రేషన్ల వ్యవహారంపై ఆరా తీసినట్టు తెలిసింది. రెండు రోజుల్లో ఈ విషయంపై పూర్తిస్థాయిలో నివేదికను తనకు అందజేయాలని ఆయన సూచించారు. అదేవిధంగా రెవెన్యూ కార్యాలయాల్లో ప్రైవేటు వ్యక్తులతోపాటు దళారులు కూడా ప్రవేశించటాన్ని ప్రస్తావించి తగు సూచనలు చేసినట్టు సమాచారం. కలెక్టర్ వెళ్లిన అనంతరం ఆర్డీవో అనంతరెడ్డి 'నమస్తే తెలంగాణ'తో మాట్లాడుతూ.. కలెక్టర్ ఆదేశానుసారం రెండు రోజుల్లో విచారణ చేసి, నివేదిక సమర్పిస్తామని తెలిపారు.

- పాత ప్లాంట్ కూలింగ్ టవర్ల కూల్చివేత



ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో విద్యుత్ వెలుగులు విరజిమ్మిన కేటీపీఎస్ పాత ప్లాంట్ ఓ అండ్ ఎంలో 8 యూనిట్లకు చెందిన 8 కూలింగ్ టవర్లను సోమవారం కూల్చివేశారు. కంపెనీ ప్రతినిధులు, జెన్కో అధికారులు పర్యవేక్షించారు. కేటీపీఎస్ 5వ దశ నుంచి రాష్ట్ర గ్రిడ్‌కు వెళ్లే లైన్లలో విద్యుత్ సరఫరాను నిలిపివేసి వేరే మార్గం ద్వారా సరఫరా చేశారు. - పాల్వంచ

చేపలు లేని చెరువులు!

- పంపిణీకి ముందుకురాని సరఫరాదారులు
- టెండర్లు దాఖలు చేయడానికి నిరాసక్తత
- మూడుసార్లు గడువు పెంచినా స్పందన నిల్



హైదరాబాద్, ఆగస్టు 5(నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో ఇటీవల కురిసిన వర్షాలతో గ్రామాల్లోని చెరువులు జలకళ సంతరించుకున్నాయి. కానీ ఇంతవరకు ఆ చెరువునీటిలో చేప పిల్లలను వేయలేదు. మత్స్యకారుల కోసం ప్రభుత్వం ప్రతిఏటా చేపపిల్లలను కొని చెరువుల్లో వేస్తున్న తెలిసిందే. ఈ ఏడాది చేపల పంపిణీకి సరఫరాదారులెవరూ ముందుకురావడం లేదు. చేప పిల్లల పంపిణీ కోసం ప్రభుత్వం గత నెల 9న టెండర్లను ఆహ్వానించగా సరైన స్పందన రావడం లేదు. తొలిసారి ఒకే ఒక్క టెండర్ దాఖలు కావడంతో గడువు పొడిగించారు. రెండోసారి ముచ్చటగా ముగ్గురు మాత్రమే టెండర్ వేయడంతో మరోసారి గడువు పొడిగించారు. పాత బకాయిలు చెల్లించేంత వరకు టెండర్లు వేయబోమని సరఫరాదారులు తేల్చి చెబుతున్నారు. పాత బకాయిలు చెల్లించకుండా, వాటిపై హామీ ఇవ్వకుండా కొత్త టెండర్లు పిలవడం ఏమిటని ప్రశ్నిస్తున్నారు. ప్రస్తుత టెండర్ దాఖలు చేయాలంటే ఈఎండీ చెల్లించేందుకు కూడా తమ వద్ద డబ్బులు లేవని, ఇక టెండర్లు ఏ విధంగా వేస్తామని అంటున్నారు.

తొలిసారి ఒకటి.. రెండోసారి మూడు

ఈ ఏడాది 85 కోట్ల చేప పిల్లల్ని పంపిణీ చేయాలని లక్ష్యంగా పెట్టుకున్న మత్స్యశాఖ జూలై 9న నోటిఫికేషన్ జారీచేసింది. టెండర్ దాఖలకు జూలై 23 వరకు అవకాశం కల్పించింది. ఒకే ఒక టెండర్ దాఖలు కావడంతో గడువును ఆగస్టు 2 వరకు పొడగించింది. రెండోసారి కేవలం మూడు టెండర్లే దాఖలయ్యాయి. ఖమ్మం జిల్లాలో ఒకటి, మహబూబాబాద్ జిల్లాలో రెండు టెండర్లు వచ్చాయి. దీంతో అధికారులు మళ్లీ ఈ నెల 13 వరకు గడువు పెంచారు. ఇప్పుడైనా పూర్తిస్థాయిలో టెండర్లు వస్తాయా లేదా అనేది ప్రశ్నార్థకంగా ఉంది. నిరుడు ఏకంగా 130 వరకు టెండర్లు దాఖలయ్యాయి.

బకాయిలు చెల్లిస్తేనే...

నిరుడు సుమారు రూ.104 కోట్ల విలువైన 86 కోట్ల చేపలు, రొయ్య పిల్లల్ని ప్రభుత్వం పింపిణీ చేసింది. అయితే అప్పటికే ఎన్నికల హడావిడి మొదలుకావడంతో వీళ్లకు బిల్లులు చెల్లించలేకపోయింది. ఆ తర్వాత వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం చేప పిల్లల పథకంపై విచారణకు ఆదేశించి, గత సరఫరాదారులకు బిల్లులను నిలిపేసింది. సరఫరాదారులు ఎన్నిమార్లు పలువురు మంత్రులను, ఉన్నతాధికారులను, ప్రభుత్వ పెద్దల్ని కలిసినప్పటికీ ప్రయోజనం లేకుండా పోయింది. దీంతో తాజాగా ప్రభుత్వం పిలిచిన టెండర్లలో పాల్గొనకూడదని సరఫరాదారులు నిర్ణయించారు. పాత బకాయిలు చెల్లిస్తేగానీ టెండర్లలో పాల్గొనబోమని తేల్చి చెప్పారు.

చిన్న, పెద్ద పత్రికల విభజన చెల్లదు : హైకోర్టు

హైదరాబాద్, ఆగస్టు 5 (నమస్తే తెలంగాణ): పత్రికల్లో పనిచేసేవారికి అక్రెడిటేషన్ కార్డుల జారీలో పెద్ద పత్రికలు, చిన్న పత్రికల విభజనను హైకోర్టు తప్పుపట్టింది. చిన్న పత్రికలను ఏ, బీ, సీ, డీలుగా విభజించడం చెల్లదని తీర్పిచ్చింది. జీవో 230లో షెడ్యూల్-ఇలోని నిబంధన చెల్లదని పేర్కొంది. రెండు నెలల్లోగా చిన్న పత్రికలకు అక్రెడిటేషన్ ప్రయోజనాలు కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని ప్రభుత్వానికి ఉత్తర్వులు ఇచ్చింది. అక్రెడిటేషన్ కార్డుల జారీకి 2016లో ఇచ్చిన జీవోలోని నిబంధనలు వివక్షపూరితంగా ఉన్నాయని మహబూబ్‌నగర్‌కు చెందిన టీ కృష్ణ వ్యాజ్యంపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ జే శ్రీనివాసరావుతో కూడిన ధర్మాసనం ఇటీవల విచారణ జరిపింది.

కవిత బెయిల్ పిటిషన్‌పై 7న తుది వాదనలు

హైదరాబాద్, ఆగస్టు 5 (నమస్తే తెలంగాణ) : ఢిల్లీ మద్యం పాలసీ కేసులో ఎమ్మెల్సీ కవితకు డిఫాల్ట్ బెయిల్‌పై విచారణ మళ్లీ వాయిదా పడింది. ఈ నెల 7న తుది వాదనలు వింటామని ట్రయల్ కోర్టు జడ్జి కావేరి బవేజా తెలిపారు. నిర్దేశిత 60 రోజుల గడవులో పూర్తిస్థాయి చార్జిషీట్ దాఖలులో సీబీఐ విఫలమైందని జూలై 8న కవిత తరపు న్యాయవాదులు వాదనలు వినిపించిన విషయం తెలిసిందే. ఈ కేసులో కవితను ఏప్రిల్ 11న సీబీఐ అరెస్ట్ చేయగా, ఈడీ కేసులోనూ కవితకు జ్యుడీషియల్ రిమాండ్‌ను ఆగస్టు 13వరకు పొడిగించింది.

బదిలీకి వ్యవసాయ ఉద్యోగుల ససేమిరా

- ట్రాన్స్‌ఫర్లను ఆపించేందుకు పైరవీలు
- ఉన్నతాధికారులపై రాజకీయ ఒత్తిళ్లు

హైదరాబాద్, ఆగస్టు 5(నమస్తే తెలంగాణ): వ్యవసాయశాఖలో ఒకే చోట ఏండ్లుగా పాతుకుపోయిన ఉద్యోగులు ఈ బదిలీల్లో సైతం తమ స్థానాన్ని ఖాళీ చేసేందుకు ససేమిరా అంటున్నారు. ఏ విధంగా అయినా సరే బదిలీని ఆపించేందుకు నానాతంటాలు పడుతున్నారు. ఇందుకోసం పలుకుబడితో పైరవీలు సాగిస్తున్నారు. ఎమ్మెల్యేలు, మంత్రులు ఇలా రాజకీయ నేతల నుంచి సిఫార్సు లేఖలతో వ్యవసాయశాఖ కమిషనరేట్ చుట్టూ తిరుగుతున్నారు. బదిలీని ఆపేందుకు ఉన్నతాధికారులపై రాజకీయంగా ఒత్తిడి చేయిస్తున్నట్టు తెలిసింది. ఈ బదిలీలేంటోగానీ పైరవీలు, ఫోన్లు, ఒత్తిళ్లను తట్టుకోలేకపోతున్నామంటూ పలువురు అధికారులు వాపోతున్నారు. వ్యవసాయశాఖలో వందల సంఖ్యలో ఉద్యోగులు ఒకే చోట పది, పదిహేనేండ్లుగా విధులు నిర్వరిస్తున్నారు. అంతకుముందు వాళ్లకు బదిలీ అయినప్పటికీ తమ పలుకుబడి, పైరవీలతో మళ్లీ అదే స్థానంలో తిష్టవేశారు. ఇప్పుడు మళ్లీ బదిలీల ప్రక్రియ జరుగుతుండటంతో ఏండ్లుగా తిష్టవేసిన అధికారుల గుండెల్లో రైళ్లు పరుగెడుతున్నట్టు తెలిసింది. బదిలీల్లో దూరం వెళ్లాల్సి వస్తుందేమోననే భయంతో బదిలీని ఆపించేందుకు స్థాయికి మించి పైరవీలు చేస్తున్నట్టు వ్యవసాయశాఖ డైరెక్టరేట్‌లో జోరుగా చర్చ జరుగుతున్నది. బదిలీల పూర్తికి రెండు రోజుల గడువే ఉండటంతో ఉద్యోగులు తమ పైరవీలకు మరింత పదును పెట్టినట్టు తెలిసింది. ఒకవేళ బదిలీ చేయడం తప్పనిసరైతే.. జిల్లాలకు కాకుండా ఉమ్మడి హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల్లో పోస్టింగ్ ఇవ్వాలంటూ కోరుతున్నట్టు సమాచారం. అయితే బదిలీల్లో ఉన్నతాధికారులు పైరవీలకు తావు ఇవ్వటం లేదని తెలిసింది. ఎవరైనా సరే బదిలీ జాబితాలో ఉంటే కచ్చితంగా వెళ్లాల్సిందేనని తేల్చి చెప్తున్నట్టు సమాచారం.

బదిలీ, డిప్యూటేషన్, ఓడీకి ప్రత్యేక కమిటీ

హైదరాబాద్, ఆగస్టు 5 (నమస్తే తెలంగాణ): ప్రభుత్వ పాఠశాల, కళాశాల ఉపాధ్యాయులు, లెక్చరర్లు వ్యక్తిగత కారణాలు, ఇతర సమస్యలతో తమను బదిలీ చేయాలని, ఓడీ(ఆన్ డ్యూటీ) ఇవ్వాలని, వేరే చోటుకు డిప్యూటేషన్‌పై పంపించాలని అధికారులు, ప్రజాప్రతినిధుల చుట్టూ తిరుగుతుంటారు. మెడికల్, పర్సనల్, స్పౌజ్ వంటి ఇతర కుటుంబ కారణాలను చూపుతూ అధికారులకు భారీగా దరఖాస్తులు అందుతున్నాయి. ఇది పెద్ద సమస్యగా మారింది. ఇందుకు ప్రభుత్వం ప్రత్యేక కమిటీని నియమిస్తూ నిర్ణయం తీసుకుంది. ఇక మీదట ఈ తరహా వచ్చే అర్జీలను ఈ కమిటీ పరిశీలించి నిర్ణయం తీసుకుంటుంది. కళాశాల విద్యా కమిషనర్, సాంకేతిక విద్యా కమిషనర్, ఉన్నత విద్యామండలి కార్యదర్శి, ఇంటర్ విద్యా డైరెక్టర్ సభ్యులుగా ఉండగా, పాఠశాల విద్యాశాఖ కమిషనర్ మెంబర్ కన్వీనర్‌గా ఉంటారు. పైరవీలకు తావులేకుండా నేరుగా లేదా ఆన్‌లైన్ ద్వారా ప్రత్యేక వెబ్ పోర్టల్లో ఉపాధ్యాయులు, లెక్చరర్లు ప్రతీ ఏడాది మే, ఆగస్టు, నవంబర్ మొదటి వారంలో దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. మూడో వారంలో సమావేశమై నిర్ణయం తీసుకొని అదే నెలలో 25లోపు సంబంధిత హెచ్‌ఓడీలకు ఆదేశాలు జారీ చేస్తుంది. కమిటీ తీసుకున్న నిర్ణయాలకు అనుగుణంగా ఆయా శాఖల ఉన్నతాధికారులు బదిలీలు, ఓడీ, డిప్యూటేషన్‌కు చర్యలు తీసుకుంటారు.

చిత్రం

చుట్టమల్లె చుట్టేస్తావే తుంటరి చూపు..



ఎన్టీఆర్ 'దేవర' సినిమా మ్యూజికల్ ప్రమోషన్స్‌ని మేకర్స్ వేగవంతం చేశారు. ఇప్పటికే ఈ సినిమాలోని తొలిపాట 'ఫియర్ సాంగ్' మాస్ ప్రేక్షకుల్ని విశేషంగా ఆకట్టుకుంటున్న విషయం తెలిసిందే. సోమవారం రెండోపాట విడుదలైంది. 'చుట్టమల్లె చుట్టేస్తావే తుంటరి చూపు.. ఊరికే ఉండదు కాసేపు.. అస్తమానం నీ లోకమే నా మైమరపు.. చేతనైతే నువ్వే నన్నాపు..' అంటూ హీరోయిన్ పాయింట్ ఆఫ్‌వ్యూలో సాగే ఈ పాటను రామజోగయ్యశాస్త్రి రాయగా, అనిరుధ్ స్వరపరిచారు. శిల్పారావు ఆలపించారు. కథానాయకుడిపై తనకున్న ప్రేమను కథానాయిక ఆవిష్కరించేలా సాహిత్యం, చిత్రీకరణ సాగింది. ఎన్టీఆర్, జాన్వీకపూర్‌లపై మోస్ట్ రొమాంటిక్‌గా దర్శకుడు కొరటాల శివ ఈ పాటను తెరకెక్కించినట్టు తెలుస్తున్నది. రత్నవేలు ఛాయాగ్రహణం విజువల్ వండర్‌గా సాగింది. ఈ పాటలో ఎన్టీఆర్ స్టైలిష్‌గా కనిపిస్తుంటే, జాన్వీ గ్లామర్ అవతార్‌లో యూత్‌ని ఆకట్టుకునేలా ఉంది. రెండు భాగాలుగా ఈ సినిమా రూపొందుతున్న విషయం తెలిసిందే. సెప్టెంబర్ 27న 'దేవర 1' విడుదల కానుంది. సైఫ్ అలీఖాన్ విలన్‌గా నటిస్తున్న ఈ చిత్రానికి మిక్కిలినేని సుధాకర్, హరికృష్ణ.కె నిర్మాతలు. సమర్పణ: నందమూరి కల్యాణ్‌రామ్.

పతాక ఘట్టాల్లో



విడుదల ఆలస్యం అవుతున్నా.. 'పుష్ప 2' క్రేజ్ మాత్రం అంతకంతకూ పెరుగుతూనే ఉంది. టీజర్‌తోపాటు విడుదలైన రెండు పాటలకు అనూహ్యమైన స్పందన రావడంతో సినిమాపై అంచనాలు అమాంతం పెరిగాయి. దేవిశ్రీ సంగీతం, చంద్రబోస్ సాహిత్యం, బన్నీ స్టైల్, స్టెప్స్, రష్మిక అందచందాలు.. వీటన్నింటికీ అందరూ ఫిదా అయిపోతున్నారు. ప్రస్తుతం హైదరాబాద్ ఆర్‌ఎఫ్‌సీలో భారీ వ్యయంతో నిర్మించిన సెట్‌లో ఈ సినిమా పతాక సన్నివేశాలను దర్శకుడు సుకుమార్ తెరకెక్కిస్తున్నారు. ఈ సీక్వెన్స్ సినిమాకే హైలైట్‌గా ఉండనుందని మేకర్స్ చెబుతున్నారు. డిసెంబర్ 6న విడుదల కానున్న ఈ చిత్రం మైత్రీ మూవీమేకర్స్, సుకుమార్ రైటింగ్స్ బ్యానర్లపై తెరకెక్కుతున్నది. నవీన్ ఎర్నేని, వై.రవిశంకర్ ఈ చిత్రానికి నిర్మాతలు.

ప్రభాస్‌తో జోడీగా?



చిత్రసీమలో కొన్ని కాంబినేషన్స్ ఎప్పుడూ కొత్తగానే అనిపిస్తాయి. అలాంటి వాటిలో ప్రభాస్-త్రిష జోడీ ఒకటి. వెండితెరపై హిట్‌పెయిర్‌గా గుర్తింపుతెచ్చుకుంది జంట. వారిద్దరు కలిసి నటించిన 'వర్షం' 'బుజ్జిగాడు' 'పౌర్ణమి' చిత్రాలు అభిమానులను ఎంతగానో అలరించాయి. ముఖ్యంగా 'వర్షం' సినిమాలో ప్రభాస్, త్రిష మధ్య పండిన కెమిస్ట్రీని ఎప్పటికీ మరచిపోలేం. తాజా సమాచారం ప్రకారం ఈ హిట్ పెయిర్ మరోసారి ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమవుతున్నట్లు తెలిసింది. సందీప్‌రెడ్డి వంగా దర్శకత్వంలో ప్రభాస్ 'స్పిరిట్' చిత్రంలో నటించబోతున్న విషయం తెలిసిందే. ఇందులో ప్రభాస్ పోలీస్ పాత్రలో కనిపించనున్నారు. ఈ సినిమాలో త్రిషను కథానాయికగా ఖరారు చేయబోతున్నారనే వార్తలు వినిపిస్తున్నాయి. ఇప్పటికే ఈ విషయంలో ప్రాథమిక చర్చలు పూర్తయ్యాయని, త్వరలో అధికారిక ప్రకటన వెలువడుతుందని అంటున్నారు. ఈ ఏడాది చివరలో 'స్పిరిట్' సెట్స్‌మీదకు వెళ్లనుందని సమాచారం. ఇదిలావుండగా ఇటీవలే త్రిష 'బృంద' సిరీస్‌తో ప్రేక్షకుల ముందుకొచ్చింది. ఇందులో ఆమె అభినయానికి ప్రశంసలు లభిస్తున్నాయి.

పొట్ట చెక్కలయ్యేలా నవ్విస్తాం

'ఇది పక్కా గోదారోళ్ల సినిమా. నవ్వి నవ్వి థియేటర్ల నుంచి బుగ్గలు, పొట్ట నొప్పితో బయటకు వస్తారని గ్యారెంటీగా చెప్పగలను. పిఠాపురంలో ఈ వేడుక జరపడం ఆనందంగా ఉంది. మా సంగీత దర్శకుడు రామ్ మిర్యాలది ఈ ఊరే అని ఇప్పుడే తెలిసింది. అందుకే.. ఇందులోని పాటల్ని అద్భుతంగా కంపోజ్ చేశారాయన. అందరికీ నచ్చేలా సినిమా ఉంటుంది' అని బన్నీ వాస్ అన్నారు. నార్నె నితిన్, నయన్ సారిక జంటగా నటించిన చిత్రం 'ఆయ్'. అంజి కె.మణిపుత్ర దర్శకుడు. అల్లు అరవింద్ సమర్పణలో బన్నీ వాసు, విద్యా కొప్పినీడి ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఈ నెల 15న సినిమా విడుదల కానుంది. ఈ సందర్భంగా ఈ సినిమా ట్రైలర్‌ని పిఠాపురంలో విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో బన్నీవాసు మాట్లాడారు. తమ కష్టానికి తగ్గ ప్రతిఫలాన్ని మీరంతా సక్సెస్ రూపంలో ఇవ్వాలని నార్నె నితిన్ ఆశాభావం వ్యక్తం చేశారు. ట్రైలర్‌ని ఎంత ఎంజాయ్ చేశారో, సినిమాను అంతకు మించి ఎంజాయ్ చేస్తారని, నవ్విస్తూనే చిన్న చిన్న ఎమోషన్స్ టచ్ చేశామని దర్శకుడు అంజి కె.మణిపుత్ర చెప్పారు. ఇంకా చిత్ర యూనిట్ సభ్యులతోపాటు పిఠాపురం మాజీ ఎమ్మెల్యే వర్మ, ఏపీ తెలుగు రైతు అధ్యక్షుడు మర్రెడ్డి శ్రీనివాస్ కూడా మాట్లాడారు.





స్వేచ్ఛ కోసం చేసే పోరాటం

'పా రంజిత్ నా అభిమాన దర్శకుడు. ఆయనతో సినిమా చేయాలని ఎప్పటి నుంచో అనుకుంటున్నా. యూనివర్సల్ అప్పీల్ ఉన్న కథ ఇది. ఇందులో స్వేచ్ఛ కోసం చేసే పోరాటం ప్రధానాంశంగా ఉంటుంది' అన్నారు చియాన్ విక్రమ్. ఆయన కథానాయకుడిగా నటించిన తాజా చిత్రం 'తంగలాన్' ఈ నెల 15న ప్రేక్షకుల ముందుకురానుంది. పా రంజిత్ దర్శకత్వంలో పీరియాడిక్ మూవీగా తెరకెక్కించారు. సోమవారం జరిగిన పాత్రికేయుల సమావేశంలో విక్రమ్ మాట్లాడుతూ 'బంగారం వేట చుట్టూ ఈ కథ నడుస్తుంది. అసమానతలకు గురైన ఓ తెగ స్వేచ్ఛ కోసం ఎలాంటి పోరాటం చేశారన్నది స్ఫూర్తివంతంగా ఉంటుంది. తంగలాన్ అన్నది ఓ తెగ పేరు. ఈ సినిమా కోసం చాలా కష్టపడ్డాను. మేకప్ కోసం గంటల కొద్ది సమయం పట్టేది. మనకు ఇష్టమైన పని దొరికినప్పుడు ఆకలి, నిద్ర మరచిపోతాం. ఈ పాత్రను ఎంతగానో ఇష్టపడి చేశాను కాబట్టి షూటింగ్ జరిగిన ప్రతీ రోజుని ఎంజాయ్ చేశాను. అవార్డులు నాకు ఇష్టమే కానీ..అంతకంటే ముఖ్యంగా ప్రేక్షకుల ప్రశంసలు ఎక్కువ సంతోషాన్నిస్తాయి' అన్నారు. ఈ సినిమాలో తాను ఆరతి అనే పాత్రలో కనిపిస్తానని, ఇండియన్ ఫిల్మ్ ఇండస్ట్రీలో ఇటీవల కాలంలో రూపొందిన టఫెస్ట్ మూవీ ఇదేనని కథానాయిక మాళవిక మోహనన్ తెలిపింది. ఈ సినిమాలో దర్శకుడు పా రంజిత్ ఓ కొత్త ప్రపంచాన్ని క్రియేట్ చేశారని మరో నాయిక పార్వతీ తిరువోతు పేర్కొంది.



కూర్చోవాలంటే తంట..
కూర్చుంటే మంట..
జీవితం సహజంగా ఉండదు. నడక కృతకంగా మారిపోతుంది. కుదురుగా నిలబడలేని దుస్థితి. హాయిగా పడుకుందామన్నా ఒక్కోసారి కుదరదు.. వీటన్నిటికీ కారణం మల విసర్జక వ్యవస్థకు ఎదురయ్యే విపరిణామాలే! అర్షమొలలు, ఫిస్టులా, ఫిజర్స్, మలబద్ధకం లాంటి సమస్యలు మనిషిని పీల్చి పిప్పిచేస్తాయి. సిగ్గుతోనో, భయంతోనో వీటిని బయటపెట్టకపోతే గోటితో పోయే దానికి గొడ్డలి దాకా తెచ్చుకున్నట్టు అవుతుంది.


గోటితో పోయేవే!

మనిషి జీవితం సాఫీగా సాగిపోవాలంటే వివిధ పోషకాలు ఉన్న ఆహారాన్ని నియమిత వేళల్లో, తగిన మొత్తంలో తినాలి. అలానే శరీర విసర్జక క్రియలు కూడా సాఫీగా జరగాలి. కొన్నిసార్లు అపసవ్యమైన జీవనశైలి, అనారోగ్యకరమైన ఆహారపు అలవాట్లు మన విసర్జక వ్యవస్థపై దుష్ప్రభావం చూపుతాయి. దీంతో అర్షమొలలు, ఫిస్టులా, ఫిజర్స్, మలబద్ధకం లాంటి సమస్యల బారినపడతాం. విసర్జన సమయంలో మంట, సరిగ్గా కూర్చోలేకపోవడం, రక్తస్రావం లాంటివి రోగులను తీవ్రమైన ఇబ్బందికి, అసౌకర్యానికి గురిచేస్తాయి. వెంటనే చికిత్స చేయించుకోకపోతే సాధారణమైన సమస్యలే ప్రాణాంతకంగా మారతాయి. కాబట్టి, విసర్జక వ్యవస్థకు సంబంధించిన రుగ్మతలు తలెత్తితే సిగ్గు, బిడియం వదిలేసి వీలైనంత త్వరగా చికిత్స చేయించుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు.

పైల్స్, ఫిస్టులా, ఆనల్ ఫిజర్స్... ఇవి సర్వసాధారణంగా వచ్చే ఆరోగ్య సమస్యలు. జీవనశైలి, ఆహారపు అలవాట్లు తదితర కారణాల వల్ల ఈ మధ్యకాలంలో పైల్స్, ఫిస్టులా వంటి సమస్యలు పెరుగుతున్నాయి. ఒకప్పుడు 50 ఏండ్లు పైబడిన వారిలో మాత్రమే కనిపించే ఈ సమస్యలు ఇప్పుడు 20– 30 వయసు వారిలో కూడా తలెత్తుతున్నాయి. వైద్యరంగంలో కొత్త చికిత్స విధానాలు అందుబాటులోకి వస్తున్న తరుణంలో ఇలాంటి సమస్యలపై సరైన అవగాహన లేక చాలామంది రోగులు వ్యాధి ముదిరిన తరువాత దవాఖానలకు పరుగులు తీస్తున్నారు. చేతులు కాలాక ఆకులు పట్టుకున్న చందాన ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారు. ముఖ్యంగా మహిళలు ఈ సమస్యలను బయటికి చెప్పుకొనేందుకు సిగ్గుపడి, లోలోపలే ఇబ్బందులు పడుతూ చివరికి ప్రమాదం అంచులకు చేరుకుంటున్నారని వైద్యులు చెబుతున్నారు. అయితే, గతంతో పోల్చితే ఇప్పుడు చాలామంది మహిళా వైద్యులు అందుబాటులో ఉన్నారు. కాబట్టి పైల్స్, ఫిస్టులా వంటి సమస్యలను సులభంగా నయం చేసుకోవచ్చు.

పైల్స్ (అర్షమొలలు)

వీటినే హెమరాయిడ్స్ అని కూడా అంటారు. ఈ సమస్య ఉన్నవారిలో మల విసర్జన ద్వారం ప్రాంతంలో ఉన్న రక్తనాళాలు ఒత్తిడికి గురై ఉబ్బుతాయి. ఈ విధంగా ఉబికి వచ్చిన రక్తనాళాల గోడలు మలద్వారంలో అడ్డుగా మారి మంట కలిగిస్తాయి. దీంతో మల విసర్జనలో ఇబ్బంది తలెత్తడంతోపాటు రక్తనాళాలు ఒరిపిడికి గురై రక్తస్రావం అవుతుంది. దీంతో రోగి మలద్వారం ప్రాంతంలో తీవ్రమైన నొప్పితోపాటు కూర్చోవడానికి కూడా ఇబ్బంది పడతాడు. పైల్స్... అంతర్గత మొలలు లేదా ఇంటర్నల్ హెమరాయిడ్స్, బహిర్గత మొలలు లేదా ఎక్స్‌టర్నల్ హెమరాయిడ్స్ అని రెండు రకాలు.



అంతర్గత మొలలు

ఇవి మల విసర్జన ద్వారం లోపల ఏర్పడతాయి. మల ద్వారం బయటినుంచి కనిపించవు. సాధారణంగా ఇంటర్నల్ హెమరాయిడ్స్ వల్ల ప్రారంభంలో నొప్పి ఉండదు. నొప్పి లేనప్పటికీ మల విసర్జన సమయంలో రక్తస్రావం జరుగుతుంది. ఈ అంతర్గత మొలలు లోపలినుంచి బయటికి విస్తరించినప్పుడు మాత్రం నొప్పి, మంట ఏర్పడతాయి.

బహిర్గత మొలలు

ఇవి ఆనస్ (మలద్వారం) చుట్టూ ఏర్పడతాయి. ఇవి మల ద్వారం వద్ద ఉబ్బెత్తుగా, ముద్దలుగా ఏర్పడతాయి. వాటి దగ్గర దురద, నొప్పి ఉంటుంది. రక్తస్రావం ఏర్పడుతుంది.

కారణాలు

పైల్స్, ఫిస్టులా, ఫిజర్స్, కాన్‌స్టిపేషన్ (మలబద్ధకం) వంటి సమస్యలన్నిటికీ జీవనశైలి, ఆహారపు అలవాట్లే ప్రధాన కారణాలుగా చెప్పవచ్చు. ముఖ్యంగా ఎక్కువసేపు ఒకేచోట కూర్చోవడం, బైక్‌పై ఎక్కువగా ప్రయాణం చేయడం, నీరు, పీచుపదార్థాలు తక్కువగా తీసుకోవడం వల్ల కూడా ఈ సమస్యలు వచ్చే అవకాశం ఉంటుంది. ఇక మహిళల్లో గర్భధారణ సమయంలో, థైరాయిడ్ వల్ల కూడా ఈ సమస్యలు ఉత్పన్నం కావచ్చు.

నిర్ధారణ - చికిత్స

రోగి లక్షణాలు, భౌతిక పరీక్ష ద్వారా సమస్యను వైద్యులు నిర్ధారిస్తారు. సాధారణంగా పైల్స్‌లో 4 దశలు ఉంటాయి. అందులో సమస్య గ్రేడ్–1, గ్రేడ్–2 దశలో ఉంటే మందులు వాడుతూ, ఆహారపు అలవాట్లను మార్చుకుంటే రోగం నయమైపోతుంది. ఈ దశలో సర్జరీ అవసరం పడదు. ఇక సమస్య గ్రేడ్–3, గ్రేడ్–4 దశలకు చేరుకుంటే మాత్రం శస్త్రచికిత్స తప్పనిసరి. అయితే, గతంలో ఓపెన్ సర్జరీ చేసేవారు. దీనివల్ల కనీసం వారం రోజులపాటు హాస్పిటల్‌లో ఉండాల్సి వచ్చేది. పూర్తిగా కోలుకోవడానికి కనీసం నెలరోజుల సమయం పట్టేది. కానీ ఇప్పుడు లేజర్ సర్జరీ అందుబాటులోకి వచ్చింది. దీంతో రోగి అదేరోజు దవాఖాన నుంచి డిశ్చార్జ్ కావచ్చు. రెండుమూడు రోజుల్లో పూర్తిగా కోలుకుంటాడు.

ఫిస్టులా

ఆనల్ గ్లాండ్‌లో ఏర్పడే ఇన్ఫెక్షన్ కారణంగా మల ద్వారం వద్ద రంధ్రంలా ఏర్పడుతుంది. దీంతో మల ద్వారం వద్ద ఎర్రగా మారి ఆ రంధ్రంలో నుంచి చీము కారుతుంది. దీన్ని నిర్లక్ష్యం చేస్తే ఇన్ఫెక్షన్ మూత్రాశయం వరకు విస్తరించే ప్రమాదం ఉంటుంది. ఈ సమస్యను రోగి గుర్తించలేడు. వైద్యులు మాత్రమే నిర్ధారించగలుగుతారు.

లక్షణాలు

మలద్వారం వద్ద తీవ్రమైన నొప్పి ఉంటుంది. మలద్వారం వద్ద నుంచి చీము కారుతుంది. రోగి కూర్చోలేకపోతాడు.

నిర్ధారణ పద్ధతులు

- ఫిజికల్ ఎగ్జామినేషన్ ద్వారా
- ఎంఆర్ఐ ద్వారా నిర్ధారించవచ్చు

చికిత్సా పద్ధతులు

ఫిస్టులాకు కూడా గతంలో ఓపెన్ సర్జరీ చేసేవారు. దీనివల్ల రోగి కోలుకోవడానికి 2– 3 నెలల సమయం పట్టేది. ఇప్పుడు లేజర్ సర్జరీ ద్వారా కేవలం వారం రోజుల్లోనే రోగి పూర్తిగా కోలుకుంటాడు. సర్జరీ జరిగిన ఒక రోజులోనే దవాఖాన నుంచి డిశ్చార్జ్ చేస్తారు.

నిర్లక్ష్యం చేస్తే ప్రాణాలకే ప్రమాదం

సాధారణంగా కొలరెక్టల్, రెక్టమ్ క్యాన్సర్ల లక్షణాలు పైల్స్, ఫిస్టులా, ఫిజర్స్ లక్షణాలను పోలి ఉంటాయి. దీంతో చాలామంది వచ్చిన సమస్యను పైల్స్‌గానో లేక ఫిస్టులా, ఫిజర్స్ అనుకుని నాటువైద్యులను సంప్రదిస్తారు. వారేమో రోగుల సమస్యను క్యాన్సర్ అని గుర్తించక పైల్స్, ఫిస్టులా, ఫిజర్స్‌కు సంబంధించిన చికిత్స చేస్తారు. దీంతో కొలాన్, రెక్టమ్ క్యాన్సర్‌లు ముదిరిపోయి ప్రాణాల మీదకు వస్తుంది. అందుకని పై వ్యాధులకు సంబంధించిన ఏ లక్షణాలు కనిపించినా వెంటనే వైద్యులను సంప్రదించాలి. వాళ్లు సూచించిన వైద్యపరీక్షలు చేయించుకోవాలి. ఇక దవాఖానల్లో మహిళా వైద్యులు కూడా అందుబాటులో ఉన్నారు. కాబట్టి మహిళలు ఇలాంటి వ్యాధుల విషయంలో బిడియానికి లోను కావాల్సిన అవసరం లేదు.

ఫిజర్స్

ఇది మలద్వారం లోపలి భాగంలో చర్మంపై చిన్నపాటి పగులులా ఏర్పడుతుంది. దీనివల్ల మల విసర్జనకు ముందు, తరువాత తీవ్రమైన నొప్పి, రక్తస్రావం, దురద ఏర్పడుతుంది. ఫిజర్స్‌కు సకాలంలో చికిత్స తీసుకోకపోతే అది ఫిస్టులాగా మారే అవకాశం ఉంటుంది.

కారణాలు

- మల విసర్జన సమయంలో ఒత్తిడి పడటం.
- అతిసారానికి (డయేరియా) గురైనప్పుడు తరచూ విరేచనాలు కావడం.
- మహిళల్లో ప్రసవ సమయంలో ఏర్పడిన ఒత్తిడి కారణంగా కూడా ఫిజర్స్ సమస్య రావచ్చు.



నిర్ధారణ- చికిత్స

వీఆర్ఎస్ (వీడియో రెక్టోస్కోపి) పరీక్ష ద్వారా సమస్యను నిర్ధారిస్తారు. ఈ సమస్యకు ఫిజరెక్టమీ పద్ధతి ద్వారా చికిత్స చేస్తారు.

కాన్‌స్టిపేషన్ (మలబద్ధకం)

ఆహారపు అలవాట్లు, జీవనశైలిలో మార్పుల కారణంగా ఈ సమస్య ఏర్పడుతుంది.

లక్షణాలు

- మలవిసర్జన సమయంలో తీవ్రమైన నొప్పి.
- రక్తస్రావం.
- శారీరక, మానసిక ఆందోళన.
- ఏకాగ్రత తగ్గడం.

చికిత్సా పద్ధతి


కొన్నిసార్లు... అంటే సమస్య ప్రారంభదశలో అయితే ఆహారపు అలవాట్లు, ఆహార పదార్థాలను మార్చుకుంటే సమస్య తీరిపోతుంది. కొన్ని సందర్భాల్లో మాత్రం రెక్టో ఆనల్ రిపేర్ (ఆర్ఏఆర్) చేయాల్సి ఉంటుంది.

... మహేశ్వర్‌రావు బండారి



డాక్టర్ మర్పల్లి సంహితారెడ్డి
ఎంబీబీఎస్, ఎంఎస్,
ఎఫ్ఎంఎఎస్, ఎఫ్ఐఎస్‌సీపీ
కన్సల్టెంట్ కొలరెక్టల్ సర్జన్
లక్స్ హాస్పిటల్, హైటెక్‌సిటీ రోడ్
హైదరాబాద్

కండ్లు పొడిబారడాన్ని కెరాటోకంజంక్టివైటిస్ సిక్కా అని కూడా అంటారు. కండ్లు తేమగా ఉండటానికి అశ్రుగ్రంథుల నుంచి తగినన్ని నీళ్లు విడుదల కాకపోవడం, విడుదలైనా అవి తొందరగా ఆవిరి కావడం వల్ల ఈ సమస్య తలెత్తుతుంది. ఇది... కండ్లు పొడిబారడం, దురదగా ఉండటం, ఎర్రబడటం, గరగరగా అనిపించడం, కొన్నిసార్లు చూపు మసకగా ఉండటం లాంటి ఇబ్బందులకు దారితీస్తుంది. వయసు పెరగడం, హార్మోన్లలో మార్పులు, ఎక్కువకాలం పాటు స్క్రీన్లకు అతుక్కుపోవడం, వాతావరణం పొడిగా ఉండటం, కొన్ని ప్రత్యేకమైన వైద్య సమస్యలు ఈ డ్రై ఐస్ సమస్యకు కారణాలు. కాగా, భారతీయ పురాతన వైద్య సంప్రదాయం ఆయుర్వేదంలో డ్రై ఐస్ లక్షణాలను తగ్గించడానికి, కంటిచూపు మెరుగుపర్చడానికి కొన్ని సహజమైన పరిష్కారాలు ఉన్నాయి.



కలబందలో మాయిశ్చరైజింగ్, యాంటీ ఇన్‌ఫ్లమేటరీ లక్షణాలు ఉంటాయి. కొంచెం కలబంద గుజ్జు (జెల్) తీసుకుని, దాన్ని కంటి చుట్టూ అప్లయ్ చేస్తే పొడిబారే సమస్య నుంచి ఉపశమనం దొరుకుతుంది. అయితే, ఈ గుజ్జు కండ్లకు తాకకుండా జాగ్రత్త వహించాలి.



శుభ్రంగా ఉన్న గుడ్డను తీసుకుని చల్లటి రోజ్ వాటర్‌లో ముంచాలి. దాన్ని ఓ పది పదిహేను నిమిషాల పాటు కండ్లు మూసి, కనురెప్పలపై ఉంచాలి. రోజ్ వాటర్‌కు కండ్లను చల్లబరిచే, మంట నుంచి ఉపశమనం కలిగించే గుణాలు ఉంటాయి. దీంతో కండ్లు పొడిబారడం, మంట తగ్గుతాయి.

మూసిన కండ్లపై కీరదోస చక్రాలను ఉంచినా కూడా డ్రై ఐస్, మంట సమస్యల నుంచి సత్వరమే ఉపశమనం లభిస్తుంది. సహజమైన యాంటీ ఆక్సిడెంట్లు, నీళ్ల శాతం ఎక్కువగా ఉండే కీరదోస చక్రాలను కండ్ల మీద ఓ 20 నిమిషాల వరకు ఉంచాలి.



గానుగ పట్టించిన ఆముదపు నూనెను ఒకచుక్క తీసుకుని కంటి చుట్టూ గుండ్రంగా రుద్దాలి. ఆముదపు నూనెకు లూబ్రికేటింగ్, యాంటీ ఇన్‌ఫ్లమేటరీ లక్షణాలు ఉంటాయి. ఇవి డ్రై ఐస్ సమస్యను తగ్గిస్తాయి.

నిర్ణీత సమయాల వ్యవధిలో కనురెప్పలు కొట్టడం కూడా కంటికి తగినంత తేమను అందిస్తుంది. కండ్లు పొడిబారడాన్ని నివారిస్తుంది. ముఖ్యంగా ఎక్కువ కాలంపాటు స్క్రీన్లను చూసే వాళ్లు ఇలా చేయడం ఎంతో మంచిది.

అవేవీ తల్లిపాలకు సరిపోలవు!

నాకు నాలుగు నెలల కిందట ఆడబిడ్డ పుట్టింది. మూడు కిలోల బరువు ఉంది. పుట్టినప్పటి నుంచి ఇప్పటివరకు తల్లిపాలు మాత్రమే ఇస్తూ వచ్చాను. ఇన్నాళ్లూ సెలవుల్లో ఉన్నాను. ఉద్యోగంలో జాయిన్ అవ్వాల్సి ఉంది. ఈ సమయంలో పాలు ఇవ్వడం కష్టం కదా! ఆవుపాలు, గేదెపాలు, ఫార్ములా పాలు వీటిలో ఏది పడితే మంచిదో సూచించగలరు?
• ఓ పాఠకురాలు



నాలుగు నెలలుగా బిడ్డకు తల్లిపాలు మాత్రమే ఇస్తున్నందుకు మిమ్మల్ని అభినందిస్తున్నాను. మారిన కాలమాన పరిస్థితుల కారణంగా.. మహిళలు ఉద్యోగాలు చేయడం సర్వసాధారణమైంది. ఈ క్రమంలో మీ బిడ్డకు పోతపాలు ఇవ్వాలని భావిస్తున్నారు. కానీ, ఆవుపాలు, గేదెపాలు, డబ్బాపాలు.. ఇవేవీ తల్లిపాలకు సరిపోలవు. అమ్మపాలు అమృతం కన్నా మిన్న. అందులో సజీవ కణాలు ఉంటాయి. బిడ్డకు సరైన పోషకాలు అందుతాయి. బిడ్డ అవసరానికి అనుగుణంగా మారే జీవ రసాయన ద్రవం తల్లిపాలు. జీవితాంతం బిడ్డకు రక్షణనిచ్చే దివ్యౌషధం. బిడ్డ ఆరోగ్యానికి పునాది అమ్మపాలే! ఒకరకంగా బిడ్డకు మొదటి వ్యాక్సినేషన్ అనొచ్చు. తల్లిపాలు తాగే క్రమంలో బిడ్డ అమ్మను హత్తుకుంటుంది. ఆ సమయంలో బిడ్డ మీద ఏదైనా బ్యాక్టీరియా ఉంటే.. అది తల్లిలోకి చేరుతుంది. దానికి విరుగుడుగా యాంటీబాడీస్ తయారై, పాల ద్వారా బిడ్డకు అందుతాయి. చిన్నప్పుడు తల్లిపాలు సమృద్ధిగా తాగిన పిల్లలకు ఇన్ఫెక్షన్లు తక్కువగా వస్తాయి. వారిలో రోగనిరోధక వ్యవస్థ బలంగా పనిచేస్తుంది. అంతే కాదు బిడ్డకు పాలు పట్టడం ద్వారా తల్లి బరువు తగ్గుతుంది. తల్లులకు క్యాన్సర్ రిస్క్ తగ్గుతుంది. బిడ్డకు మొదటి ఆరు నెలలు పూర్తిగా తల్లిపాలు మాత్రమే పట్టాలి. తర్వాత ఘనపదార్థాలు ఇవ్వొచ్చు. ఈ సమయంలోనూ పాలు ఇవ్వడం మానొద్దు. మీ సెలవులు మరో రెండు నెలలు కొనసాగించుకునే ప్రయత్నం చేయండి. అలా కుదరకపోతే.. ఆఫీస్‌కు వెళ్లడానికి ముందు, వచ్చిన తర్వాత తప్పకుండా పాలు ఇవ్వండి. మిగతా సమయాల్లో మెత్తటి ఘనపదార్థాలు ఇవ్వొచ్చు. దీంతోపాటు తల్లిపాలు తీసి.. ఫ్రిజ్‌లో దాచొచ్చు. ఇవి 24 గంటల పాటు నిల్వ ఉంటాయి. బిడ్డకు పట్టేముందు గోరువెచ్చగా చేసి పట్టొచ్చు. మీరు ఉద్యోగం చేసే చోటు ఇంటికి దగ్గరగా ఉన్నట్లయితే.. మధ్యాహ్నం వచ్చి పాలిచ్చే ప్రయత్నం చేయండి. పెద్ద సంస్థలో పనిచేస్తున్నట్లయితే.. మీ కార్యస్థలంలో బిడ్డకు పాలిచ్చే వసతి ఏర్పాటు చేయమని చెప్పండి. ఇంట్లోవాళ్లు ఎవరైనా బిడ్డను తీసుకువస్తే.. పాలివ్వొచ్చు. ఆరు నెలలు నిండే వరకైతే తల్లిపాలు మాత్రమే ఇవ్వండి. తర్వాత కూడా పైన సూచించిన సలహా మేరకు.. తల్లిపాలు రోజుకు రెండుసార్లు అయినా బిడ్డకు అందేలా జాగ్రత్త తీసుకోండి.



డాక్టర్ విజయానంద్
నియోనేటాలజిస్ట్ అండ్ పీడియాట్రీషియన్
రెయిన్‌బో చిల్డ్రన్స్ హాస్పిటల్స్

పేగులు బాగుండాలంటే..

ఆయాసం, వాంతులు, మలబద్ధకం, గ్యాస్, అవాంఛితంగా బరువు పెరగడం, బరువు తగ్గడం, నిద్రలేమి, అలసట ఇవన్నీ పేగుల అనారోగ్యాన్ని సూచిస్తాయి. ఇక పేగులను ఆరోగ్యంగా ఉంచడంలో ప్రొబయోటిక్ ఆహార పదార్థాలు ముఖ్య పాత్ర పోషిస్తాయి. వాటికోసం ఎక్కడో వెతకాల్సిన పన్లేదు. మన వంటల్లోనే ఉన్నాయి.

రసం: పప్పు, చింతపండు, మూలికలు, సుగంధ ద్రవ్యాలు రసం తయారీకి ముడి సరుకులు. వీటిలో ఎ, సి విటమిన్లు, మెగ్నీషియం, ఇనుము, కాల్షియం సమృద్ధిగా ఉంటాయి. రసంలో పీచు పదార్థాలూ ఉంటాయి. ఇవి జీర్ణ వ్యవస్థకు గొప్పగా ఉపయోగపడతాయి.


కఢీ: దీన్ని శనగపిండితో చేస్తారు. ఇందులో పుష్కలంగా ఉండే మెగ్నీషియం, ఫైబర్ పేగుల ఆరోగ్యానికి అత్యవసరం. కడుపు నొప్పి, మలబద్ధకం, బరువు తగ్గడానికి వంటింటి చిట్కా కఢీ.

మెంతికూర: బరువు తగ్గడం, మలబద్ధకం లాంటి పేగులకు సంబంధించిన సమస్యలలో మెంతులు ఎంతో సహాయకారి. ఈ ఆహార పదార్థాలకు అదనంగా వ్యాయామం, యోగా, తగినన్ని నీళ్లు పేగులను ఆరోగ్యంగా ఉంచడంలో కీలకపాత్ర పోషిస్తాయి.

విలువైనది విటమిన్ డి

చెమట పట్టడం సహజమైన ప్రక్రియ. ఇది మన శరీర ఉష్ణోగ్రతను క్రమబద్ధీకరిస్తుంది. శరీరం నుంచి టాక్సిన్లను బయటికి పంపిస్తుంది. అయితే చెమట మరీ ఎక్కువగా పడుతున్నదంటే మాత్రం ఆలోచించాల్సిన విషయమే. చెమట అతిగా పట్టడాన్ని హైపర్‌హైడ్రోసిస్ అంటారు. ఇది మనకు బయటికి కనిపించని ఆరోగ్య సమస్యలకు సంకేతం కావచ్చు అంటున్నారు వైద్యులు. వీటిలో విటమిన్ డి లోపం కూడా ఒకటి కావచ్చట.

శరీర ఉష్ణోగ్రతను క్రమబద్ధీకరించే క్రమంలో చెమట పట్టడం సహజంగా జరుగుతుంది. అయితే, ఏ పనీ చేయకపోయినా, వేడి వాతావరణంలో లేకపోయినప్పటికీ అతిగా చెమటలు పడుతున్నాయంటే అది ఆలోచించాల్సిన విషయమే. విటమిన్ డి మన చర్మంపై ఉన్న స్వేదగ్రంథుల పనితీరును నియంత్రిస్తుంది. అలా చెమట పట్టే ప్రక్రియను కూడా క్రమబద్ధం చేస్తుంది. ఈ విటమిన్ లోపించినప్పుడు స్వేదగ్రంథులు అతిగా క్రియాశీలమవుతాయి. దీంతో మోతాదుకు మించి చెమటపడుతుంది. అయితే, ఒక్క చెమట అతిగా పట్టడమే కాకుండా మరికొన్ని లక్షణాలు కూడా విటమిన్ డి లోపాన్ని సూచిస్తాయి. అవి...



అలసట: శరీరం శక్తి స్థాయులను నిర్వహించుకోవడంలో కూడా విటమిన్ డి కీలకపాత్ర పోషిస్తుంది. విటమిన్ డి తగినంతగా లేకపోతే మంచినిద్ర తర్వాత కూడా అలసటగా, మత్తుగా అనిపిస్తుంది.

కండరాల బలహీనత: కండరాల పెరుగుదలకు, వాటి సరైన పనితీరుకు విటమిన్ డి ఎంతో అవసరం. ఇది లోపిస్తే కండరాల బలహీనత పీడిస్తుంది. రోజువారీ పనులు చేసుకోవడం ఇబ్బందికరంగా మారుతుంది.

ఎముకల్లో నొప్పి: మన శరీరంలో ఎముకల ఆరోగ్యానికి కాల్షియం, ఫాస్ఫరస్ ఎంతో అవసరం. వీటిని శరీరం బాగా శోషించుకోవాలంటే విటమిన్ డి అవసరం. ఇది తగినంతగా అందకపోతే ఎముకలు గుల్లబారే ఆస్టియోపొరోసిస్ ప్రమాదమూ పొంచి ఉంటుంది.

ఇలా సరిదిద్దుకోవాలి..: విటమిన్ డి లోపం తలెత్తినప్పుడు డాక్టర్ల సూచన మేరకు సప్లిమెంట్లు వాడాలి. విటమిన్ డి సమృద్ధిగా ఉన్న ఆహార పదార్థాలు తీసుకోవాలి. అదనంగా, ఉదయపు ఎండలో కొంత సమయంపాటు గడిపితే శరీరంలో విటమిన్ డి స్థాయులు పెరుగుతాయి.



బ్లాక్ మండే

కుప్పకూలిన దేశీయ స్టాక్ మార్కెట్లు

అమెరికాలో మాంద్యం భయాలు • సెన్సెక్స్ 2,222, నిఫ్టీ 662 పాయింట్లు పతనం

ఒక్కరోజే రూ.15.32 లక్షల కోట్ల మదుపరుల సంపద ఆవిరి

ముంబై, ఆగస్టు 5: దేశీయ స్టాక్ మార్కెట్లు కుప్పకూలాయి. సోమవారం ఉదయం ట్రేడింగ్ మొదలు.. మధ్యాహ్నం ముగిసే వరకు మదుపరులు అమ్మకాలకే పెద్దపీట వేశారు. మాంద్యం గుప్పిట్లోకి అగ్రరాజ్యం అమెరికా పోనున్నదన్న అంచనాలు.. మార్కెట్ సెంటిమెంట్‌ను తీవ్రంగా దెబ్బతీశాయి. అలాగే ఇజ్రాయెల్-హమాస్ మధ్య యుద్ధ మేఘాలు, ఇతరత్రా కారణాలూ ప్రతికూల ప్రభావం చూపాయి. ఈ క్రమంలోనే బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ (బీఎస్ఈ) ప్రధాన సూచీ సెన్సెక్స్ 2,222.55 పాయింట్లు లేదా 2.74 శాతం కోల్పోయి 80వేల మార్కుకు దిగువన 78,759.40 వద్ద ముగిసింది. ఒకానొక దశలో 2,686.09 పాయింట్లు లేదా 3.31 శాతం పడిపోవడం గమనార్హం. నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ (ఎన్ఎస్ఈ) సూచీ నిఫ్టీ 662.10 పాయింట్లు లేదా 2.68 శాతం దిగజారి 24,055.60 వద్ద నిలిచింది. ఇంట్రా-డేలో 824 పాయింట్లు లేదా 3.33 శాతం క్షీణించింది. అటు సెన్సెక్స్, ఇటు నిఫ్టీ రెండింటికీ జూన్ 4 తర్వాత ఇదే అతిపెద్ద నష్టం. శుక్రవారం కూడా సెన్సెక్స్ 886, నిఫ్టీ 293 పాయింట్లు పతనమైన విషయం తెలిసిందే.



కుదేలైన బ్యాంకింగ్, ఐటీ షేర్లు

బ్యాంకింగ్, ఐటీ, మెటల్, చమురు-గ్యాస్ రంగాల షేర్లలో భారీగా అమ్మకాల ఒత్తిడి నెలకొన్నది. నిజానికి అన్ని రంగాల సూచీల్లో సెల్లింగ్ ప్రెషర్ కనిపించింది. సేవా రంగం 4.56 శాతం, యుటిలిటీస్ 4.30 శాతం, రియల్టీ 4.25 శాతం, క్యాపిటల్ గూడ్స్ 4.13 శాతం, ఇండస్ట్రియల్స్ 4.08 శాతం, విద్యుత్తు 3.91 శాతం, చమురు-గ్యాస్ 3.88 శాతం, కమోడిటీస్ రంగ షేర్లు 3.82 శాతం చొప్పున నష్టపోయాయి. టాటా మోటర్స్ షేర్ల విలువ గరిష్ఠంగా 7 శాతానికిపైగా పడిపోయింది. ఇక బీఎస్ఈ స్మాల్‌క్యాప్ 4.21 శాతం, మిడ్‌క్యాప్ 3.60 శాతం చొప్పున నష్టాలను చవిచూశాయి. బీఎస్ఈలో 3,414 షేర్లు నష్టాలకే పరిమితమయ్యాయి. 664 షేర్లు లాభపడగా, 111 షేర్లు యథాతథంగా ఉన్నాయి.

సెన్సెక్స్ టాప్-10 నష్టాలు

2024 జూన్ 4న	4,389.73
2020 మార్చి 23	3,934.72
2020 మార్చి 12	2,919.26
2020 మార్చి 16	2,713.41
2022 ఫిబ్రవరి 24	2,702.15
2024 ఆగస్టు 5	2,222.55
2020 మే 4	2,002.27
2020 మార్చి 9	1,941.67
2021 ఫిబ్రవరి 26	1,939.32
2022 ఫిబ్రవరి 14	1,747.08



• గ్లోబల్ మార్కెట్లలో..

ప్రపంచవ్యాప్తంగా అన్ని ప్రధాన దేశాల స్టాక్ మార్కెట్లలో అలజడి చెలరేగింది. ఆసియా మార్కెట్లలో దక్షిణ కొరియా, జపాన్, చైనా, హాంకాంగ్ సూచీలు పెద్ద ఎత్తున క్షీణించాయి. ముఖ్యంగా జపాన్ సూచీ నికీ 12.4 శాతం పడిపోయింది. మునుపెన్నడూ లేనివిధంగా 4,451.28 పాయింట్లు దిగజారి 31,458.42 వద్ద స్థిరపడింది. 1987 అక్టోబర్ 19న 3,836 పాయింట్లు నష్టపోయింది. ఇప్పటిదాకా నికీకి ఇదే భారీ నష్టం. అమెరికా ఉద్యోగ గణాంకాలు ఆశించిన స్థాయిలో లేకపోవడంతో అగ్రరాజ్యం మాంద్యం కోరల్లో చిక్కుకోనుందన్న భయాలు అంతటా వ్యాపించాయి. ఇది మదుపరులను పెట్టుబడుల ఉపసంహరణ దిశగా నడిపించింది. అటు ఐరోపా మార్కెట్లదీ ఇదే పరిస్థితి. బ్రిటన్, ఫ్రాన్స్, జర్మనీ సూచీలు నేలచూపుల్నే చూస్తున్నాయి. ఇక అమెరికా సూచీలు పెద్ద ఎత్తున క్షీణిస్తున్నాయి.

అమెరికాలో తలెత్తిన మాంద్యం భయాలు.. ప్రపంచ మార్కెట్లలో పెను ప్రకంపనల్నే సృష్టించాయి. జపాన్ సెంట్రల్ బ్యాంక్ నిర్ణయాలతో కరెన్సీ మార్కెట్‌లో ఆ దేశ కరెన్సీ యెన్ విలువ పెరిగింది. రక్షణాత్మక ధోరణిని అవలంభిస్తున్న ఇన్వెస్టర్లు ఈక్విటీ మార్కెట్ల క్రాష్‌కు కారకులయ్యారు.


-వినోద్ నాయర్, జియోజిత్ ఫైనాన్షియల్ సర్వీసెస్

అమెరికాలో జూలై ఉద్యోగ గణాంకాల నివేదిక.. అక్కడ మాంద్యం సంకేతాలను మార్కెట్‌లోకి పంపించింది. భౌ గోళిక రాజకీయ ఉద్రిక్తతలు ఈక్విటీ మా ర్కెట్లను కుప్పకూల్చాయి. ఇజ్రాయెల్-హమాస్ పోరులో ఇరాన్, అమెరికా జోక్యం.. పరిస్థితుల్ని మరింతగా దిగజార్చాయి.

-అజిత్ బెనర్జీ, శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్ కో

సెన్సెక్స్ నెక్స్ట్30

బీఎస్ఈ అనుబంధ విభాగం ఆసియా ఇండెక్స్ సోమవారం సెన్సెక్స్ నెక్స్ట్ 30 పేరిట ఓ కొత్త సూచీని ప్రకటించింది. ఇది సెన్సెక్స్‌లో లేని బీఎస్ఈ టాప్-100 స్టాక్స్ పనితీరును ట్రాక్ చేయనున్నది. ఫైనాన్షియల్ సర్వీసెస్, కన్స్యూమర్ డిస్క్రియేషనరీ, ఎనర్జీ, కమోడిటీస్, హెల్త్‌కేర్, ఇండస్ట్రీస్, ఎఫ్ఎంసీజీ, ఐటీ, యుటిలిటీస్ షేర్లు కొత్త ఇండెక్స్‌లో ఉంటాయి.



5 నష్టాలకు కారణాలు

- అమెరికా మాంద్యం భయాలు
- ఇజ్రాయెల్-హమాస్ మధ్య యుద్ధ మేఘాలు
- పెద్ద ఎత్తున జపాన్ ఇన్వెస్టర్ల షేర్ల అమ్మకాలు
- భారతీయ సూచీలు ఆల్‌టైమ్ హైల్లో ఉన్నందున ఏర్పడ్డ లాభాల స్వీకరణ
- నిరాశాజనక కార్పొరేట్ త్రైమాసిక ఆర్థిక ఫలితాలు

2 రోజుల్లో 20 లక్షల కోట్లు ఫట్

స్టాక్ మార్కెట్ల నష్టాలతో మదుపరులు లక్షల కోట్ల రూపాయల్లో కోల్పోవాల్సి వచ్చింది. బీఎస్ఈలో నమోదైన సంస్థల మార్కెట్ విలువ సోమవారం ఒక్కరోజే రూ.15.32 లక్షల కోట్లు హరించుకుపోయింది. అంతకుముందు శుక్రవారం కూడా నష్టాలు వాటిల్లగా ఈ రెండు రోజుల్లో మదుపరులు చేజార్చుకున్న సంపద విలువ రూ.19.78 లక్షల కోట్లుగా ఉండటం గమనార్హం. ప్రస్తుతం బీఎస్ఈ నమోదిత కంపెనీల మార్కెట్ విలువ రూ.4,41,84,150.03 కోట్లు (5.27 ట్రిలియన్ డాలర్లు)గా ఉన్నది. ఈ ఒక్కరోజే రిలయన్స్ ఇండస్ట్రీస్ మార్కెట్ విలువ రూ.70,195 కోట్లు, టాటా మోటర్స్ మార్కెట్ విలువ రూ.42,461 కోట్లు ఆవిరైపోయింది.



లాభపడ్డ షేర్లు	
హిందుస్థాన్ యూనీలివర్	+1.17%
నెస్లే ఇండియా	+0.95%
-	-
-	-
-	-

నష్టాల్లోని షేర్లు	
టాటా మోటర్స్	-7.32%
అదానీ పోర్ట్స్	-5.93%
టాటా స్టీల్	-5.31%
ఎస్బీఐ	-4.34%
పవర్‌గ్రిడ్	-4.19%



లాభపడ్డ షేర్లు	
హిందుస్థాన్ యూనీలివర్	+1.02%
టాటా కన్స్యూమర్స్	+0.70%
నెస్లే ఇండియా	+0.68%
బ్రిటానియా	+0.51%
హెచ్‌డీఎఫ్‌సీ లైఫ్	+0.21%

నష్టాల్లోని షేర్లు	
టాటా మోటర్స్	-7.40%
ఓఎన్జీసీ	-6.39%
అదానీ పోర్ట్స్	-5.92%
టాటా స్టీల్	-5.61%
హిందాల్కో	-5.25%

రూపాయి..ఢమాల్

ఒకేరోజు 37 పైసలు పడిపోయిన విలువ

ముంబై, ఆగస్టు 5: దేశీయ కరెన్సీకి భారీగా చిల్లులు పడ్డాయి. అంతర్జాతీయ స్టాక్ మార్కెట్లు భారీగా కుదుపునకు లోనుకావడం, మధ్యతూర్పు దేశాల్లో అనిశ్చిత పరిస్థితులు నెలకొనడంతో ఫారెక్స్ మార్కెట్లో అలజడికి కారణమైంది. దీంట్లోభాగంగా రూపాయి విలువ చారిత్రక కనిష్ఠ స్థాయి 84కి జారుకున్నది. డాలర్‌తో పోలిస్తే మారకం విలువ సోమవారం ఒకేరోజు 37 పైసలు పడిపోయి 84.09 వద్ద ముగిసింది. 83.78 వద్ద ప్రారంభమైన రుపీ ట్రేడింగ్ ఇంట్రాడేలో 83.76 గరిష్ఠ స్థాయికి చేరుకున్నది. 84కి పడిపోవడంతో ఫారెక్స్ మార్కెట్లో ఇదే తొలిసారి కావడం విశేషం.



కంట్రోల్‌ఎస్ 400 కోట్ల పెట్టుబడి

హైదరాబాద్, ఆగస్టు 5: డాటా సెంటర్ల నిర్వహణ సంస్థ కంట్రోల్‌ఎస్..రూ.400 కోట్ల పెట్టుబడితో పాట్నాలో గ్రీన్‌ఫీల్డ్ డాటా సెంటర్‌ను ఏర్పాటు చేయబోతున్నట్లు ప్రకటించింది. ఇందుకోసం భూమిని కొనుగోలు చేసినట్లు కంపెనీ ప్రతినిధి ఒకరు తెలిపారు. వెయ్యి మంది కూర్చోవడానికి వీలుండే ఈ డాటా సెంటర్ వచ్చే ఏడాది అందుబాటులోకి రానున్నట్లు పేర్కొంది. ఇప్పటికే సంస్థకు హైదరాబాద్‌తోపాటు ముంబై, నోయిడా, చెన్నై, బెంగళూరు, కోల్‌కతా, లక్నో, పాట్నాల్లో డాటా సెంటర్లు నిర్వహిస్తున్నది.

ప్రియంకానున్న బ్రిటానియా ఉత్పత్తులు!

కోల్‌కతా, ఆగస్టు 5: మరోసారి ధరలు పెంచడానికి సిద్ధమైంది బ్రిటానియా ఇండస్ట్రీస్ లిమిటెడ్. ముడి సరుకుల ధరలతోపాటు కోకా, చక్కెర ధరలు అధికమవడంతో తమ ఉత్పత్తుల ధరల పెంచకతప్పడం లేదని బ్రిటానియా వైస్ చైర్మన్, ఎండీ వరుణ్ బెర్రీ తెలిపారు. ఏయే బ్రాండ్ల ధరలు పెంచేదానిపై ప్రస్తుతం చర్చలు జరుగుతున్నాయని, ఈ ముడి సరుకులు అత్యధికంగా వినియోగిస్తున్న ఉత్పత్తులను అతి త్వరలో పెంచనున్నట్లు చెప్పారు. ధరలు పెంచితే అమ్మకాలపై స్వల్పంగా ప్రభావం చూపే అవకాశం ఉన్నదని, ముఖ్యంగా గ్రామీణ ప్రాంత కస్టమర్లు చౌకైన ఉత్పత్తులవైపు మొగ్గుచూపే అవకాశాలున్నాయన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో కంపెనీ ఉత్పత్తులకు డిమాండ్ పెరిగిందని కొత్తగా 28 లక్షల అవుట్‌లెట్లకు ఉత్పత్తులను సరఫరా చేస్తున్నట్లు చెప్పారు.

రిలయన్స్ ర్యాంక్ @ 86

ఫార్చ్యూన్ గ్లోబల్ 500 జాబితాలో

న్యూఢిల్లీ, ఆగస్టు 5: రిలయన్స్ ఇండస్ట్రీస్ మరో ఖ్యాతిని సాధించింది. ఫార్చ్యూన్ గ్లోబల్ 500 జాబితాలో భారత్ నుంచి అత్యధిక ర్యాంక్‌ను పొందిన సంస్థగా రిలయన్స్ చరిత్ర సృష్టించింది. 2024కిగాను రిలయన్స్‌క 86వ స్థానం వరించింది. క్రితం ఏడాది వచ్చిన 88 ర్యాంక్‌తో పోలిస్తే రెండు ర్యాంకులు ఎగబాకి ఈ స్థానం దక్కించుకున్నది. గడిచిన మూడేండ్లలో తన ర్యాంక్‌ను 69 మెరుగుపరుచుకున్నది. 2021లో 155వ స్థానంలో ఉన్న రిలయన్స్..2024లో 86వ స్థానానికి ఎగబాకింది. గడిచిన 21 ఏండ్లుగా ఫార్చ్యూన్ 500 జాబితాలో రిలయన్స్ ఉండటం విశేషం. గడిచిన ఆర్థిక సంవత్సరానికిగాను 108.8 బిలియన్ డాలర్ల ఆదాయంపై 8.4 బిలియన్ డాలర్ల నికర లాభాన్ని గడించింది. మరోవైపు ఈ జాబితాలో భారత్‌కు చెందిన తొమ్మిది సంస్థలకు చోటు లభించగా, వీటిలో ఐదు ప్రభుత్వరంగ సంస్థలు ఉండటం విశేషం. వీటిలో బీమా దిగ్గజం ఎల్ఐసీ తన ర్యాంక్‌ను 12 స్థానాలు మెరుగుపరుచుకొని 95వ స్థానానికి చేరుకున్నది.

తొలిస్థానంలోనే వాల్‌మార్ట్

అమెరికా రిటైల్ దిగ్గజం వాల్‌మార్ట్ తన తొలి స్థానాన్ని పదిలపరుచుకున్నది. వరుసగా 11వ సారి ఇదే స్థానంలో కొనసాగుతుండటం విశేషం. అలాగే అమెజాన్ ర్యాంక్ రెండు స్థానాలు ఎగబాకి రెండో స్థానానికి చేరుకున్నది. 2023లో రెండో స్థానంలో ఉన్న సౌదీ అరామ్‌కో ఈసారి నాలుగో స్థానానికి పడిపోయింది. చైనాకు చెందిన స్టేట్ గ్రిడ్‌కు మూడో స్థానం వరించింది.

ఫార్చ్యూన్ గ్లోబల్ 500 జాబితాలో దేశీయ సంస్థలు



కంపెనీ	ర్యాంక్
రిలయన్స్	86
ఎల్ఐసీ	95
ఐవోసీ	116
ఎస్బీఐ	178
ఓఎన్జీసీ	180
బీపీసీఎల్	258
టాటా మోటర్స్	271
హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్	306
రాజేశ్ ఎక్స్‌పోర్ట్స్	463

ఎయిర్‌టెల్ లాభం మూడింతలు

న్యూఢిల్లీ, ఆగస్టు 5: దేశీయ టెలికం దిగ్గజాల్లో ఒకటైన భారతీ ఎయిర్‌టెల్ లాభాలు వాయువేగంతో దూసుకుపోయాయి. జూన్‌తో ముగిసిన మూడు నెలల కాలానికిగాను సంస్థ రూ.4,160 కోట్ల కన్సాలిడేటెడ్ నికర లాభాన్ని గడించింది. ఏడాది క్రితం ఇదే త్రైమాసికంలో వచ్చిన రూ.1,612.5 కోట్ల కంటే రెండున్నర రెట్లు అధికం. సమీక్ష కాలంలో కంపెనీ కన్సాలిడేటెడ్ ఆదాయం 2.8 శాతం అధికమై రూ.38,506.4 కోట్లకు చేరుకున్నది.

- ఒక్కో కస్టమర్ డాటా వినిమయం 23.7 జీబీలకు చేరుకున్నది.
- సరాసరిగా ఒక్కో కస్టమర్‌పై సమకూరే ఆదాయం 5.4 శాతం వృద్ధితో రూ.200 నుంచి రూ.211కి చేరుకున్నది.
- కంపెనీ రుణాలు 14 శాతం ఎగబాకి రూ.31,098 కోట్లకు చేరుకున్నాయి.

12 రూట్లలో ఇండిగో బిజినెస్ క్లాస్ సీట్లు

న్యూఢిల్లీ, ఆగస్టు 5: దేశీయ విమానయాన దిగ్గజం ఇండిగో..సరికొత్తగా బిజినెస్ క్లాస్ సీట్లను ప్రవేశపెట్టబోతున్నది. నవంబర్ 14 నుంచి అందుబాటులోకి రానున్న ఈ సీట్లను తొలి దశలో 12 రూట్లలో ప్రవేశపెట్టబోతున్నట్లు ఇండిగో సీఈవో పీటర్ ఎల్బర్స్ తెలిపారు. విమాన సేవలు ఆరంభించి 18 ఏండ్లు పూర్తైన సందర్భంగా ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ..బిజినెస్ క్లాస్ సీట్లతోపాటు అంతర్జాతీయ రూట్లలో విమానాల సంఖ్యను పెంచబోతున్నట్లు ప్రకటించారు. ఈ బిజినెస్ క్లాస్ టికెట్ ప్రారంభ ధరను రూ.18,018గా నిర్ణయించింది సంస్థ. ఏ321 నియో విమానాల్లో మూడు వరుసల్లో నాలుగు సీట్ల చొప్పున 12 సీట్లను అందుబాటులోకి తీసుకురాబోతున్నది. ఈ విమానాల్లో మొత్తం సీట్లు 220 కాగా, దీంట్లో 12 బిజినెస్ సీట్లు, 208 ఎకానమి క్లాస్ సీట్లు. ఈ బిజినెస్ సీట్లు మంగళవారం నుంచి బుకింగ్ చేసుకోవచ్చునని సూచించారు. తొలి దశలో ఢిల్లీ-ముంబై రూట్లలో అందుబాటులోకి రానున్నది.

చైనాలో తగ్గుతున్న వివాహాలు

ఆందోళనలో అధికారులు!

బీజింగ్: చైనాలో యువతీ, యువకులు వివాహ బంధంలో ప్రవేశించడానికి విముఖంగా ఉన్నారు. ఒకప్పుడు జనాభాను తగ్గించేందుకు కఠినంగా వ్యవహరించిన ప్రభుత్వం ఇప్పుడు పిల్లల్ని కన్నవారికి ప్రోత్సాహకాలు ఇస్తామన్నా యువత పట్టించుకోవడం లేదు. దీంతో జననాల రేటు పతనమవుతుండగా, వృద్ధుల రేటు పెరిగిపోతున్నది. ఈ ఏడాది మొదటి ఆరు నెలల్లో కేవలం 34 లక్షల జంటలు మాత్రమే వివాహం చేసుకున్నాయని, గత ఏడాది ఇదే కాలంలో 38.98 లక్షల జంటలు ఒక్కటయ్యాయని ఆ దేశ అధికారులు చెప్పారు. ఉద్యోగాల్లో స్థిరపడిన తర్వాతే పెండ్లి చేసుకోవాలని యువత భావిస్తుండటం పెద్ద సమస్యగా మారిందని వారు ఆందోళన చెందుతున్నారు. పెండ్లిండ్ల సంఖ్య 2014 నుంచి క్రమంగా తగ్గుతున్నదని, కొవిడ్-19 మహమ్మారి తర్వాత మరింత పతనమవుతున్నదని చైనా ప్రభుత్వం ఆవేదన వ్యక్తం చేస్తున్నది. ఈ పరిస్థితిని చక్కదిద్దేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతున్నదని, పెండ్లి చేసుకున్నవారికి, పిల్లలకు జన్మనిచ్చినవారికి ప్రోత్సాహకాలను ప్రకటించిందని అధికారులు చెప్పారు.

కేజ్రీవాల్‌కు హైకోర్టులో చుక్కెదురు



న్యూఢిల్లీ, ఆగస్టు 5: ఢిల్లీ సీఎం, ఆప్ అధినేత అరవింద్ కేజ్రీవాల్‌కు ఢిల్లీ హైకోర్టులో చుక్కెదురైంది. మద్యం పాలసీ కేసులో సీబీఐ తనను అరెస్టు చేయడాన్ని సవాల్ చేస్తూ కేజ్రీవాల్ దాఖలు చేసిన పిటిషన్‌ను న్యాయమూర్తి జస్టిస్ నీనా బన్సల్ కృష్ణ సోమవారం తోసిపుచ్చారు. ఆయన బెయిల్ పిటిషన్‌ను కూడా కొట్టివేసిన హైకోర్టు.. బెయిల్ కోసం ట్రయల్ కోర్టుకు వెళ్లే అవకాశం కల్పించింది. అరెస్టు సవాల్ పిటిషన్, బెయిల్ పిటిషన్లపై విచారణ జరిపిన కోర్టు తీర్పులను వరుసగా గత నెల 17, 29న రిజర్వ్ చేసింది. ఈడీ నమోదు చేసిన మనీలాండరింగ్ కేసులో తీహార్ జైల్లో జ్యుడీషియల్ కస్టడీలో ఉన్న కేజ్రీవాల్‌ను సీబీఐ జూన్ 26న అరెస్టు చేసింది.

నేరానికి, విధాన నిర్ణయానికి మధ్య గీత ఎలా గీయాలి?


ఢిల్లీ మద్యం పాలసీలో అవినీతి, మనీ లాండరింగ్ ఆరోపణలతో ఈడీ అరెస్ట్ చేసిన మాజీ డిప్యూటీ సీఎం సిసోడియా బెయిల్ విచారణ సందర్భంగా సుప్రీం కోర్టు ఈడీకి పలు ప్రశ్నలను సంధించింది. నేరానికి, విధాన నిర్ణయానికి మధ్య విభజన రేఖ ఎలా గీయాలని ఈడీని ప్రశ్నించింది. ప్రజల ద్వారా ఎన్నికైన ప్రభుత్వంలోని కేబినెట్ తీసుకున్న నిర్ణయంలో అనుమానాలు పెరగడానికి లాభాల్లో మార్జిన్‌లు పెరగడమే ప్రాతిపదిక అయితే మంత్రివర్గం ఎలా పనిచేస్తుందని జస్టిస్ బీఆర్ గవయ్, జస్టిస్ కేవీ విశ్వనాథ్‌ల ధర్మాసనం ప్రశ్నించింది. ఇదిచట్టబద్ధమైన విధాన నిర్ణయాలు, నేర చర్యల మధ్య తేడాను ఎలా చూపుతుందని ప్రశ్నించింది. ప్రజాప్రయోజనాలకు విరుద్ధంగా ఉన్న, లేదా ప్రజాప్రయోజనాలకు విరుద్ధంగా ఉండాలనే చర్య ఇతరులకు అసమాన లాభాలకు దారితీస్తుందని ధర్మాసనం వ్యాఖ్యానించింది.

ఆప్ సర్కారుకు సుప్రీంలో ఎదురుదెబ్బ

ఢిల్లీ మున్సిపల్ కార్పొరేషన్‌లో సభ్యులను నామినేట్ చేసే విషయంలో లెఫ్టినెంట్ గవర్నర్ ఢిల్లీ ప్రభుత్వ మంత్రిమండలి సలహాలను పాటించాల్సిన అవసరం లేదని సుప్రీం కోర్టు సోమవారం తీర్పు చెప్పింది. ఎంసీడీలో 10 మంది సభ్యులను ఢిల్లీ మంత్రి మండలి సలహా తీసుకోకుండా ఏకపక్షంగా నియమిస్తూ ఢిల్లీ ఎల్జీ తీసుకున్న నిర్ణయాన్ని సవాల్ చేస్తూ ఢిల్లీ ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్‌ను చీఫ్ జస్టిస్ చంద్రచూడ్ నేతృత్వంలోని ధర్మాసనం కొట్టివేసింది. ఈ కేసు వాదోపవాదాలు పూర్తయిన 15 నెలల అనంతరం సోమవారం తీర్పు వెలువరించింది. 1993లో సవరించిన ఢిల్లీ మున్సిపల్ చట్టం ప్రకారం లెఫ్టినెంట్ గవర్నర్ ఎంసీడీలో సభ్యులను నియమించవచ్చునని, దీనికి ప్రభుత్వ అనుమతి, సలహా అవసరం లేదని సుప్రీం కోర్టు పేర్కొంది.

మానసిక అస్వస్థతతోనే ఆత్మహత్యాయత్నం

అమెరికా మహిళ కేసులో బయటపడ్డ నిజం



ముంబై ఆగస్టు 5(నమస్తే తెలంగాణ): మహారాష్ట్ర సింధుదుర్గ్ జిల్లా సావంత్ వాడి అడవిలో కనిపించిన అమెరికన్ మహిళ లలితా కుమార్ ఎస్కే కేసులో అసలు విషయం బయటపడింది. మానసిక అనారోగ్యంతో తానే ఆత్మహత్య చేసుకునేందుకు ప్రయత్నించానని, తన భర్త తనను అడవిలో కట్టి వేసినట్టు అబద్ధం చెప్పానని ఆమె అంగీకరించింది. అయితే, అర్ధాంతరంగా జీవితాన్ని ముగించడం తప్పు అని భావించి, రక్షించమని తాను అరచినట్లు తెలిపింది. తనకు పెండ్లి కాలేదని, గత పదేళ్లుగా తమిళనాడులో ఉంటున్నానని ఆమె చెప్పింది. సోనుర్లీ అడవిలో గొలుసులతో బంధించబడిన లలిత కేసును దర్యాప్తు చేసినపుడు తమిళనాడు పోలీసులకు ఆమె చెప్పిన చిరునామా తప్పు అని తేలింది. ఆ మహిళ తన మాజీ భర్తగా పేర్కొన్న వ్యక్తి ఎవరూ తమిళనాడు చిరునామాలో లేనట్లు వెల్లడైంది. అమెరికన్ ఎంబసీ పర్యవేక్షించిన ఈ కేసులో లలితా కుమార్ నిజం ఒప్పుకోవడంతో రత్నగిరి పోలీసులు ఊపిరి పీల్చుకున్నారు.

నివురుగప్పిన నిప్పులా గల్ఫ్

- ఇజ్రాయెల్‌పై ఏ క్షణంలోనైనా దాడి!
- సిద్ధమైన ఇరాన్, హెజ్బొల్లా గ్రూపు
- జీ7 దేశాల మంత్రుల సమావేశంలో అమెరికా మంత్రి బ్లింకెన్ వెల్లడి



వాషింగ్టన్/టెహ్రాన్/టెల్‌అవివ్, ఆగస్టు 5: ఇజ్రాయెల్-హమాస్ మధ్య గత పది నెలలుగా కొనసాగుతున్న యుద్ధం మరింత విస్తృతం కానున్నదనే అంచనాల నేపథ్యంలో పశ్చిమాసియాలో పరిస్థితి నివురు గప్పిన నిప్పులా ఉంది. గతవారం ఇజ్రాయెల్ వేర్వేరుగా జరిపిన దాడుల్లో ఇరాన్‌లో హమాస్ చీఫ్ ఇస్మాయిల్ హనియా, లెబనాన్‌లోని బీరుట్‌లో హెజ్బొల్లా టాప్ కమాండర్ ఫాద్ షుక్రు మృతి చెందిన విషయం తెలిసిందే. ఇజ్రాయెల్‌పై ప్రతీకారం తీర్చుకుంటామని ఇరాన్, హెజ్బొల్లా ప్రకటించిన నేపథ్యంలో తీవ్ర ఉద్రిక్తతలు నెలకొన్నాయి. ఏ క్షణంలో ఎక్కడి నుంచి దాడులు జరుగుతాయో చెప్పలేని పరిస్థితి నెలకొన్నది. తాజా పరిస్థితులపై అమెరికా విదేశాంగ శాఖ మంత్రి ఆంటోనీ బ్లింకెన్ జీ7 దేశాల మంత్రులతో మాట్లాడినట్టు సోమవారం అమెరికా మీడియా వెల్లడించింది. ఇరాన్, హెజ్బొల్లా రానున్న 24 నుంచి 48 గంటల్లో ఇజ్రాయెల్‌పై ఏ క్షణమైనా దాడి చేసే అవకాశం ఉన్నట్టు ఆయన చెప్పినట్టు తెలిపాయి. ఉద్రికత్తలను చల్లార్చేందుకు, దాడులను తగ్గించేందుకు ఇరాన్, హెజ్బొల్లాను ఒప్పించేలా అమెరికా ప్రయత్నం చేస్తున్నదని బ్లింకెన్ వారికి వివరించారు. పశ్చిమాసియాలో నెలకొన్న ఉద్రిక్తతలపై ఆందోళన వ్యక్తం చేస్తూ, అందరూ సంయమనం పాటించాలని విజ్ఞప్తి చేస్తూ జీ7 దేశాల విదేశాంగ మంత్రులు సోమవారం ఓ ప్రకటన విడుదల చేశారు.

ఇజ్రాయెల్‌ను తగిన విధంగా శిక్షిస్తాం: ఇరాన్

తాజా పరిణామాల నేపథ్యంలో ఇరాన్ విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి నస్సేర్ కనాని కీలక వ్యాఖ్యలు చేశారు. ప్రాంతీయ ఉద్రిక్తతలు రెచ్చగొట్టాలని తాము అనుకోవడం లేదని, అయితే తదుపరి అస్థిరత పరిస్థితులను నియంత్రించేందుకు ఇజ్రాయెల్‌ను తగిన విధంగా శిక్షించాల్సిన అవసరం ఉన్నదని అన్నారు. తమ దేశ రాజధాని టెహ్రాన్‌లో హనియాను హత్య చేయడం అంతర్జాతీయ చట్ట ఉల్లంఘన అని ఆయన పేర్కొన్నారు. ఇరాన్ జాతీయ భద్రత, సార్వభౌమాధికారాన్ని సంరక్షించుకొనే హక్కు ఇరాన్‌కు ఉన్నదని అన్నారు.

మాకు అండగా నిలవాలి: ఇజ్రాయెల్

మరోవైపు ప్రస్తుత సమయంలో ఇజ్రాయెల్‌కు అండగా నిలవాలని ఆ దేశ రక్షణ శాఖ మంత్రి యోవ్ గాల్లంట్ తమ మిత్ర దేశాలను కోరారు. ఇరాన్, దాని మద్దతు గ్రూపుల నుంచి పొంచివున్న ముప్పుపై ఇటలీ రక్షణ శాఖ మంత్రితో మాట్లాడినట్టు గాల్లంట్ సోమవారం ఎక్స్ పోస్టులో వెల్లడించారు.

ఉద్రిక్తతలతో పలు దేశాలు అప్రమత్తం


ఇజ్రాయెల్, లెబనాన్, పాలస్తీనాకు ప్రయాణాలు చేయొద్దని ఐర్లాండ్ ప్రధాన మంత్రి సిమన్ హారిస్ తమ దేశ పౌరులకు సూచించారు. లెబనాన్‌లోని తమ పౌరులు ఆ దేశాన్ని వీడాలని జపాన్ విదేశాంగ శాఖ కూడా హెచ్చరికలు చేసింది. ఇదేవిధంగా ఇప్పటికే పలు దేశాలు అడ్వైజరీ జారీచేసిన విషయం తెలిసిందే. మరోవైపు ఈ నెల 7 వరకు తాము ఇరాన్, ఇరాక్ గగనతలాన్ని వినియోగించబోమని జర్మనీకి చెందిన లుఫ్తాన్సా ఎయిర్‌లైన్స్ తెలిపింది. పశ్చిమాసియాలో తక్షణం ఉద్రిక్తతలు తగ్గాల్సిన అవసరం ఉన్నదని ఐరాస మానవ హక్కుల హైకమిషనర్ వోల్కర్ తుర్క్ పిలుపునిచ్చారు.

అమెరికా అధ్యక్షుడు బైడెన్ సమీక్ష

పశ్చిమాసియాలో తాజా పరిస్థితులపై సమీక్షించేందుకు అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ జాతీయ భద్రతా మండలితో సమావేశం కానున్నట్టు వైట్‌హౌస్ వెల్లడించింది. జోర్డాన్ రాజు అబ్దుల్లాతోనూ ఆయన చర్చించనున్నట్టు తెలిపింది.

పార్క్‌లో నేలమీద పడుకుని..

'ఒలింపిక్ గ్రామం'లో వసతుల కొరత • ఇటలీ స్విమ్మర్ వినూత్న నిరసన • పట్టించుకోని నిర్వాహకులు



పారిస్: విశ్వక్రీడల నిర్వహణను ప్రతిష్టాత్మకంగా తీసుకున్న ఫ్రాన్స్ స్టేడియాల పునరుద్ధరణ, పారిస్ నగర సుందరీకరణ పెట్టిన దృష్టి క్రీడాకారులు ఉండే 'ఒలింపిక్ విలేజ్'పై మాత్రం పెట్టడం లేదు. ఇక్కడ వసతుల కొరత అథ్లెట్లను తీవ్రంగా వేధిస్తోంది. పారిస్‌లో ప్రస్తుతం ఎండలు మండుతుండగా ఒలింపిక్ గ్రామంలో ఏసీలు లేక ఉక్కపోతతో అథ్లెట్లు అల్లాడుతున్నారు. తాజాగా ఇటలీకి చెందిన స్విమ్మర్ థామస్ సెకాన్ ఒలింపిక్ విలేజ్‌లో ఉండలేక అక్కడికి సమీపంలో ఉన్న పార్క్‌కు వెళ్లి నేలమీదే టవల్ వేసుకుని పడుకున్న ఫోటోలు నెట్టింట వైరల్ అవుతున్నాయి. తాజా ఎడిషన్‌లో థామస్ వంద మీటర్ల బ్యాక్‌స్ట్రోక్ ఈవెంట్‌లో స్వర్ణం గెలవగా పురుషుల 4X100 మీటర్ల ఫ్రీస్టయిల్ ఈవెంట్‌లో కాంస్యం నెగ్గి రెండు పతకాలు సాధించాడు. ఒలింపిక్ విలేజ్‌లో తనకు అసౌకర్యంగా ఉందని థామస్ పలుమార్లు నిర్వాహకులను కోరినా వాళ్లు మాత్రం పట్టించుకోలేదు. పగలు నిద్ర లేకపోవడంతో ఫ్రీస్టయిల్ ఈవెంట్‌లో తన ప్రదర్శన ఆశించినస్థాయిలో లేదని అతడు వాపోయాడు. 'ఒలింపిక్ విలేజ్‌లో ఏసీ లేదు. అక్కడ చాలా వేడిగా ఉంది. అథ్లెట్లకు ఇచ్చే ఆహారం కూడా దారుణంగా ఉంది. ఇందుకే చాలామంది అథ్లెట్లు అక్కడ్నుంచి వేరే చోటకు వెళ్లి ఉంటున్నారు. ఇది చూసీ చూడకుండా వదిలేయాల్సిన విషయం కాదు. అందరికీ తెలియాల్సిన వాస్తవం. ఇక్కడ మధ్యాహ్నం కాసేపు కునుకు తీద్దామంటే వేడి, ఉక్కపోతకు తోడు అనవసర శబ్దాలతో అది సాధ్యపడటం లేదు. అందువల్లే నేను ఫ్రీస్టయిల్ ఈవెంట్‌లో ఫైనల్ చేరలేకపోయాను' అని తెలిపాడు. అమెరికా టెన్నిస్ ప్లేయర్ కోకో గాఫ్‌తో పాటు మరికొంతమంది బహిరంగంగానే ఒలింపిక్ విలేజ్‌లో వసతుల కొరతపై వ్యాఖ్యానించినా నిర్వాహకులు మాత్రం చూసీ చూడనట్టు వ్యవహరించడం విమర్శలకు దారితీస్తోంది. భారత క్రీడా మంత్రిత్వ శాఖ సైతం మన అథ్లెట్ల కోసం ప్రత్యేకంగా 40 పోర్టబుల్ ఏసీలను పంపిన విషయం విదితమే. వసతుల లేమి ఆటగాళ్ల ప్రదర్శనను తీవ్రంగా ప్రభావం చూపుతోందనడానికి తాజా ఘటనే నిదర్శనం.



చేరువగా వచ్చి.. చేజారి

- కాంస్య పోరులో ఓడిన లక్ష్యసేన్
- షూటింగ్ మిక్స్‌డ్ టీమ్‌లో వెంటాడిన దురదృష్టం

క్వార్టర్స్‌లో నిషా దహియా నిష్క్రమణ.. టేబుల్ టెన్నిస్ టీమ్ ఈవెంట్‌లో ముందంజ

పారిస్ ఒలింపిక్స్‌లో ఆరు రోజుల వ్యవధిలోనే మూడు పతకాలు సాధించిన భారత క్రీడాకారులు అడుగులు మళ్లీ ఆ దిశగా సాగడం లేదు. పదో రోజు ఆటల్లో భాగంగా దేశానికి రెండు పతకాలు అందినట్టే అంది త్రుటిలో చేజారాయి. బ్యాడ్మింటన్‌లో లక్ష్యసేన్ తొలి గేమ్ గెలిచి 'ఇక పతకం ఖాయమే' అనుకుంటున్న తరుణంలో గాడి తప్పితే.. స్కీట్ షూటింగ్ మిక్స్‌డ్ టీమ్ ఈవెంట్‌లో భారత్ ఒకే ఒక్క పాయింట్ తేడాతో పతకం కోల్పోయింది. సోమవారం నుంచి మొదలైన రెజ్లింగ్ పోటీలను తొలి రోజే భారత్ ఓటమితో ఆరంభించింది. టేబుల్ టెన్నిస్ టీమ్‌ఈవెంట్‌లో మన ప్యాడ్లర్లు క్వార్టర్స్ చేరారు.

పారిస్: విశ్వక్రీడల పదో రోజు పోటీల్లో భారత్‌కు మరో రెండు పతకాలు అందినట్టే అంది త్రుటిలో చేజారాయి. పురుషుల బ్యాడ్మింటన్‌లో కాంస్య పోరుకు అర్హత సాధించిన తొలి ఆటగాడిగా రికార్డులకెక్కిన యువ షట్లర్ లక్ష్యసేన్ పతకం గెలిచి చరిత్ర సృష్టించే అవకాశాన్ని చేజేతులా జారవిడుచుకున్నాడు. కాంస్య పతక పోరులో సేన్ 21-13, 16-21, 11-21తో లీ జి జియా (మలేషియా) చేతిలో ఓడాడు. తొలి గేమ్‌ను అలవోకగా గెలుచుకున్న సేన్ రెండో గేమ్ ఆరంభంలోనూ అదరగొట్టాడు. అతడు 7 పాయింట్ల వద్ద ఉండగా ప్రత్యర్థి 2 పాయింట్లతో వెనుకబడి సేన్‌ను ఎదుర్కోవడానికి ఇబ్బందిపడ్డట్టే కనిపించాడు. కానీ ఆ తర్వాత లీ క్రమంగా పుంజుకుని భారత షట్లర్‌కు షాకిచ్చాడు. ఇక నిర్ణయాత్మక మూడో గేమ్‌లోనూ జియా అదే దూకుడును కొనసాగిస్తూ గేమ్‌తో పాటు కాంస్యాన్ని సొంతం చేసుకున్నాడు. ఆట మధ్యలో కుడిచేయి మోచేతి వద్ద గాయం లక్ష్యసేన్‌ను పదే పదే వేధించడమూ అతడి ఏకాగ్రతను దెబ్బతీసింది. ఇక బ్యాడ్మింటన్ పురుషుల ఫైనల్‌లో డెన్మార్క్ షట్లర్ విక్టర్ అక్సెల్సెన్ 21-11, 21-11తో కున్లావత్ విదిత్సర్న్ (థాయ్‌లాండ్)ను ఓడించి వరుసగా ఒలింపిక్స్‌లో వరుసగా రెండో స్వర్ణం సాధించాడు. కున్లావత్‌కు రజతం దక్కింది.

టేబుల్ టెన్నిస్‌లో క్వార్టర్స్‌కు..



వ్యక్తిగత పోటీలలో క్వార్టర్స్ వరకూ వెళ్లి అక్కడ భంగపడ్డ భారత ప్యాడ్లర్లు టీమ్ ఈవెంట్‌లో రాణించి మరోసారి పతకం దిశగా సాగుతున్నారు. మనికా బాత్ర, ఆకుల శ్రీజ, అర్చనా కామత్‌తో కూడిన భారత బృందం.. 3-2తో రొమేనియాను చిత్తు చేసింది. మొదట శ్రీజ-అర్చన డబుల్స్ మ్యాచ్‌లో 3-0తో గెలుపొందగా ఆ తర్వాత మనిక సైతం సింగిల్స్ మ్యాచ్‌ను సొంతం చేసుకుని భారత్‌ను 2-0 ఆధిక్యంలో నిలిపింది. కానీ శ్రీజ, కామత్ సింగిల్స్ రౌండ్లలో ఓడటంతో స్కోరు 2-2తో సమమైంది. చివరి సింగిల్స్‌లో మనిక గెలుపుతో భారత్ క్వార్టర్స్‌కు దూసుకెళ్లింది.

వెంట్రుకవాసిలో తప్పిన గురి..



షూటింగ్‌లో ఇది వరకే మూడు పతకాలు తెచ్చిన షూటర్లు మరో పతకం సాధించే అవకాశాన్ని వెంట్రుకవాసిలో కోల్పోయారు. స్కీట్ మిక్స్‌డ్ టీమ్ ఈవెంట్ బ్రాంజ్ మెడల్ మ్యాచ్‌లో మహేశ్వరి చౌహాన్, అనంత్‌జీత్‌సింగ్ నరుకాతో కూడిన భారత్ 43 పాయింట్లు స్కోరు చేయగా యిటింగ్ జియాంగ్, జియాన్లిన్ లియు ప్రాతినిథ్యం వహిస్తున్న చైనా 44 పాయింట్లు సాధించి పతకాన్ని ఎగురేసుకుపోయింది. అంతకుముందు క్వాలిఫికేషన్ రౌండ్‌లో భారత ద్వయం 146 పాయింట్లతో నాలుగో స్థానంలో నిలిచి పతక పోరుకు అర్హత సాధించింది. కానీ కీలక దశలో ఒక్క పాయింట్ తేడాతో పతకాన్ని చేజార్చుకుంది.

ముగింపు వేడుకలకు పతాకధారిగా మను



పారిస్: ఒలింపిక్స్ ముగింపు వేడుకలకు యువ షూటర్ మను భాకర్ భారత పతాకధారిగా వ్యవహరించనుంది. ఈ మేరకు భారత ఒలింపిక్ సంఘం(ఐవోఏ) ఒక ప్రకటనలో ఈ విషయాన్ని వెల్లడించింది. పారిస్‌లో భారత్‌కు కాంస్య పతకంతో బోణీ కొట్టిన మను.. రెండ్రోజుల వ్యవధిలోనే సహచర షూటర్ సరభ్‌జ్యోత్ సింగ్‌తో కలిసి రెండో పతకం సాధించింది. తద్వారా ఒకే ఎడిషన్‌లో రెండు పతకాలు సాధించిన మొదటి షూటర్‌గా రికార్డులకెక్కింది. ముగింపు వేడుకలలో పురుష పతాకధారి పేరును త్వరలో ప్రకటించనున్నారు.

ఓటమితో ఆరంభం..



సోమవారం నుంచి మొదలైన రెజ్లింగ్ పోటీలను భారత్ ఓటమితో ఆరంభించింది. మహిళల 68 కిలోల ఫ్రీ స్టయిల్ విభాగంలో పోటీపడ్డ యువ రెజ్లర్ నిషా దహియా క్వార్టర్స్‌లో 8-10తో పక్ సోల్ గమ్ (ఉత్తర కొరియా) చేతిలో ఓడింది. మూడో బౌట్ మరో 90 సెకన్లలో ముగుస్తుందనగా నిషా కుడిచేతి వేలికి గాయమవడంతో ఆమె 'పట్టు' కోల్పోయింది. మెడికల్ బ్రేక్ తర్వాత మళ్లీ బరిలోకి దిగినా నిషాకు ఓటమి తప్పలేదు. కాగా క్వార్టర్స్‌లో ఓడినా నిషాకు మరో అవకాశం ఉంది. సోల్ గమ్ ఫైనల్ చేరితే 'రెపిచేజ్' రౌండ్‌తో నిషా మరోసారి బరిలోకి దిగొచ్చు. అంతకుముందు తొలి బౌట్‌లో నిషా 6-4తో టెటియానా సొవ (ఉక్రెయిన్)ను ఓడించింది.

పతకాల పట్టిక

	దే	స్వ	ర	కా	మొ
1	చైనా	21	17	14	52
2	యూఎస్‌ఏ	19	29	27	75
3	ఆస్ట్రేలియా	13	11	8	32
4	ఫ్రాన్స్	12	15	18	45
5	బ్రిటన్	11	13	17	41
6	కొరియా	11	8	7	26
59	భారత్	0	0	3	3

దే: దేశం, స్వ: స్వర్ణం, ర: రజతం, కా: కాంస్యం మొ: మొత్తం

అమిత్‌పై ఒక మ్యాచ్ వేటు




పారిస్: భారత హాకీ జట్టు డిఫెండర్ అమిత్ రోహిదాస్ ఒక మ్యాచ్ సస్పెన్షన్‌కు గురయ్యాడు. ఆదివారం క్వార్టర్స్ పోరులో భాగంగా గ్రేట్ బ్రిటన్‌తో జరిగిన మ్యాచ్‌లో అమిత్.. ప్రత్యర్థి జట్టు ఆటగాడు కల్నన్‌ను ఉద్దేశపూర్వకంగా హాకీ స్టిక్‌తో కొట్టాడని ఆరోపిస్తూ రిఫరీ రెడ్ కార్డ్ చూపిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో అంతర్జాతీయ హాకీ సమాఖ్య (ఎఫ్ఐహెచ్) నియామవళిని అనుసరించి అమిత్‌పై ఒక మ్యాచ్ వేటు పడింది. దీంతో అతడు మంగళవారం జర్మనీతో జరిగే సెమీస్ మ్యాచ్‌కు అందుబాటులో ఉండడు. ఇదిలా ఉండగా ఈ నిర్ణయంపై హాకీ ఇండియా ఆందోళన వ్యక్తం చేస్తూ ఎఫ్ఐహెచ్ జ్యూరీ బెంచ్‌కు లేఖ రాసింది. మ్యాచ్‌లో అమిత్ కావాలని కల్నన్ తలమీద కొట్టలేదని అది యాదృచ్ఛికంగా జరిగిందని హాకీ ఇండియా వాదిస్తోంది.

100మీ. కింగ్ లైల్స్

9.79 సెకన్లతో పసిడి పతకం

ఈ భూగోళంపై అత్యంత వేగంగా పరిగెత్తే అథ్లెట్ ఎవరో తేలిపోయింది. ఒలింపిక్స్ అనగానే వెంటనే గుర్తుకు వచ్చే 100మీటర్ల స్ప్రింట్‌లో నయా చాంపియన్ దూసుకొచ్చాడు. గత కొన్నేండ్లుగా ఈ విభాగాన్ని అప్రతిహతంగా ఏలుతున్న జమైకా ఆధిపత్యానికి చెక్ పెడుతూ అమెరికా సంచలనం నోవా లైల్స్ అదిరిపోయే ప్రదర్శనతో ఆకట్టుకున్నాడు. ఆదివారం అర్ధరాత్రి(భారత కాలమానం ప్రకారం) జరిగిన పురుషుల 100మీటర్ల రేసును లైల్స్ 9.79సెకన్లలో ముగించి పసిడి పతకాన్ని సొంతం చేసుకోగా, కిషాన్ థామస్(9.79, జమైకా), కెర్లె(9.81, అమెరికా) వరుసగా రజత, కాంస్య పతకాలు సొంతం చేసుకున్నారు. అసలు మాత్రం అంచనాలు లేకుండా బరిలోకి దిగిన లైల్స్..హాట్ ఫేవరేట్లు అనుకున్న థామస్, జాకబ్స్(ఇటలీ)కు దిమ్మతిరిగే షాక్ ఇచ్చాడు. గన్ నుంచి వదిలిన బుల్లెట్‌ను తలపిస్తూ ఎనిమిది మంది స్ప్రింటర్లు పరుగు లంఘించారు. దాదాపు ప్రతీ దశలో ఒకే రీతిలో పరిగెత్తిన అథ్లెట్లు గమ్యాన్ని చేరుకునే క్రమంలో ఒకింత తడబడ్డారు. సమయం పరంగా థామస్‌తో సమంగా నిలిచిన లైల్స్ సెకనులో ఐదువేల వంతు తేడాతో పసిడి పతకాన్ని ముద్దాడాడు. వాస్తవానికి జమైకా స్ప్రింటర్ ఒబ్లిక్ సెవిల్లె(9.91సె) నోవాకు పోటీనిస్తాడని భావించినా..ఆఖరి స్థానంతో నిరాశపరిచాడు.



గ్రాహం థోర్ప్ కన్నుమూత




లండన్: ఇంగ్లండ్ మాజీ క్రికెటర్ గ్రాహం థోర్ప్ (55) కన్నుమూశారు. గత రెండేండ్లుగా తీవ్ర అనారోగ్య సమస్యలతో సతమతమవుతున్న థోర్ప్ సోమవారం తుదిశ్వాస విడిచినట్టు ఇంగ్లండ్ అండ్ వేల్స్ క్రికెట్ బోర్డు (ఈసీబీ) తెలిపింది. 1993 నుంచి 2005 వరకు ఇంగ్లండ్ తరపున ఆడిన థోర్ప్.. వంద టెస్టులు, 82 వన్డేలలో ప్రాతినిథ్యం వహించాడు. టెస్టులలో 44.66 సగటుతో 6,774 పరుగులు చేయగా వన్డేలలో 2,830 రన్స్ సాధించారు. ఆటగాడిగా రిటైర్మెంట్ ప్రకటించాక కొన్నాళ్లపాటు అఫ్గానిస్థాన్ జట్టుకు హెడ్‌కోచ్‌గా పనిచేశారు. థోర్ప్ మృతి పట్ల ఇంగ్లండ్ ప్రస్తుత, మాజీ ఆటగాళ్లు తమ సంతాపం వ్యక్తం చేశారు.

3000మీ స్టిపుల్‌చేజ్ ఫైనల్లో సాబ్లె

భారత యువ అథ్లెట్ అవినాశ్ ముకుంద్ సాబ్లె అదరగొట్టాడు. సోమవారం జరిగిన పురుషుల 3000మీ స్టిపుల్‌చేజ్ రేసులో సాబ్లె ఫైనల్స్‌కు అర్హత సాధించాడు. తద్వారా విశ్వక్రీడల్లో తుది పోరుకు అర్హత పొందిన తొలి భారత అథ్లెట్‌గా సాబ్లె నిలిచాడు. హీట్స్-2లో పోటీకి దిగిన సాబ్లె 8:15:43 సెకన్ల టైమింగ్‌తో ఐదో స్థానంలో నిలిచాడు. ఇదే రేసులో పాల్గొన్న టిండఫ్ట్(మొరాకో) అగ్రస్థానం దక్కించుకున్నాడు. తొలి రెండు ల్యాప్‌లు దూకుడు కనబరిచిన సాబ్లె..మిగిలిన ల్యాప్‌లలో ఒకింత వెనుకంజ వేశాడు. మరోవైపు మహిళల 400మీ రేసులో కిరణ్ పహల్(52.51సె) ఏడో స్థానంలో నిలిచింది.

పతకానికి ముందు ప్రశాంతత





ఉక్రెయిన్ హైజంపర్ యరొస్లవ మహుచిఖ్ తన ఫైనల్ పోటీలకు ముందు ప్రశాంతంగా నిద్రిస్తున్న దృశ్యమిది. ఈ పోటీలో ఆమె తన దేశానికి తొలి స్వర్ణాన్ని అందించింది. ఇదే ఈవెంట్‌లో అదే దేశానికి చెందిన ఇరినా గెరాషెంకొ కాంస్యం దక్కించుకుంది. గత రెండేండ్లుగా రష్యా సాగిస్తున్న దారుణ మారణకాండకు బలౌతున్న ఉక్రెయిన్‌కు ఈ పతకాలు కాస్త స్వాంతననిస్తున్నాయి.



తాటికొండలో కొత్తరాతి యుగపు ఆనవాళ్లు

పురావస్తు శాఖ పరిశోధకుడు ఈమని శివనాగిరెడ్డి వెల్లడి

భూత్పూర్, ఆగస్టు 5: మహబూబ్‌నగర్ జిల్లా భూత్పూరు మండలం తాటికొండ గ్రామ శివారులోని భైరవగుట్టపై దాదాపు 4 వేల ఏండ్లకు పూర్వం మానవుడు తయారు చేసిన కొత్తరాతి యుగపు ఆనవాళ్లను గుర్తించినట్టు పురావస్తు శాఖ పరిశోధకుడు ఈమని శివనాగిరెడ్డి తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ.. భూత్పూర్ శ్రీరామలింగేశ్వర స్వామి ఆలయ కమిటీ సభ్యుడు అశోక్ గౌడ్ విజ్ఞప్తి మేరకు గుట్టపైకి వెళ్లి పరిశీలించగా ఆ కాలంలో మానవుడు తన అవసరాల కోసం ఆయుధాల తయారీని గుర్తించినట్టు వివరించారు. ఆది మానవుడు నివాసం ఉన్న సమయంలో గొడ్డండ్లను సానబెట్టే విధానం.. 7 నుంచి 15 అంగుళాల పొడవు, రెండు-నాలుగు అంగుళాల వెడల్పు, ఒక్క అంగుళం లోతు గాళ్లు ఇప్పటికీ ఆనవాళ్లుగా ఉన్నట్టు పేర్కొన్నారు. ఆయన వెంట సత్తూర్ అశోక్ గౌడ్, బంగారు బాలకృష్ణ ఉన్నారు.

నేరం చేసిన 20 ఏండ్లకు చిక్కిన నిందితుడు

- హైదరాబాద్‌లోని ఎస్‌బీఐకి రూ.50 లక్షల కుచ్చుటోపీ
- బాబాగా అడ్రస్‌లు మార్చుతూ పరారీలో చలపతిరావు
- కోర్టు చనిపోయినట్లు ప్రకటించినా వేట వదలని దర్యాప్తుసంస్థ
- తమిళ నాడులోని ఓ కుగ్రామంలో అరెస్టు

హైదరాబాద్, ఆగస్టు 5 (నమస్తే తెలంగాణ): 20 ఏండ్లుగా ముప్పుతిప్పలు పెడుతున్న ఓ నిందితుడిని సీబీఐ ఎట్టకేలకు పట్టుకుంది. తమిళనాడులోని ఓ కుగ్రామంలో నిందితుడు చలపతిరావును అదుపులోకి తీసుకుంది. వివరాల్లోకి వెళ్తే హైదరాబాద్‌లోని చందులాల్ బారాదరి ఎస్‌బీఐ బ్రాంచ్‌లో కంప్యూటర్ ఆపరేటర్‌గా పనిచేస్తున్న వీ చలపతిరావు తన స్నేహితులు, కుటుంబసభ్యుల పేరిట నకిలీ ధ్రువీకరణ పత్రాలు సమర్పించి రూ.50 లక్షలు వాడుకున్నాడు. ఆ తర్వాత మోసాన్ని గుర్తించిన బ్యాంకు అధికారులు సీబీఐకి ఫిర్యాదు చేశారు. దీంతో 2002 మే 1న కేసు ఫైల్ అయ్యింది. 2004 నుంచి చలపతిరావు అదృశ్యమయ్యాడు. ఈ కేసులో అతడి భార్యపై కూడా సీబీఐ కేసు నమోదు చేసింది. ఏడేండ్ల తర్వాత తన భర్త చనిపోయినట్టు ప్రకటించాలని కోరుతూ హైదరాబాద్ సివిల్ కోర్టులో చలపతిరావు భార్య పిటిషన్ దాఖలు చేయడంలో వారు ఆర్డర్ ఇచ్చారు. దీంతో సీబీఐ ప్రొక్లైమెడ్ అఫెండర్ (పీఓ)గా ప్రకటించింది. చలపతిరావు ఆస్తిని జప్తు చేసేందుకు సీబీఐ ప్రయత్నించగా, అతడి భార్య హైకోర్టు నుంచి స్టే తెచ్చుకుంది.

అవతారాలు మార్చుతూ..

2007లో తమిళనాడులోని సేలం పారిపోయిన చలపతిరావు అక్కడ వినీత్‌కుమార్‌గా పేరు మార్చుకున్నాడు. ఓ మహిళను పెండ్లి చేసుకొని, ఆధార్ కార్డు కూడా సంపాదించాడు. మొదటి భార్యతో మాత్రం కాంటాక్ట్‌లోనే ఉన్నాడు. ఆ తర్వాత 2014లో భోపాల్ పారిపోయాడు. అక్కడ లోన్ రికవరీ ఏజెంట్‌గా పనిచేశాడు. 2016లో ఉత్తరాఖండ్‌లోని రుద్రాపూర్‌కు వెళ్లి అక్కడ స్కూల్ టీచర్‌గా పనిచేశాడు. అక్కడ్నుంచి 2016లో పారిపోయాడు. ఆ తర్వాత ఔరంగాబాద్‌లోని వేరుల్ గ్రామంలో ఓ ఆశ్రమానికి వెళ్లాడు. అక్కడ తన పేరును స్వామి విధితాత్మానంద తీర్థగా మార్చుకొని ఆధార్ కార్డు కూడా పొందాడు. 2021 డిసెంబర్‌లో ఆశ్రమాన్ని విడిచిపెట్టి, రాజస్థాన్‌లోని భరత్‌పూర్‌కు మకాం మార్చాడు. ఈ ఏడాది జూలై 8 వరకు అక్కడే ఉన్నాడు. అక్కడి నుంచి సముద్రమార్గం ద్వారా శ్రీలంక వెళ్లేందుకు ప్రయత్నాలు మొదలుపెట్టాడు. ఈ క్రమంలోనే తిరునెల్వేలికి చేరుకున్నాడు. అక్కడికి సమీపంలోని నర్సింగనల్లూర్ గ్రామంలో సీబీఐ ఆయనను అదుపులోకి తీసుకుంది. అతడికి ఈనెల 16 వరకు సీబీఐ కోర్టు జ్యుడీషియల్ కస్టడీ విధించింది. కేసు పునఃప్రారంభించి, విచారణ చేపడుతున్నట్టు సీబీఐ తెలిపింది.

• మంత్రికీ తప్పని తిప్పలు



వరంగల్ ప్రాంతీయ నేత్ర వైద్యశాలను సోమవారం మంత్రి కొండా సురేఖ కలెక్టర్ సత్య శారదతో కలిసి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వైద్యశాలకు చేరుకోవడానికి వాన నీటిలో నడుచుకుంటూ వెళ్లాల్సివచ్చింది. ఇటీవల కురిసిన వర్షానికి దవాఖాన ఆవరణలో నీరు నిలిచి అంతర్గత రోడ్లు పూర్తిగా నీటితో నిండిపోయాయి. శానిటేషన్ వ్యవస్థ పనిచేయకపోవడం వర్షపు నీరు అలానే ఉండిపోయింది. దీంతో రోడ్డుపై కారు దిగిన మంత్రి కలెక్టర్ సత్యశారదతో కలిసి దవాఖానలోకి వాననీటిలో నుంచే నడుచుకుంటూ వెళ్తూ ఇబ్బందిపడ్డారు. -వరంగల్ చౌరస్తా

మార్చిలో మరో ఎన్నికల సమరం!

- మూడు ఎమ్మెల్సీ స్థానాల ఎన్నికలకు కసరత్తు
- వచ్చేనెల 30 నుంచి ఓటర్ల జాబితా రూపకల్పన
- ఎన్నికల ప్రక్రియ ప్రారంభం

హైదరాబాద్, ఆగస్టు 5 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో ఉమ్మడి ఏడు జిల్లాల పరిధిలో మరోసారి రాజకీయ సందడి నెలకొననున్నది. మార్చిలో ఒక శాసనమండలి పట్టభద్రుల స్థానం, రెండు ఉపాధ్యాయ నియోజకవర్గ స్థానాలకు ఎన్నికలు జరగనున్నాయి. ఈ మేరకు ఎన్నికల ప్రక్రియను ఎలక్షన్ కమిషన్ ప్రారంభించింది. పూర్తిస్థాయి ఓటరు జాబితా షెడ్యూల్‌ను విడుదల చేసింది. వచ్చే ఏడాది మార్చి 29తో కరీంనగర్, మెదక్, నిజామాబాద్, ఆదిలాబాద్ జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ టీ జీవన్‌రెడ్డి పదవీకాలం ముగియనున్నది. ఇవే జిల్లాల పరిధి టీచర్స్ నియోజకవర్గ ఎమ్మెల్సీ కే రఘోత్తంరెడ్డి, నల్లగొండ, ఖమ్మం, వరంగల్ జిల్లాల టీచర్స్ నియోజకవర్గ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి పదవీకాలం కూడా ముగియనున్నది. ఆయా నియోజకవర్గాల పరిధిలో సెప్టెంబర్ 30 నుంచి ఓటరు జాబితా దరఖాస్తులను స్వీకరించనున్నారు. డిసెంబర్ 30న తుది ఓటరు జాబితాను ప్రకటిస్తారు. ఫిబ్రవరిలో ఎన్నికల షెడ్యూల్ విడుదలయ్యే అవకాశం ఉన్నదని, మార్చిలో ఎన్నికలు ఉంటాయని అంచనా వేస్తున్నారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన జాబ్ క్యాలెండర్, ఏడాదిలోపు రెండు లక్షల ఉద్యోగాల భర్తీ, తదితర అంశాలపై ఇప్పటికే నిరుద్యోగ యువత తీవ్ర ఆగ్రహంతో ఉన్న నేపథ్యంలో మూడు ఎమ్మెల్సీ స్థానాల ఎన్నికలు ఆసక్తికరంగా మారనున్నట్టు రాజకీయ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు.

ఓటరు జాబితా షెడ్యూల్

దరఖాస్తుల స్వీకరణ ప్రారంభం	సెప్టెంబర్ 30
దరఖాస్తుల స్వీకరణ గడువు	నవంబర్ 6
ముసాయిదా జాబితా ప్రకటన	నవంబర్ 23
ముసాయిదా జాబితాపై అభ్యంతరాలు	నవంబర్ 23 నుంచి డిసెంబర్ 9 వరకు
తుది ఓటర్ల జాబితా ప్రకటన	డిసెంబర్ 30

అమెరికాలో సిద్దిపేట యువకుడి మృతి



సాయిరోహిత్(ఫైల్)

మద్దూరు (ధూళిమిట్ట), ఆగస్టు 5: సిద్దిపేట జిల్లా ధూళిమిట్ట మండలం కూటిగల్‌కు చెందిన ఓ యువకుడు అమెరికాలో అనుమానాస్పదంగా మృతి చెందాడు. తుషాలపురం మంగవ్వ-మహదేవ్‌ల పెద్ద కుమారుడు సాయి రోహిత్ (23) హైదరాబాద్ సీవీఆర్ కాలేజీలో 2022లో బీటెక్ పూర్తి చేశాడు. ఎమ్మెస్సీ చదివేందుకు నిరుడు డిసెంబర్ 20న అమెరికాకు వెళ్లాడు. వాషింగ్టన్ సియోటెల్‌లోని యూనివర్సిటీ ఆఫ్ మిస్సోరి కాలేజీ యూనియన్ బ్రాంచ్‌లో చదువుకుంటూ స్నేహితులతో కలిసి రూమ్‌లో ఉంటున్నాడు. జూలై 22న బయటకెళ్లి, తిరిగి క్యాబ్‌లో రూముకు వస్తుండగా కొంత దూరం రాగానే మరో క్యాబ్‌లోకి మారాడు. అప్పటి నుంచి కనిపించకుండా పోయాడని స్నేహితుడు అవినాశ్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. తానా సహాయంతో సాయిరోహిత్ కోసం వెతకగా జూలై 24న సమానుష్ సరస్సులో మృతదేహం లభ్యమైంది. జూలై 25న సాయిరోహిత్ మృతి విషయమై స్నేహితులు కూటిగల్‌లోని కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు.


Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No. 437, Near Velama Kalyana Mandapam, Devera Yanjaal, Shamirpet Mandal, Dist: Medchal - 500 078.
Published At Telangana Publications Pvt Ltd. 8-2-603/1/7,8,9. Krishnapuram, Road No.10, Banjara Hills, Hyderabad, 500 034, Telangana State. Editor: **Thigulla Krishna Murthy.** Ph: +91 40 2329 1999, Fax: +91 40 2333 4242, 040-23291118, Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/37693.



పతాక ఘట్టాల్లో 'పుష్ప-2'

విడుదల ఆలస్యం అవుతున్నా.. 'పుష్ప 2' క్రేజ్ మాత్రం అంతకంతకూ పెరుగుతూనే ఉంది. టీజర్‌తో పాటు విడుదలైన రెండు పాటలకు అనూహ్యమైన స్పందన రావడంతో సినిమాపై అంచనాలు అమాంతం పెరిగాయి. దేవిశ్రీ సంగీతం, చంద్రబోస్ సాహిత్యం, బన్నీ స్టైల్, స్టెప్స్, రష్మిక అందచందాలు.. వీటన్నింటికీ అందరూ ఫిదా అయిపోతున్నారు. ప్రస్తుతం హైదరాబాద్ ఆర్‌ఎఫ్‌సీలో భారీ వ్యయంతో నిర్మించిన సెట్‌లో ఈ సినిమా పతాక సన్నివేశాలను దర్శకుడు సుకుమార్ తెరకెక్కిస్తున్నారు. ఈ సీక్వెన్స్ సినిమాకే హైలైట్‌గా ఉండనుందని మేకర్స్ చెబుతున్నారు. డిసెంబర్ 6న విడుదల కానున్న ఈ చిత్రం మైత్రీ మూవీమేకర్స్, సుకుమార్ రైటింగ్స్ బ్యానర్లపై తెరకెక్కుతున్నది. నవీన్ ఎర్నేని, వై.రవిశంకర్ ఈ చిత్రానికి నిర్మాతలు.

రెండు భాగాలుగా 'వీడీ 12'



విజయ్ దేవరకొండ హీరోగా గౌతమ్ తిన్ననూరి దర్శకత్వంలో ఓ యాక్షన్ డ్రామా తెరకెక్కుతున్న విషయం తెలిసిందే. 'వీడీ 12' వర్కింగ్ టైటిల్‌తో రూపొందిస్తున్నారు. సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకంపై సూర్యదేవర నాగవంశీ నిర్మిస్తున్నారు. వచ్చే ఏడాది మార్చి 23న విడుదల చేయనున్నట్లు ఇటీవలే నిర్మాతలు ప్రకటించారు. ఈ సినిమా ఫస్ట్‌లుక్ పోస్టర్ అభిమానుల్లో అంచనాలను పెంచింది. తాజాగా ఈ సినిమా గురించి ఓ ఇంట్రెస్టింగ్ అప్‌డేట్‌ను అందించారు నిర్మాత నాగవంశీ. రెండు భాగాలుగా ఈ చిత్రాన్ని తెరకెక్కించబోతున్నామని తెలిపారు. 'రెండు పార్టులకు సరిపోయే కంటెంట్ రెడీగా ఉంది. దర్శకుడు గౌతమ్ తిన్ననూరి కథను అద్భుతంగా తీర్చిదిద్దుతున్నారు. మొదటి భాగం ఫలితం ఆధారంగా రెండో భాగం నిర్మాణం గురించి ఆలోచిస్తాం. ఈ సినిమా భారీ విజయం సాధిస్తుందనే నమ్మకం ఉంది' అన్నారు. ఈ సినిమాలో విజయ్ దేవరకొండ పోలీస్ అధికారి పాత్రలో కనిపించనున్నారు.

పొట్ట చెక్కలయ్యేలా నవ్విస్తాం..



'ఇది పక్కా గోదారోళ్ల సినిమా. నవ్వి నవ్వి థియేటర్ల నుంచి బుగ్గలు, పొట్ట నొప్పితో బయటకు వస్తారని గ్యారెంటీగా చెప్పగలను. పిఠాపురంలో ఈ వేడుక జరపడం ఆనందంగా ఉంది. మా సంగీత దర్శకుడు రామ్ మిర్యాలది ఈ ఊరే అని ఇప్పుడే తెలిసింది. అందుకే.. ఇందులోని పాటల్ని అద్భుతంగా కంపోజ్ చేశారాయన. అందరికీ నచ్చేలా సినిమా ఉంటుంది.' అని బన్నీ వాస్ అన్నారు. నార్నే నితిన్, నయన్ సారిక జంటగా నటించిన చిత్రం 'ఆయ్'. అంజి కె.మణిపుత్ర దర్శకుడు. అల్లు అరవింద్ సమర్పణలో బన్నీ వాసు, విద్యా కొప్పినీడి ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఈ నెల 15న సినిమా విడుదల కానుంది. ఈ సందర్భంగా ఈ సినిమా ట్రైలర్‌ని పిఠాపురంలో విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో బన్నీవాసు మాట్లాడారు. తమ కష్టానికి తగ్గ ప్రతిఫలాన్ని మీరంతా సక్సెస్ రూపంలో ఇవ్వాలని నార్నె నితిన్ ఆశాభావం వ్యక్తం చేశారు. ట్రైలర్ ఎంత ఎంజాయ్ చేశారో, సినిమాను అంతకు మించి ఎంజాయ్ చేస్తారని, నవ్విస్తూనే చిన్న చిన్న ఎమోషన్స్ టచ్ చేశామని దర్శకుడు అంజి కె.మణిపుత్ర చెప్పారు. ఇంకా చిత్ర యూనిట్ సభ్యులతో పాటు పిఠాపురం మాజీ ఎమ్మెల్యే వర్మ, ఏపీ తెలుగు రైతు అధ్యక్షుడు మర్రెడ్డి శ్రీనివాస్ కూడా మాట్లాడారు.



ప్రభాస్‌తో జోడీగా?

చిత్రసీమలో కొన్ని కాంబినేషన్స్ ఎప్పుడూ కొత్తగానే అనిపిస్తాయి. అలాంటి వాటిలో ప్రభాస్-త్రిష జోడీ ఒకటి. వెండితెరపై హిట్‌పెయిర్‌గా గుర్తుంపుతెచ్చుకుందీ జంట. వారిద్దరు కలిసి నటించిన 'వర్షం' 'బుజ్జిగాడు' 'పౌర్ణమి' చిత్రాలు అభిమానులను ఎంతగానో అలరించాయి. ముఖ్యంగా 'వర్షం' సినిమాలో ప్రభాస్, త్రిష మధ్య పండిన కెమిస్ట్రీని ఎప్పటికీ మరచిపోలేం. తాజా సమాచారం ప్రకారం ఈ హిట్ పెయిర్ మరోసారి ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమవుతున్నట్లు తెలిసింది. సందీప్‌రెడ్డి వంగా దర్శకత్వంలో ప్రభాస్ 'స్పిరిట్' చిత్రంలో నటించబోతున్న విషయం తెలిసిందే. ఇందులో ప్రభాస్ పోలీస్ పాత్రలో కనిపించనున్నారు. ఈ సినిమాలో త్రిషను కథానాయికగా ఖరారు చేయబోతున్నారనే వార్తలు వినిపిస్తున్నాయి. ఇప్పటికే ఈ విషయంలో ప్రాథమిక చర్చలు పూర్తయ్యాయని, త్వరలో అధికారిక ప్రకటన వెలువడుతుందని అంటున్నారు. ఈ ఏడాది చివరలో 'స్పిరిట్' సెట్స్‌మీదకు వెళ్లనుందని సమాచారం. ఇదిలావుండగా ఇటీవలే త్రిష 'బృంద' సిరీస్‌తో ప్రేక్షకుల ముందుకొచ్చింది. ఇందులో ఆమె అభినయానికి ప్రశంసలు లభిస్తున్నాయి.

మెకానిక్ రాకీ రాగాలు



విశ్వక్‌సేన్ నటిస్తున్న కామెడీ ఎంటర్‌టైనర్ 'మెకానిక్ రాకీ'. మీనాక్షి చౌదరి, శ్రద్ధా శ్రీనాథ్ కథానాయికలు. రవితేజ ముళ్లపూడి దర్శకుడు. రామ్ తాళ్లూరి నిర్మాత. అక్టోబర్ 31న దీపావళి కానుకగా సినిమా విడుదల కానుంది. ఈ సందర్భంగా మేకర్స్ ఈ సినిమా ప్రమోషన్స్‌ని వేగవంతం చేశారు. ఇందులో భాగంగా ఈ సినిమాలో 'గుల్లెడు గుల్లెడు..' అంటూ సాగే తొలి పాటను ఈ నెల 7న విడుదల చేయనున్నట్టు మేకర్స్ ప్రకటించారు. సోమవారం ఈ పాటకు సంబంధించిన పోస్టర్‌ని కూడా విడుదల చేశారు. విశ్వక్, మీనాక్షి చౌదరిపై ఈ పాట చిత్రీకరించినట్టు పోస్టర్ చెబుతున్నది. ట్రైయాంగిల్ లవ్‌స్టోరీగా తెరకెక్కుతున్న ఈచిత్రంలో నరేష్, వైవా హర్ష, హర్షవర్ధన్, రోడీస్ రఘురామ్ ఇతర పాత్రధారులు. ఈ చిత్రానికి కెమెరా: మనోజ్ కాటసాని, సంగీతం: జేక్స్ బిజోయ్, నిర్మాణం: ఎస్ ఆర్‌టి ఎంటర్‌టైన్‌మెంట్స్.



నష్టపరిహారంగా 60లక్షలు

అనుమతి లేకుండా తన పాటల్ని ఎవరైనా వాడుకుంటే వాళ్లపై లీగల్‌గా యాక్షన్ తీసుకుంటున్నారు లెజెండ్రీ మ్యూజిక్ డైరెక్టర్ ఇళయరాజా. రీసెంట్‌గా 'మంజుమల్ బాయ్స్' నిర్మాతలకు ఆయన లీగల్ నోటీసులు జారీ చేసిన విషయం తెలిసిందే. 'గుణ' సినిమాలో తాను ట్యూన్ చేసిన 'కమ్మనీ ఈ ప్రేమలేఖనే రాసింది హృదయమే..' పాటను తన అనుమతి లేకుండా వాడుకున్నారనీ, కాపీరైట్స్ యాక్ట్ ప్రకారం ఇది నేరమని, దీనిపై రెండుకోట్ల నష్టపరిహారం చెల్లించాలని ఇళయరాజా డిమాండ్ చేశారు. లీగల్ నోటీసులు అందుకున్న 'మంజుమ్మల్ బాయ్స్' నిర్మాతలు సౌబిన్ షాహిర్, బాబు షాహిర్, షాన్ ఆంటోనీలు ఇళయరాజాను వ్యక్తిగతంగా కలిసి, చర్చలు నిర్వహించి, చివరకు 60 లక్షలకు మేటర్ సెటిల్ సెటిల్ చేసుకున్నట్టు తెలుస్తున్నది. ఇళయరాజా ఇలా ప్రవర్తించడంపై పలు విమర్శలు కూడా తలెత్తుతున్నాయి.



ఆయన భార్యగా గర్విస్తా

వివాహానంతరం కూడా నటిగా బిజీబిజీగా ఉన్నది ఢిల్లీభామ తాప్సీ పన్ను. ఆమె నటించిన ఫిర్ ఆయీ హసీనా దిల్‌రుబా, ఖేల్ ఖేల్ మే చిత్రాలు విడుదలకు సిద్ధమయ్యాయి. ఈ సందర్భంగా ప్రమోషన్స్‌లో బిజీగా ఉన్నది తాప్సీ. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో తన పెళ్లి గురించి, తన భర్త మథియాస్ బో గురించి ఆసక్తికరంగా మాట్లాడింది తాప్సీ. 'నా భర్త పేరెన్నికగన్న వ్యాపారవేత్తకాదు. అలాగే స్టార్ క్రికెటర్ కూడా కాదు. అందుకే ఆయన గురించి ఎవరూ పెద్దగా మాట్లాడుకోరు. చాలామందికి తెలీని విషయం ఏంటంటే.. ఆయన అంతర్జాతీయ స్థాయిలో ఎన్నో అపూర్వ విజయాలను అందుకున్న బ్యాడ్మింటన్ ప్లేయర్. కొన్ని రంగాల వల్ల కొందరు లైమ్‌లైట్‌లో ఉంటారు. సినిమా వాళ్లను, క్రికెటర్లను సమాజం స్టార్లుగా చూస్తుంది. బ్యాడ్మింటన్ ఆటగాళ్లకు అంత గ్లామర్ ఉండదు. ఇది నిజంగా బాధాకరం. కానీ నేను మాత్రం ఓ అంతర్జాతీయ ఆటగాడి భార్యగా ఎప్పుడూ గర్విస్తా' అని చెప్పుకొచ్చింది తాప్సీ. డెన్మార్క్ బ్యాడ్మింటన్ ప్లేయర్ మథియాస్ బోతో తాప్సీ గత తొమ్మిదేళ్లుగా రిలేషన్‌లో ఉంది. ఈ ఏడాది మార్చి 23న ఈ జంట పెళ్లితో ఒకటైంది. ఉదయ్‌పూర్ వేదికగా బంధుమిత్రుల సమక్షంలో ఈ వివాహం జరిగిన విషయం తెలిసిందే.



మంచి సినిమాకు దక్కిన అవార్డులు

ఇటీవల జరిగిన ఫిల్మ్‌ఫేర్ సౌత్ అవార్డుల్లో 'బేబీ' చిత్రం ఐదు అవార్డులను దక్కించుకున్న విషయం తెలిసిందే. ఈ సందర్భంగా సోమవారం చిత్ర బృందం పాత్రికేయులతో ముచ్చటించింది. చిత్ర దర్శకుడు సాయిరాజేష్ మాట్లాడుతూ '8 నామినేషన్స్‌కుగాను 5 దక్కడం చాలా సంతోషంగా ఉంది. మా సినిమాకు క్రిటిక్స్ మెచ్చిన బెస్ట్ మూవీ అవార్డు దక్కడం చాలా ఆనందంగా ఉంది. కల్ట్‌మూవీ తీస్తున్నామని షూటింగ్ సందర్భంగా దర్శకుడు మారుతి ఎంతగానో ప్రోత్సహించారు. మీ అందరి సహకారంతో భవిష్యత్తులో మరిన్ని మంచి సినిమాలు చేయాలనుకుంటున్నాం' అన్నారు. చిన్న చిత్రాలకు అవార్డులు రావని నిరాశ పడేవారికి ఉత్సాహాన్నిచ్చేలా 'బేబీ' చిత్రానికి అవార్డులు రావడం చాలా ఆనందంగా ఉందని, దర్శకుడు సాయిరాజేష్ ప్రతిభపై తనకు మొదటి నుంచి నమ్మకం ఉందని దర్శకుడు మారుతి చెప్పారు. ఈ సినిమా తమకు ఎన్నో గొప్ప జ్ఞాపకాలను మిగిల్చిందని, రివార్డులతో పాటు అవార్డులూ రావడం ఆనందంగా ఉందని చిత్ర నిర్మాత ఎస్‌కేఎన్ తెలిపారు. ఆనంద్ దేవరకొండ, విరాజ్ అశ్విన్, వైష్ణవి చైతన్య ప్రధాన పాత్రల్లో సాయి రాజేష్ దర్శకత్వంలో రూపొందిన 'బేబీ' చిత్రం కమర్షియల్‌గా భారీ విజయాన్ని సాధించింది.



చుట్టమల్లె చుట్టేస్తావే తుంటరి చూపు..

ఎన్టీఆర్ 'దేవర' సినిమా మ్యూజికల్ ప్రమోషన్స్‌ని మేకర్స్ వేగవంతం చేశారు. ఇప్పటికే ఈ సినిమాలోని తొలిపాట 'ఫియర్ సాంగ్' మాస్ ప్రేక్షకుల్ని విశేషంగా ఆకట్టుకుంటున్న విషయం తెలిసిందే. సోమవారం రెండోపాట విడుదలైంది. 'చుట్టమల్లె చుట్టేస్తావే తుంటరి చూపు.. ఊరికే ఉండదు కాసేపు.. అస్తమానం నీ లోకమే నా మైమరపు.. చేతనైతే నువ్వే నన్నాపు..' అంటూ హీరోయిన్ పాయింట్ ఆఫ్‌వ్యూలో సాగే ఈ పాటను రామజోగయ్యశాస్త్రి రాయగా, అనిరుధ్ స్వరపరిచారు. శిల్పారావు ఆలపించారు. కథానాయకుడిపై తనకున్న ప్రేమను కథానాయిక ఆవిష్కరించేలా సాహిత్యం, చిత్రీకరణ సాగింది. ఎన్టీఆర్, జాన్వీకపూర్‌లపై మోస్ట్ రొమాంటిక్‌గా దర్శకుడు కొరటాల శివ ఈ పాటను తెరకెక్కించినట్టు తెలుస్తున్నది. రత్నవేలు ఛాయాగ్రహణం విజువల్ వండర్‌గా సాగింది. ఈ పాటలో ఎన్టీఆర్ స్టైలిష్‌గా కనిపిస్తుంటే, జాన్వీ గ్లామర్ అవతార్‌లో యూత్‌ని ఆకట్టుకునేలా ఉంది. రెండు భాగాలుగా ఈ సినిమా రూపొందుతున్న విషయం తెలిసిందే. సెప్టెంబర్ 27న 'దేవర 1' విడుదల కానుంది. సైఫ్ అలీఖాన్ విలన్‌గా నటిస్తున్న ఈ చిత్రానికి మిక్కిలినేని సుధాకర్, హరికృష్ణ.కె నిర్మాతలు. సమర్పణ: నందమూరి కళ్యాణ్‌రామ్.



స్వేచ్ఛ కోసం చేసే పోరాటం

'పా రంజిత్ నా అభిమాన దర్శకుడు. ఆయనతో సినిమా చేయాలని ఎప్పటి నుంచో అనుకుంటున్నా. యూనివర్సల్ అప్పీల్ ఉన్న కథ ఇది. ఇందులో స్వేచ్ఛ కోసం చేసే పోరాటం ప్రధానాంశంగా ఉంటుంది' అన్నారు చియాన్ విక్రమ్. ఆయన కథానాయకుడిగా నటించిన తాజా చిత్రం 'తంగలాన్' ఈ నెల 15న ప్రేక్షకుల ముందుకురానుంది. పా రంజిత్ దర్శకత్వంలో పీరియాడిక్ మూవీగా తెరకెక్కించారు. సోమవారం జరిగిన పాత్రికేయుల సమావేశంలో విక్రమ్ మాట్లాడుతూ 'బంగారం వేట చుట్టూ ఈ కథ నడుస్తుంది. అసమానతలకు గురైన ఓ తెగ స్వేచ్ఛ కోసం ఎలాంటి పోరాటం చేశారన్నది స్ఫూర్తివంతంగా ఉంటుంది. తంగలాన్ అన్నది ఓ తెగ పేరు. ఈ సినిమా కోసం చాలా కష్టపడ్డాను. మేకప్ కోసం గంటల కొద్దీ సమయం పట్టేది. మనకు ఇష్టమైన పని దొరికినప్పుడు ఆకలి, నిద్ర మరచిపోతాం. ఈ పాత్రను ఎంతగానో ఇష్టపడి చేశాను కాబట్టి షూటింగ్ జరిగిన ప్రతి రోజుని ఎంజాయ్ చేశాను. అవార్డులు నాకు ఇష్టమే కానీ..అంతకంటే ముఖ్యంగా ప్రేక్షకుల ప్రశంసలు ఎక్కువ సంతోషాన్నిస్తాయి' అన్నారు. ఈ సినిమాలో తాను ఆరతి అనే పాత్రలో కనిపిస్తానని, ఇండియన్ ఫిల్మ్ ఇండస్ట్రీలో ఇటీవలకాలంలో రూపొందిన టఫెస్ట్ మూవీ ఇదేనని కథానాయిక మాళవిక మోహనన్ తెలిపింది. ఈ సినిమాలో దర్శకుడు పా రంజిత్ ఓ కొత్త ప్రపంచాన్ని క్రియేట్ చేశారని మరో నాయిక పార్వతీ తిరువోతు పేర్కొంది.



క్రేజీ ప్రాజెక్ట్‌ని క్యాచ్ చేసింది

కార్తీ బ్లాక్‌బస్టర్ 'సర్దార్' సినిమాకు సీక్వెల్‌గా 'సర్దార్ 2' తెరకెక్కుతున్న విషయం తెలిసిందే. ఈ సినిమా షూటింగ్ చెన్నై శివార్లలో నిర్మించిన భారీసెట్స్‌లో మొదలైంది. ప్రీక్వెల్ దర్శకుడు పిఎస్ మిత్రన్ 'సర్దార్ 2'కి కూడా దర్శకత్వం వహిస్తున్నారు. మాళవిక మోహనన్ కథానాయిక. ఈ సినిమాకు సంబంధించిన మరో క్రేజీ అప్‌డేట్‌ని మేకర్స్ ప్రకటించారు. 'సర్దార్ 2'లో అషికా రంగనాథ్ మరో ఫీమేల్ లీడ్‌గా కనిపించనుంది. ఆమె పుట్టిన రోజు సందర్భంగా సోమవారం ఆమెకు శుభాకాంక్షలు తెలుపుతూ, ప్రాజెక్ట్‌లోకి స్వాగతం పలికారు. ఎస్.జె.సూర్య పవర్‌ఫుల్ రోల్ పోషిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: జార్జ్ సి.విలియమ్స్, సంగీతం: యువన్‌శంకర్‌రాజా, నిర్మాత: ఎస్.లక్ష్మణ్‌కుమార్, నిర్మాణం: ప్రిన్స్ పిక్చర్స్.



'కన్నప్ప'లో దేవరాజ్

మంచు విష్ణు టైటిల్ రోల్‌ని పోషిస్తున్న 'కన్నప్ప' చిత్రం నుంచి ప్రతి సోమవారం ఓ అప్‌డేట్‌ను విడుదల చేస్తున్నారు. ఈ పాన్‌ఇండియా చిత్రంలో మోహన్‌లాల్, మోహన్‌బాబు, అక్షయ్ కుమార్, శరత్‌కుమార్, ప్రభాస్ వంటి అగ్ర తారలు భాగమవుతున్న విషయం తెలిసిందే. సోమవారం ఈ సినిమా నుంచి దేవరాజ్ పాత్రకు సంబంధించిన ఫస్ట్‌లుక్‌ను విడుదల చేశారు. ఇందులో ఆయన ఓ తెగకు చెందిన నాయకుడి పాత్రలో కనిపిస్తారని, కథాగమనంలో ఆయన క్యారెక్టర్ కీలకంగా ఉంటుందని చిత్ర బృందం పేర్కొంది. శివుడి అపరభక్తుడైన కన్నప్ప ఇతివృత్తంతో ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. మంచు మోహన్‌బాబు నిర్మిస్తున్న ఈ చిత్రానికి ముఖేష్ కుమార్ సింగ్ దర్శకత్వం వహిస్తున్నారు. షూటింగ్ చివరి దశకు చేరుకుంది. డిసెంబర్‌లో విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు.